అమ్మ వాత్సల్య జలధిలో







తంగిరాల రాధాకృష్ణమూర్తి

అమ్మ వాత్సల్య జలధిలో



శ్రీ తంగిరాల రాధాకృష్ణమూర్తి

ప్రథమ ముద్రణ
15.4.05
పార్థివ చైత్రశుద్ధ సప్తమి

సర్వస్వామ్య సంకలితము
ప్రతులు 1000



అకాలంలో అమ్మలో లీనమైన
అనురాగమూర్తి ఆదర్శమూర్తి
శ్రీ తంగిరాల రాధాకృష్ణమూర్తి గారు
మా పితృపాదులు వారు వ్రాసిన
ఈ గ్రంథకుసుమం
వారి పాదపద్మాలకే సమర్పితము

బిడ్డలు
సతీష్ - కిరణ్ - శైలజ

ప్రతులకు

తంగిరాల సతీష్
9-126/1, HMT Nagar
Hyderabad - 500 026

శ్రీ విశ్వజననీపరిషత్
జిల్లెళ్ళమూడి - 522 113
గుంటూరు జిల్లా. ఆం.ప్ర.



ఆదర్శమూర్తికి భక్త్యంజలి

నాన్నగారూ !

మీ బాల్యాన్ని గూర్చి ఇతరులు చెపుతుంటే మీ అమ్మకు మీరెంత ముద్దుబిడ్డో - మాకర్థమైంది. కన్నతల్లికి ఏ బిడ్డడైనా ముద్దే కాని మీలోని నిష్కల్మషతను మంచితనాన్ని అమాయకత్వాన్ని గమనించిన మీ అమ్మ మిమ్మల్ని ఇంకా ఎక్కువ ప్రేమించేదని, ఎక్కువ ముద్దు చేసేదని తెలుసుకొన్నాం. మిమ్మల్ని కన్నతల్లే కాదు. అందర్నీ కన్నతల్లి (జగన్మాత - అనసూయాదేవి) కూడా మిమ్మల్ని గారాబం చేసేదని తెలుసుకొని ఎంతో ఆనందించాం. మమ్మల్ని చదివించడంలో, మా ఉన్నతికి పాటుపడటంలో మీరు చూపించిన ఆప్యాయత, విజ్ఞత మా హృదయాలలో మీకు అత్యున్నత స్థానాన్ని నిలబెట్టింది. మా అమ్మ సామర్థ్యం పట్ల మీకున్న నమ్మకం, మీ పట్ల మీ మాటపట్ల మీ ఆలోచనల పట్ల, మా అమ్మకున్న అనురాగం గౌరవం మేము పెరుగుతున్న కొద్దీ గమనిస్తూనే ఉన్నాం. మా వ్యక్తిత్వాన్ని మీ ఇద్దరూ తీర్చిదిద్దిన విధానం మా పట్ల మీరు నిర్వహించిన కర్తవ్యము బాధ్యత మమ్మల్ని మీ ఆరాధకులను చేశాయి. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిధిదేవోభవ అనే వేదవాక్యాలు

మీ రెట్లా పాటించారో చూసి మాకు ఆచరణ సూచకము ఆదర్శము కావటం మా అదృష్టం.

ఇప్పుడిప్పుడే జీవితంలో స్థిరపడుతున్న మాకు, విశ్రాంత జీవితంలో మనమళ్ళతో మనుమరాళ్ళతో కాలక్షేపం చేస్తూ, సూచనలిస్తూ మార్గదర్శనం చేయవలసిన మీరు అనారోగ్యం పాలై నిరంతరం అమ్మ ధ్యానంతో దేహత్యాగం చేయటం మమ్మల్ని శోక సముద్రంలో ముంచివేసింది. నడిసంద్రంలో అంధకారంలో చుక్కానిలేని నావలవలె ఉన్న మా జీవితాలకు ఆశాదీపం మమ్మల్ని కన్నతల్లి, అందరినీ కన్నతల్లి మాత్రమే. మీరు లేని లోటు తీర్చలేనిది.

మీరు ఈ భౌతిక వేదననుండి ముక్తులై 'జగన్మాత' అమ్మను చేరారని తృప్తిపడాలో మా శేషజీవితాలలో మిమ్మల్ని భౌతికంగా చూడలేమని బాధపడాలో పాలు పోవడం లేదు. అమ్మ సన్నిధిలో అలౌకికమైన ఆనందాన్ని అనుభవిస్తున్నారని మా ప్రగాఢవిశ్వాసం. అందరికీ సుగతిని ప్రసాదించే జగదీశ్వరి కదా అమ్మ. మీ నుండి మేం నేర్చుకున్న పాఠాలను, మీరు మాకు మిగిల్చి వెళ్ళిన జ్ఞాపకాలను కలబోసుకొని మీరు నేర్పిన విలువలను మా జీవితాలలో పాటిస్తాం. మాకు సాటిలేని సంపదగా, అందగా, అప్పగించి వెళ్ళిన మా అమ్మను ఏ బాధకలుగకుండా చూచుకుంటాం.

అందరమ్మ వాత్సల్యజలధిలో అందరింటిలో మీరు పొందిన అనుభూతి తరంగాలను మీరు వెల్లడించినంత వరకూ ఒక గ్రంథంగా ప్రచురించి మీ గుర్తుగా లోకానికి అందించాలని భావించాం ఈ విషయంలో మాకు చేదోడు వాదోడుగా ఉన్న మీ సోదరుడు మాకు ఆప్తుడు శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ గారికి కృతజ్ఞతాభి వందనలు.

సదా మీ స్మరణలో – మీకుటుంబం

సతీష్ - తనూజ

హైదరాబాద్

కిరణ్ - అరవింద

15-4-2005

శైలు - సూర్యప్రభాకర్

అమ్మబిడ్డలలో ఒక్కొక్కరి జీవితం ఒక్కొక్క గ్రంథం



పురుషోత్తమపుత్రభార్గవ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్

1961, 62లలో 'హైమ' పర్చూరులో డాక్టర్ తంగిరాల సత్యనారాయణ గారింట్లో ఉన్నది. హైమకోసం నేను పర్చూరు వెళ్ళాను. అక్కడ సత్యనారాయణగారి కుటుంబంతో పరిచయం ఏర్పడింది. అంతకు ముందే వాళ్ళు జిల్లెళ్ళమూడి వచ్చి పోతున్నారు. ***1963***లో అమ్మకు కిరీటము, త్రిశూలము, చక్రము, శంఖముల చేయించారు.

శాస్త్రి, రాధ గుంటూరులో చదువుకునే రోజులు. తరచుగా జిల్లెళ్ళమూడి వస్తూ పోతూ ఉండేవారు. జిల్లెళ్ళమూడిలో గుంటూరులో కలుస్తుండేవాళ్ళం. రాధ మంచి అందగాడు. అయితే అమాయకుడు. తెల్లని వన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్లూ అనుకునే మనస్తత్వం. వీడి అమాయకత్వానికి వాళ్ళ అమ్మ ఎట్లా బ్రతుకుతాడో వీడు అని బాధపడుతూ కాస్త కనిపెట్టి చూస్తుండు నాయనా ! వీడ్ని అని చెపుతుండేది. కారణమేమైనా రాధతో నా అనుబంధం పెరుగుతూ వచ్చింది. హైమకు అత్యంత ఇష్టులైనవాళ్ళలో రాధకూడా ఒకడు. అమ్మ రాధవాళ్ళ అమ్మకు వాడి సంగతి నేను చూసుకుంటానని మాట ఇచ్చింది. అలాగే రాధతో కూడా నీ వెక్కడున్నా నీ వెంట నేనుంటానని భరోసా ఇచ్చింది. అలాగే అన్ని విషయాలలో అన్ని వేళలా చూచుకున్నది.

ఇక అమ్మతో రాధకున్న అనుబంధాన్ని గూర్చి రాధమాటలలోనే ఈ గ్రంథంలో విస్తృతంగా వివరించబడింది. ఇక రాధ జీవిత భాగస్వామినిగా వచ్చింది లక్ష్మి. లక్ష్మి నిజంగా రాధ గృహలక్ష్మి. కల్మషంలేని మనస్సు కలిగిన పరిశుద్ధుడైన రాధను

కవచంలా కాపాడింది లక్ష్మి. నలుగురితో చనువుగా మసలే మనస్తత్వం రాధను సాధ్యమైనంత వరకు సంతృప్తి పరచాలనే ఆలోచన, పెళ్ళికిముందు జిల్లెళ్ళమూడి వాతావరణంతో పరిచయం లేకపోయినా ఆ సోదరీ సోదరులతో కలసి పోవడం చూస్తే లక్ష్మిలో ఎంతో సభ్యత సంస్కారము ఉన్నాయని అనిపిస్తుంది.

రాధకు ఇష్టమైన వాళ్ళకు సహాయం చేయడంలో, మర్యాదలు చేయడంలో లక్ష్మి ఎన్నడు వెనుకడుగు వేయలేదు. సింగుపాలెం జానకి కుటుంబాన్ని హైదరాబాద్ తెచ్చి అండగానిలవడంలోనే లక్ష్మి మనస్సు అర్థమౌతుంది. ఇక ఆ కుటుంబంలో పిల్లలు తల్లిదండ్రుల పట్ల చూపించే ప్రేమ, గౌరవము, ఆదరము ముచ్చట గొలుపుతున్నాయి. క్రొత్తగా నిర్మించిన ఇంటిలో వాళ్ళ నాన్నకు ఇష్టమైన పూజామందిరాన్ని ఏర్పాటు చేశారు. సంతోషం. అలాగే జిల్లెళ్ళమూడితో, అమ్మతో ఉన్న అనుబంధాన్ని కూడా నిలుపుకుంటారనే ఆశిద్దాం.

తండ్రిపై శ్రద్ధాసక్తులున్నందవల్లనే రాధ అమ్మపై వ్రాసిన రచనలన్నీ సేకరించి స్మృతి చిహ్నంగా ప్రచురించాలని భావించారు. పూర్వం ఎవడొకవి చెప్పాడు.

"గుడి కూలును నుయిపూడును
వడి నీళ్ళంచెరువు తెగును వనములు ఖిలమౌ
చెడనిది గ్రంథమ్మొక్కటే"

– అన్న మాటకు చిహ్నంగా ఈ గ్రంథం శాశ్వతంగా భావితరాలకు అమ్మ బిడ్డలతో ఆడుకున్న ఆనందతరంగాలు తెలియచేస్తుంది.

సహజమైన వ్యావహారిక భాషలో భావము భాష పడుగు పేకల వలె అల్లుకుపోయాయి. సోదరుడు సింహాద్రిశాస్త్రి, నేను రాధను రచన చేయటానికి ప్రోత్సహించాము. చక్కని రచనలు వచ్చినవనే సంతృప్తి మాకున్నది. ఈలాంటి రచనలు ఎన్నో అమ్మ భక్తుల నుండి రావలసి ఉన్నది. అమ్మతో అనుబంధం ఉన్న ఒక్కొక్కరి జీవితం ఒక్కొక్క గ్రంథమని నాకు తెలుసు. బయటకు రావాలి. అందుకు సమయం రావాలి. అమ్మ అనుగ్రహం కావాలి.

❖❖❖

అమ్మ కుటుంబంలో ఆప్యాయతలు

ఆంజనేయులు గారూ !

మొన్న (అంటే వారం రోజుల క్రితం) రవి, రావూరి ప్రసాద్‌తో కలిసి, మీరూ మా యింటికి వచ్చారు. ఎంతో ఆనందమయింది. అనారోగ్యంతో యింట్లోంచి బయటికి వెళ్ళే పరిస్థితిలో లేని నన్ను చూడటానికి మీ ముగ్గురూ వచ్చారు. మాటల సందర్భంలో, "ఏరా! మా మేగజైన్‌కు ఆర్టికల్ రాసి యివ్వరా!" అన్నారు. ఏం రాయమంటారు? మీరందరూ వచ్చినందుకు ఆనందంతో కళ్ళ నీళ్ళ పర్యంతమైంది. మీరు ఎందుకు వచ్చారు ? యీ అనుబంధం ఎక్కడిది ? యెవరిచ్చారు ? మనం ఒకళ్ళ ఇంటికి ఒకళ్ళు వెళ్ళటం చాలా కాలం నుంచి జరిగే విషయమే. ఇదంతా అమ్మ ఇచ్చిన వరమే కదా! ఎన్నాళ్ళ నుంచి మనం ఒకరికొకరం తెలుసు. ఇప్పటికి ఐదు దశాబ్దాలయింది. నాటి నుంచి నేటి వరకు కలిసి పెరిగాం. ఏ చుట్టరికం లేని మనందర్ని అమ్మ దగ్గరకు తీసి విశ్వకుటుంబంలో బిడ్డల్ని చేసింది. అందరికీ బంధం వేసింది అనుబంధంతో. ఎన్నాళ్ళయింది ? ఎన్ని యేళ్ళయింది ? మనం యెవరికయినా పరిచయం చేసుకొనే సమయంలో "వీరు నాకు 40 సంవత్సరాల నుంచి పరిచయం. అమ్మ దగ్గరే" అంటుంటే ఎదుటివారు ఎంతో ఆశ్చర్యంతో, ఆనందంతో చూస్తున్నారు. "ఇన్నాళ్ళు వీళ్లు అమ్మ అనుగ్రహం వల్లనే యిన్ని సంవత్సరాలుగా కలిసి వున్నారు" అనుకున్నారు. సంఖ్యతో పనిలేదు. ఎన్ని వందల మంది? వేలమంది ? ఎవరింటికైనా (అనుకోకుండా వెళ్తే వాళ్ళయినా, వీళ్ళయినా) జిల్లెళ్ళమూడి నుండి కాకపోయినా అమ్మ దగ్గర నుంచే వస్తున్నారు అన్నంత సంతోషంతో, ఆప్యాయత చూపిస్తున్నారు. మనం కూడా యిది అమ్మ యిల్లే కనుక మన యిల్లే అనుకొని స్వతంత్రంగా వాళ్ళతో కలిసిపోయి వాళ్ళు కూడా మనతో కలిసిపోయి ఆనందంగా అమ్మ కబుర్లతో, మన అనుభవాలను గూర్చి మాట్లాడుకుంటూ, వీలైనంత వరకూ వాళ్ళ దగ్గర ఉండి వచ్చేవాళ్ళం.

నాకు బాగా గుర్తు. అమ్మ 1962లో కొంతకాలం చీరాలలో వున్నారు. ఆ రోజుల్లో అమ్మ ఎవరింటికైనా వెళ్తున్నారంటే ముందుగా, రవి, నేను, అధరాపురపు రవి,

మహదేవ్ ఆ యింటికి వెళ్ళేవాళ్ళం. మా సొంత యిల్లుగా మసిలేవాళ్ళం. ఎందుకంటే, అమ్మ కొద్దిసేపట్లో ఆ యింటికి వస్తుందిగా. అందుకే ఆ స్వతంత్రం. నాటి నుంచి నేటి వరకు యీ విశ్వకుటుంబంలో ఒకటే వరుస "అక్కయ్యా, అన్నయ్య" అని యెంతో ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఉంటారు. జిల్లెళ్ళమూడిలో ఏదయిన ఉత్సవం జరిగితే, అన్ని ప్రాంతాల నుండి వందల మంది అక్కయ్యలు, అన్నయ్యలు వస్తుంటారు. అందరింట్లో వాళ్ళకి పండుగలా ఉంటుంది. చాలాకాలం తర్వాత చూసిన అనురాగంతో పలుకరించుకుంటారు.

అమ్మకు అందరూ బిడ్డలే. హెచ్చు తగ్గులు, కుల, మత, వర్ణ, వర్గ, విచక్షణ లేదు. "నేను గురువును కాదు, మీరు శిష్యులు కాదు. నేను దైవాన్ని కాదు, మీరు భక్తులు కాదు. నేను అమ్మను, మీరు నా బిడ్డలు" అంది. "మీరు కానిది నేనేదీ కాదు నాన్నా" అంది. "ధ్యాసే ధ్యానం" అని "మీరు ఎవర్ని పూజిస్తారు అమ్మా" అని అడిగితే "మిమ్మల్నే నాన్నా" అంది. అమ్మ పాదాలు చూస్తూ ఒక సోదరుడు "ఇవి బ్రహ్మ కడిగిన పాదాలు కదమ్మా" అంటే "మీరు బ్రహ్మలు కాకపోతే కదా నాన్నా?" అంది. నిరంతరం "నేను అమ్మను, మీరు బిడ్డలు", "మీరు శిష్యులు కాదు, శిశువులు" అంది. వర్ణ, వర్గ విచక్షణ లేని విశ్వ కుటుంబం కోసం "అందరిల్లు" స్థాపించింది జిల్లెళ్ళమూడిలో. ఆ యింటి లోని వారమే మనమంతా. అందుకే యీ అనుబంధం, ఆనందం, అంతేకాదు, అన్నప్రాసనలు, అక్షరభ్యాసాలు, ఉపనయనాలు చేసింది. తన సంతానం కదా అందుకని "నాన్నా నేను మిమ్మల్ని కని మీ తల్లులకు పెంపుడు ఇచ్చాను" అంది. వందల వేలమందికి భోగి పళ్ళు పోసింది. పెళ్ళికొడుకుల్ని, పెళ్లి కూతుర్లను చేసి వివాహాలు చేసింది. వేల సంఖ్యలో గోరుముద్దల్ని తినిపించింది. తనను దర్శించడానికి వచ్చిన వాళ్ళను యెంతో ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. సాగనంపే సమయంలో బుగ్గలు పుణికి, యెంతో అనురాగంతో కుంకుమబొట్టు పెట్టింది. దూరంగా ఎక్కడైన వివాహాలు యిత్యాది శుభకార్యాలకు దంపతులకు నూతన వస్త్రాలు పంపేది. అనారోగ్యంతో వున్న వారికోసం తన బిడ్డల్ని ఎవర్నయినా ప్రసాదం ఇచ్చి పంపేది. అందుకే అనుకుంటా. ఆ అనురాగం మన అందరిలో చాలా మందికి పంచింది. ఎంతమంది? సంఖ్యకి అందరు. ఎన్ని పేర్లు రాయగలను. రాయడం మొదలుపెడ్తే వారు

సంతోషించినా, మిగిలిన వారు అసంతృప్తికి కారణమౌతారేమోనని నా భయం. కొన్ని గ్రామాలలో కొంతమంది, జిల్లెళ్ళమూడి నుంచి గానీ, జిల్లెళ్ళమూడికి సంబంధించిన వారు గానీ చూడటానికి వెళ్తే వాళ్ళని అమ్మ సృష్టించిన అవతార స్వరూపాలుగా భావించి, సేవించి, ఆనందిస్తున్నారు. ఈ రోజుకి కూడా చూడండి అమ్మ గర్భాన జన్మించిన రవిని గూర్చి అందరికీ తెలుసు. అతని యిల్లు అందరికీ ఒక "చిన్న అందరిల్లు", అన్నపూర్ణాలయం. తను కూడా తన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా, యెవరైనా అనారోగ్యంతో ఉంటే యెంతో దూరంలో వున్నా వెళ్ళి చూచి వస్తున్నాడు. శుభకార్యాలు జరిగితే వెళ్ళి నూతన వస్త్రాలతో అమ్మ ఆశీస్సుల నందించి వస్తున్నాడు. అలాగే విశ్వజననీ పరిషత్ వారు కూడా యీ సాంప్రదాయాన్ని యెంతో కాలం నుంచీ అనుసరిస్తున్నారు. స్థానిక కార్యదర్శి వీలైతే స్వయంగా తను లేకపోతే రమేష్ ద్వారా అమ్మ ప్రసాదం, నూతన వస్త్రాలు పంపడం, అనసూయా వ్రతాలను మీరు లేక హనుమబాబు గారు, భజనల కోసం పద్మావతి అక్కయ్యను, పంపి వారు కూడా మన సోదర ప్రపంచంలో మన దగ్గర వారేనని నిరంతర స్ఫురణను కలుగచేస్తున్నారు.

కానీ విచిత్రమేమటంటే తమ జీవితాలలో అమ్మను దర్శించిన వారికి, తాత్కాలిక ప్రయోజనాలకై అమ్మను దర్శించి ఆ ప్రయోజనం పొందలేని వారికి, అమ్మతో అనుబంధం లేని వారికి, ఇలా కొంతమంది జిల్లెళ్ళమూడితో వున్న వారి పరిచయాల, మమతా, అనురాగాలు అర్థం కాకుండా ఉండి కొంత విసుగ్గా కూడా అనిపించడంలో ఆశ్చర్యం లేదు. వాళ్ళ అభిప్రాయాలు కూడా భిన్నంగా ఉంటాయి. "ఆడవాళ్ళను పూజించట మేమిటండీ ? మా సాంప్రదాయాల్లో లేదు", అక్కడ మడి ఆచారం లేదట, వర్ణ సంకరం చేసి అందరూ సహపంక్తిలో భోజనం చేస్తారట. ఇలా అనేక విధాలుగా విమర్శిస్తారు. ఎవరిష్టం వారిది కదా ! మనతో కూడా కలసి అమ్మ దగ్గర వుండి, పరిస్థితుల కారణంగా రాలేక దశాబ్దాల తర్వాత మనల్ని మళ్లీ చూసిన వారికి ఇంతకాలం తోటి సోదరుల నుంచి దూరమై నందుకు యెంతో బాధపడిన వారున్నారు. ఏం ప్రయోజనం ఆశించి మనం (అంటే అనేకమంది) అమ్మ దగ్గరకు వెళ్ళాం ? చాలాసార్లు అనేక మందితో "తల్లినయ్యాను చాలదా నాన్నా" అని మన బాధ్యతలు తనవేనని సూచించింది. ఇందులో ఒకరి నమ్మకం, అపనమ్మకం మీద అమ్మకు పనిలేదు.

బాధ్యత తీసుకుంది. ఎక్కడెక్కడి వారిని యెంత వరకు తీసుకెళ్లింది ? ఆర్థికంగాను, సాంఘికంగానూ, ఆరోగ్యపరంగానూ, యింకా యెన్ని విధాల, తనకు తెలియదంటూనే యెన్నో విధాల ఆదుకుంది.

ప్రయత్నం తెలుస్తోంది. కనిపిస్తోంది. కనుక. అంతా మన ప్రయోజనమే అనుకుంటాం. వాస్తవానికి ప్రేరణ మూలం తెలియదు. కొంతమంది అమ్మను దర్శించి, తమ బాధలను విన్నవించుకోలేక నిశబ్ధంగా వెళ్ళిన వారికి తల్లిగా ఆదుకొంది. ఎన్నో సంఘటనలు, యెన్నో అనుభవాలు, అందుకనే అమ్మ విషయాలు మాట్లాడుతుంటే కాలం గంటల కొద్దీ గడచిపోతూ ఉంటుంది. అందుకే అమ్మను చూడని వారికి, ఆసక్తి వున్నవారికి, అమ్మను గూర్చి వింటుంటే "అయ్యో, మనం చూడలేకపోయామే, చూచిన వారెంత అదృష్టవంతులో, కనీసం అమ్మను విగ్రహరూపంలో చూచి తరిస్తున్నాం" అనుకుంటారు. చూడని వారు, ఆసక్తి లేనివారు, కనీసం తెలుసు కుందామని ప్రయత్నం చెయ్యరు. వారి కోసం మనం ప్రచురిస్తున్న పత్రికలు చదవక పోగా, కనీసం మాట్లాడుతుంటే వినరు. మనం అమ్మ దగ్గరకు వెళ్తుంటే నిరసన భావాన్ని చూపిస్తారు. అక్కడ జరిగే కార్యక్రమాల్ని వ్యంగ్యంగా నవ్వుకుంటారు. ఎవరి అదృష్టాదృష్టాలు వారివి. అందుకే అదృష్టమున్న వారిని అనుబంధంతో ముడివేసింది. జన్మలంటు వున్నాయో లేదో నాకు తెలియదు గానీ వున్నాయనుకుంటే, యే జన్మలో పుణ్యం (అమ్మకు పాప పుణ్యాల విచక్షణ లేదు బిడ్డల విషయంలో) చేసుకున్నామో విశ్వ కుటుంబంలో అమ్మను దర్శించి, సేవించి, ఒకరికొకరు, ఆప్యాయతల్ని, అనురాగాల్ని, పంచుకునే అదృష్టం యీ జన్మలో మనందరికీ గల్గింది.

❖❖❖

అమ్మ వాత్సల్య జలధిలో

(అమ్మా ! నేను, నా అనుభవాల్ని గురించి సంచికలో ప్రచురించటం కోసం రాయమని చాలాసార్లు ఉష. కుసుమ అక్కయ్యలు, శాస్త్రి, కామరాజుగారు అడిగారు. కానీ, ఏం రాయాలి. ఎలా రాయాలి ? ఎన్నడూ రాయలేదుకదా ! ఏనాడైతే నీ పాదాలవద్ద జేరేనో ఆనాడే నా జన్మ ధన్యమయింది. నీ ఆశీర్వచనముతో ప్రయత్నిస్తాను తల్లీ ! జయహో మాతా శ్రీ అనసూయా, రాజరాజశ్వేరి శ్రీ పరాత్పరి !

నేను మొదటి సారిగా అమ్మను 1961, జూన్‌లో, చూశాను. నాకు అప్పుడు 21 సం॥ ఎందుకో నాకు దేవుడు, బాబాలు లాంటి వారిని గురించి ఏ ఉద్దేశ్యం లేదు. కానీ అమ్మ దగ్గరకు అయిష్టంగానే వెళ్ళాను. ఆ తర్వాత నా బ ధ్యత అంతా నేటి వరకు అమ్మ తీసుకుంది. అమ్మ చూపుల్లోనే పెరిగాను, ఆ చూపుల్లోనే బ్రతుకుతున్నాను. కాలం గడచిపోతుంది. సంచికకు ఆర్టికల్ రాయాలి గనుక విషయంలోకి వస్తున్నాను. అంటే చాలా విషయాలు హైమను గురించి, నేను అమ్మ దగ్గర వున్న యితర విషయాలు, ముఖ్యమైనవి కూడా వదిలేస్తున్నాను. మళ్ళీ అవకాశం వుండి, అవసరమైతే అమ్మ అనుగ్రహంతో రాస్తాను. చాలా చిత్రమైన విషయాలు. సన్నివేశాలు, సంఘటనలు, ప్రస్తుతం వదిలేస్తున్నాను. నేను జిల్లెళ్ళమూడిలో జనవరి 1965 నుండి మే 1967 వరకు ఉన్నాను. కరెక్ట్‌గా రాయాలంటే, అమ్మే నన్ను తన దగ్గరే వుంచుకుంది. నాకు 25 వ సం॥లో జరిగినవి గుర్తున్నంత వరకు రాస్తాను.)

1965 జనవరిలో ఒక రోజు, అమ్మ ఇంట్లో – అంటే హైమాలయం వెనుక ప్రస్తుతం పునర్నిర్మాణమైన, ఆనాటి పాక. అమ్మను చూడడానికి వచ్చిన వాళ్ళందరూ అమ్మను చూచి 12 గం॥కు భోజనానికి వెళ్ళారు. నేను ఒక్కణ్ణే అమ్మ పాదాల దగ్గర, అమ్మ ఎడమవైపుగా దగ్గరగా కూర్చున్నాను. అమ్మ పక్కనే వున్న పూలను తీసికొని పూలరేకులతో తన పాదాల మీద వేసుకుంటూ నిశ్శబ్దంగా అప్పుడప్పుడు నా వేపు చూస్తూ ఆలోచనలో వుంది. అలా 20 ని॥లు గడిచాయి.

నేను : ఏంటమ్మా ఆలోచిస్తున్నావు ?

అమ్మ : నా వైపు చూసి చిరునవ్వు నవ్వి నా వీపు మీద చెయ్యివేసి మళ్ళీ నిశ్శబ్దంగా వుంది.

నేను : ఏవిటి ఆలోచిస్తున్నావు ? నా గురించా ?

అమ్మ : కాదునాన్నా !

నేను : మరేమిటి ?

అమ్మ : ఏం లేదునాన్నా ! ఆవరణం నిర్వహించడానికి ఎవరైనా ఉంటే బావుణ్ణు. ఎవ్వరూ లేరూ. శేషగిరి రావు అన్నయ్య మాత్రం ఎన్ని పనులు చూస్తాడు ? చాలా అవస్థ పడుతున్నాడు.

నేను : (గట్టిగా నవ్వి) "అమ్మా యిది నీ ఆలోచనా ! చాలా బావుంది" అని అమ్మను లోప గదిలోకి తీసుకు వెళ్ళి వరలక్ష్మికి చెప్పి భోజనానికి వెళ్ళాను.

అమ్మ పాదాల దగ్గర -

నేను : అమ్మా ! నేను వచ్చానమ్మా ! ఉద్యోగం రిజైన్ చేసి వచ్చాను. ఏం చెయ్యమంటావో ఏం చేయించుకుంటావో నీ యిష్టం.

అమ్మ : ఉద్యోగం ఎందుకు రిజైన్ చేశావు నాన్నా ! మళ్ళీ ఉద్యోగం కావలిస్తే రావద్దూ!

నేను : ప్రస్తుతం ఆ ఆలోచన వద్దులే అమ్మా ! ఏం చెయ్యమంటావో చెప్పు ?

అమ్మ : నీ యిష్టం నాన్నా ! నీకు ఏది హాయిగా వుంటే అది చెయ్యి.

నేను : అలాగే అని కాసేపు కూర్చుని లేచి ఆవరణలోకి వెళ్ళాను. అప్పుడు ఉ. 10-30 గంll లు. నెమ్మదిగా 7వ మైలు వైపు వెళ్ళివద్దామని బయల్దేరాను. (ప్రస్తుతం సంస్కృత కాలేజి వున్న చోట). ఆ 5 ఎకరాల ప్రాంతానికి వచ్చేసరికి, అక్కడ మన ఆవరణలోని పిల్లలు కుప్పనూర్పిళ్ళ పనిలో వున్నారు. చాలా సరదాగా వుంది వాతావరణం. అందరూ అమ్మ నామం చేస్తూ పనిచేస్తున్నారు. దగ్గరకు వెళ్ళాను. భాస్కరరావు అన్నయ్యగారి దగ్గరకు వెళ్ళి "నేను కూడా చెయ్యనా" అని అడిగాను. ఆయన సౌమ్యంగా, "మీయిష్టం, తమరు చెయ్య గల్గితే కాస్సేపు చెయ్యండి" అని అన్నారు వరిగడ్డితో పేనిన తాడు చేతికి యిచ్చి ఎలా చెయ్యాలో చూపించారు. నేను ప్రయత్నిస్తుంటే అందరూ నవ్వేరు, నా అవస్థ చూచి. కాస్సేపటికి కొంచెం వీలు కుదిరింది. అందరూ నన్ను విచిత్రంగానూ, ఆనందంగానూ చూస్తున్నారు. మధ్యాహ్నం; అక్కడికి బుట్టల్లో భోజనం వచ్చింది. గోంగూర పచ్చడి, అన్నం, మజ్జిగ.

వాళ్ళుతింటూ, నాకు ముద్దలు కలిపి పెట్టారు. నాకు చాలా రుచిగానూ, చాలా ఆనందంగానూ వుంది. అలాగే నేను సాయంత్రం ఆరు గంటల వరకు అందరితోటి పనిచేశాను. నెమ్మదిగా ఆవరణంలోకి వచ్చి అందరితోటి కబుర్లు చెప్తున్నాను. ఇంతలో అమ్మ దగ్గర్నుంచి కబురు వచ్చింది. వెళ్ళాను. అమ్మ నాతో, "నాన్నా పొలం వెళ్ళావుట కదా ' కొత్త గడ్డి దురదలుగా వుంటుంది. వేణ్ణీళ్ళు స్నానం చెయ్యి" అని వరలక్ష్మికి చెప్పింది. "రాధకు వేణ్ణీళ్ళు స్నానానికి యి"మ్మని స్నానం చేసి, అమ్మకు నమస్కారం చేసి, భోజనం చేసి. మళ్ళీ అమ్మ దగ్గరకు వచ్చి పడుకున్నాను.

అంతే ! ఆ రోజు నుంచి అమ్మ నన్ను గుండెల్లోకి తీసుకుని రెండు సం॥ల కాలం అనేక రకాలైన పనులు ఆవరణలో చేయించింది. కంటికి రెప్పలా చూసుకుంది. నేను పొలం పనుల్లో చాలా నెలలు గడిపేను. పొద్దున్న 5 గం॥ నుండి రాత్రి 10 గం॥ల వరకు చెయ్యని పనంటూ లేదు. వీటితో బాటు, అప్పుడే అందరిల్లు కట్టడం జరుగుతోంది. ఆవరణలో సున్నం గానుగ పెట్టారు. పోతుకూచి రవి రాత్రంతా గానుగ తోలేవాడు. మన్నవ దత్తు పొలం పనుల్తో బాటు గానుగలో సున్నం తిరగవేసే పని రాత్రంతా చేసేవాడు. నేను కూడా రాత్రివేళల్లో గానుగ పని చేసేవాణ్ణి. ఈ పనితో బాటు ఇటుకలు చెయ్యడానికి జమ్ములపాలెం నుండిన వరి పొట్టు కాల్చి మసి, దున్నల బండిలో తేవడం అతిముఖ్యమైన పని. ఈ పని నేను తీసుకున్నాను. తెల్లవారుఝామున దున్నల బండి కట్టుకుని జమ్ములపాలెం వెళ్ళే సరికి ఉదయం 6 గం॥లు. ఒక్కణ్ణీ మసి బండిపై నింపుకుని జిల్లెళ్ళమూడి వూళ్ళోంచి డ్రైన్ కాలవ దగ్గరకు వెళ్లి ఇటుక బట్టీల దగ్గర అన్‌లోడ్ చేసి, ఆవరణంలోకి వచ్చే సరికి పదకొండున్నర అయ్యేది. భోజనం చేసి మళ్ళీ మధ్యాహ్నం 2 గం॥లకు వెళ్ళి రాత్రి 11 గం॥లకు రెండో బండి తెచ్చేవాణ్ణి. ఈ మధ్యలో ఆవరణంలో పిల్లల్ని తీసుకొని బాపట్ల ప్రాంతంలో "అందరిల్లు కట్టుబడికి యిసుక కోసం లారీలో వెళ్ళి యిసుకతో జిల్లెళ్ళమూడి (ఇంటికి) వచ్చి అన్‌లోడ్ చేసే వాళ్ళం. నాకు 24 గం॥లు సరిపోయేదికాదు మొత్తానికి మేము అందరం అంటే, నేను, పోతుకూచి విద్యాసాగర్ పిల్లలు (రమణ, సావిత్రి, ఝాన్సీ). మన్నవ దత్తు, రాచర్ల శ్రీరామమూర్తి, భాస్కరరావు గారు, నంబులు, మంగ (కీ.శే. ఎక్కిరాల భరద్వాజగారి ధర్మపత్ని) మంగ అక్క బాల, మన్నవ కామేశ్వరమ్మ గారి

(అమ్మమ్మ) కూతుళ్ళు రాజ్యం, విద్యాధరి, హనుమయ్య (ప్రస్తుతం చీరాలలో వుంటున్నాడు) 24 గం॥లు ఆవరణంలో రకరకాల పనులు చేస్తూండేవాళ్లం. ఆవరణం అంతా ఆనందమయం. "అనుదినము నీ నామము మా హృదయాంతరమున నిలుపుము - తల్లీ" అని ఒకరంటూంటే "జయహో మాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి" అని మిగిలిన అందరూ అంటూండే వాళ్ళు. ఈ నామం జిల్లెళ్ళమూడి ఊరు నాలుగు ప్రక్కల నుండి వినిపించేది. పనులు పూర్తి చేసుకొని ఊరు నాలుగు ప్రక్కల నుండి ఆవరణంలో పిల్లలు వచ్చే వాళ్ళు పోయే వాళ్ళు అందరికీ బ్రహ్మానందం అమ్మ నామం. అదే కాలంలో సంస్కృత పాఠశాల ప్రారంభం అయింది. అందరి హైమ, ఝూన్సీ, రమణ, మంగ వీళ్ళంతా ఈ పాఠశాలలో స్టూడెంట్స్. హైమ తప్ప మిగిలిన వాళ్ళందరూ ఆవరణంలో పనికి రావల్సిన వాళ్ళే. నేను వాళ్ళని పొలానికి తీసుకువెళ్ళడానికి వచ్చేవాణ్ణి. అప్పటి ప్రధాన ఉపాధ్యాయుడు రాయప్రోలు భద్రాద్రి రామశాస్త్రి గారికీ, నాకూ ఘర్షణ జరిగేది. ఇప్పుడు తల్చుకుంటే అంతా ఆనందమే). అవరణం అంతా నిత్య కళ్యాణం పచ్చతోరణం.

2

మార్చిలో : మేమంతా 5 ఎకరాల పొలం నుంచి వడ్ల బస్తాలు తీసుకువచ్చి, కాసేపు విశ్రాంతి తీసుకున్నాం. అప్పుడు మధ్యాహ్నం 2 గం.లు నేను అమ్మ యింటి (పాక) ప్రక్కగా వెళ్తూ చిన్న కిటికీలోంచి అమ్మ కనిపిస్తూంటే చూడడానికి దగ్గరగా వెళ్ళాను. అమ్మ నన్ను చూచి నెమ్మదిగా

అమ్మ - నాన్నా ! పని అయిపోయిందా ?

నేను - లేదమ్మా చాకలి చెరువు దగ్గర 5 ఎకరాల కుప్పలున్నాయి వెళ్ళాలి.

అమ్మ - వెళ్ళకూడదూ !

నేను - వెళ్లాలమ్మా, చాలా ఎండగా వుంది. నీకేం నువ్వు నీడపట్టున వున్నావు. మాకేమైనా గొడుగు ఇస్తే మాకు బాగుంటుంది కదా !

అమ్మ - అలాగే నాన్నా ! నువ్వు వాళ్ళతో మాట్లాడుతూండు, నీకు గొడుగు పంపిస్తా ! అంది నవ్వుతూ.

నాకు అర్థమయింది. క్షణాల మీద అందర్నీ తీసుకుని ఎండలో పొలం వెళ్లాం. "అన్నయ్యా! చాలా ఎండగా వుంది కాస్సేపు ఆగుదాం" పిల్లలందరూ అన్నారు. "కాదమ్మా! అమ్మ గొడుగు యిస్తుంది. పని మొదలెట్టండి" అన్నాను. వెంటనే అందరం అమ్మకు జేజేలు కొట్టి పని మొదలెట్టాం. వెంటనే చిన్న మబ్బుతునక సూర్యుడికి అడ్డు వచ్చి క్రమేపీ పెద్దదై పదినిమిషాలలో పూర్తిగా మబ్బులు పట్టి చల్లగాలులు ప్రారంభమైనాయి. మేమంతా యినుమడించిన వుత్సాహంతో పనిచేస్తూ, హరిదాసుగారికి, మేం రాత్రంతా పని చేసి పంట యింటికి చేరుస్తాం, పెట్రోమాక్స్ లైట్లు పంపమని కబురు చేశాం. పొద్దుపోయే టైమ్‌కు లైట్లతో బాటు నాన్నాగారు కూడ వచ్చారు. రాత్రి పది గంటలకు పంట యింటికి చేర్చిన తర్వాత అమ్మ దగ్గరికి వెళ్ళి చెప్పాను. ఎంతో వాత్సల్యంతో చూసింది.

అలాగే డ్రైన్ కాలవ దగ్గర ఈ వైపు ఒడ్డున "దేవుడి మాన్యం" వుంది. మొత్తం ఒక ఎకరం. ఒక మధ్యాహ్నం, నేను, దత్తు బండి కట్టుకుని చాకలి చెరువు మీదుగా బయల్దేరాము. కొంత దూరం వెళ్లిన తర్వాత దత్తు, వెనుకగా చాలా దూరంలో వస్తున్నాడు. నేను బండిని పొలానికి అడ్డంగా పోనిచ్చాను. బండి పొలం గట్లకు అడ్డంగా పోవడంతో చాలా చోట్ల బోల్తా కొట్టినంత పనయింది. ఎలా అయితేనేం ఇద్దరం సాయంత్రం 5 గం.లకు పని పూర్తి చేసుకుని 5 బస్తాల వడ్లు బండికి మీదకి చేర్చి నెమ్మదిగా ఇల్లు చేరాము.

తర్వాత నాల్గు, అయిదు రోజులకు డ్రైన్ కాల్వ దాటింతర్వాత 7 ఎకరాల పొలంలో వున్న వరి కుప్ప పని మూడు, నాల్గు రోజులు పట్టింది. మా గ్రూపు అంతా కలసి పొద్దున్నే ఉ. గం. 6.30 లకు కాలవ దాటుకుని పొలం జేరే వాళ్ళం. అమ్మకు జేజేలు చెప్పి పని ప్రారంభించే వాళ్ళం. ఉ. గం. 8-30 లకు పొలానికి బుట్టల్లో చద్ది అన్నం, గోంగూర పచ్చడి తీసుకుని వచ్చేవాళ్ళు. పొలం గట్లమీద, గడ్డిమీద, శీతాకాలపు ప్రొద్దుటి యెండలో తింటుంటే, ఆ రుచి, ఆనందం అనుభవించవలసిన విషయమే గాని మాటల్లో వర్ణించడానికి సాధ్యపడదు. కానీ మేం ఎక్కడవున్నా అమ్మ మమ్మల్ని చాలా జాగ్రత్తగా చూచేది. ముఖ్యంగా తినడానికి అనేక రకాలయిన పదార్థాలు, స్వీట్లు, పండ్లు, మాకు పంపేది. చివరికి డా. జ్యోత్స్న (ప్రస్తుతం గుంటూరులో ప్రైవేట్

ప్రాక్టీస్టు చేస్తోంది) కూడా అన్నంబుట్ట నెత్తిన పెట్టుకుని కాలవ దాటి తీసుకొచ్చి, అన్నం ముద్దలు కలిపి పెట్టేది. ఎంతో ఆనందంతో కబుర్లు చెప్పుకుంటూ మధ్యాహ్నం ఒంటి గంటకు తినేవాళ్ళం. సాయంత్రం 6 గంటల వరకు పని చేసి, అమ్మ నామం చెప్పుకుంటూ అమ్మ దగ్గరకు వచ్చి పాదాలకు నమస్కారం చేస్తూంటే, అమ్మ ఎంతో ఆనందంతో ప్రక్కన వున్న వాళ్ళకు చెప్పేది.

"వీళ్ళంతా ఆవరణలో వుండే పిల్లలమ్మా" అని అమ్మ చూపుల్లో అనంతమైన వాత్సల్యం. సాయంత్రం సంధ్యావందనానికి 30 - 40 మంది వుండే వాళ్ళు. మళ్ళీ మర్నాడు ఉదయం సుప్రభాతం చేసి, అమ్మకు నమస్కారం చేసి పొలం పనికి వెళ్ళేవాళ్ళం.

1965 లోనే ఒకరోజు మే నెలలో, జిల్లెళ్ళమూడి ఆవరణలోకి వస్తున్న బొగ్గులారీ లోంచి చాలా బస్తాలు క్రింద పడి బొగ్గంతా దారిలో పడిపోయింది. సహాయానికి ఎవ్వరూ లేరు ఆవరణంలో. మధ్యాహ్నం 2 గం॥లు. నేను విన్నవెంటనే ఒక్కణ్ణీ వెళ్ళి పారతోటి బొగ్గంతా బుట్టలోకి తీసి లారీలో మళ్ళీ లోడ్ చేశాను. ఇదంతా గంటన్నరపట్టింది. తల ఒళ్ళంతా బొగ్గుతో నల్లమసి అయింది. ప్రక్కనే వున్న డ్రైన్‌లో స్నానం చేసి వూళ్ళోకి వస్తూంటే నాకు జ్వరం మొదలయింది. అమ్మ దగ్గరకి వెళ్ళడం యిష్టం లేక ప్రస్తుతం "శ్రీమాత" బిల్డింగ్ ఉన్నచోట గడ్డివాములుంటే, మంచం తెచ్చుకుని నీడలో వేసుకుని పడుకుని నిద్రపోయాను. ఎంత సేపు పడుకున్నానో తెలియదు. మెళుకువ వచ్చేసరికి సాయంత్రం 6.30 గం. అయి వుంటుంది. బాగా మగతగా వుంది. మంచం చుట్టూ 20 మంది జనం కూర్చున్నారు. నాకు అర్థంకాలేదు. క్షణాల్లో తెలిసింది, అమ్మ నా మంచంలోనే కూర్చుంది. నెమ్మదిగా నా వొళ్ళంతా రాస్తోంది. "అదేంటమ్మా" అని వెంటనే లేవబోయాను. "కదలకు నాన్నా, పడుకో, కాస్సేపు" అని కాఫీ తెప్పించి గ్లాసులో చల్లబరుస్తూ నోటికి అందించి తాగించింది. ఆ రాత్రి తనే అన్నం తినిపించి తనగదిలోనే పడుకో మంది. మర్నాడు రోజు, ఏమీ జరగనట్లే మామూలుగా వుంది. యథావిధిగా పనుల్లోకి వెళ్ళిపోయాను.

నేను ఎక్కువగా పొలం పనుల్లో తిరుగుతూండేవాణ్ణి. ఈ సంస్థకు కావలసిన అభివృద్ధి కార్యకలాపాలన్నీ కీ.శే. అధరాపురపు శేషగిరిరావుగారు చూస్తుండేవారు. నాకు వీలైనప్పుడల్లా, వారికి సహాయం చేస్తూండేవాణ్ణి. ఒకసారి, అమ్మకు ఒక ఆలోచన

వచ్చి, శేషగిరిరావు అన్నయ్యగారితో సంప్రదించి నన్ను, రాచర్ల శ్రీరామ్మూర్తిని (రాచర్ల లక్ష్మీనారాయణ తమ్ముడు) - ప్రస్తుతం నరసరావుపేటలో ప్రైవేట్ గ్యాస్ ఏజన్సీలో పనిచేస్తున్నాడు) విజయవాడ వెళ్ళి ట్రాక్టర్ ట్రైనింగ్‌కు వెళ్ళి రమ్మంది. శేషగిరిరావు అన్నయ్యగారు నవభారత్ ట్రాక్టర్ ఏజన్సీ వారికి ఉత్తరం రాసి యిచ్చారు. మేం యిద్దరం మా స్నేహితుడు రాధాకృష్ణగారి యింట్లో రెండు నెలలు వుండి, రోజూ ట్రాక్టర్ షెడ్‌కు వెళ్ళి వీలైనంత వరకు నేర్చుకున్నాం. తర్వాత అమ్మ దగ్గరకు వచ్చేశాం. ఆ రోజుల్లో పరిస్థితిని బట్టి అమ్మ, సంస్థకు స్వంత పొలాలు, వ్యవసాయము వుండాలని అభిప్రాయపడింది. పొలాలు కూడా వున్నాయి. వీలైతే రెండో, మూడో ట్రాక్టర్లు కొని సంస్థకు కావలసిన ధాన్యం, సంస్థ స్వంత పొలాలనుండే వస్తే బాగుంటుందని అనుకొనేది. కానీ, యీ ప్లాన్లన్నీ మరో వైపు ప్రయాణించి నేటికి అదృశ్యమయ్యాయి.

ఋతువులు కదలి 1965లో వర్ష ఋతువు ప్రారంభమైంది. ఆ రోజుల్లో ఒకరోజు వర్షం మామూలుగా కురుస్తోంది. సాయంత్రం 8.30 గం.లు. నేను గొడ్ల కొష్టం నుంచి వస్తూ బండిలో నారు కట్టల్ని చూశాను. ఆవరణంలోకి వచ్చి భాస్కరరావు అన్నయ్యగార్ని అడిగాను. ఆయన "రాధాజీ - రేపు 7 ఎకరాల్లో నాట్లు వెయ్యాలి. ప్రస్తుతం ఎవ్వరూ లేరు, రేపు ప్రొద్దున్నే పంపించాలి" అన్నారు నాకు ఎందుకో, నాట్లు వేసే సమయానికి యీ నారు కట్టలు అక్కడకు జేరే కంటే యిప్పుడే తీసుకెళ్తే బావుణ్ణు, అనిపించింది. భాస్కరన్నయ్యకు చెప్పకుండా, నెమ్మదిగా దున్నలతో, ఆ బండి కట్టి నిశ్శబ్దంగా ఆవరణలోంచి, చీకట్లో 7వ మైలు వైపు బయల్దేరాను. (అప్పటికి నాకు దున్నలు అలవాటై బండితోలటం కూడా సులువుగా వుండేది). అలాగే 7వ మైలు వరకు వెళ్ళి మళ్ళీ రెండు కాలవల మధ్యలోంచి రెండు మైళ్ళు వెనక్కిరావాలి. అంతా చీకటి. ఒక గంటలో 7 ఎకరాల పొలం చేరుకున్నాను. వర్షం పడుతోంది. చీకటి. పొలం అంతా బురద త్రొక్కి నాటుకు సిద్ధంగా వుంది. అంతకు ముందు వేసిన నారుకట్టల గుట్టలు మసక చీకట్లో కన్పిస్తున్నాయి. (నాకు ఆ రోజుల్లో ఆవరణంలోను, పనికి వెళ్ళే సమయంలో చొక్కా, బనీను వుండేవి కాదు. తలపాగా వుండేది). బండి కిందకు వదిలి దున్నల్ని చక్రాలకు కట్టేశాను. ఆ చీకట్లో తడుస్తూ నారు కట్టల్ని ఇంకో చోట బురదలో, ఇంకో గుట్టగా వేశాను. ఇదంతా అరగంట పట్టింది. మళ్ళీ దున్నల్ని ఖాళీ బండికి కట్టి 7వ మైలు వేపు బయల్దేరి 50 మీటర్లు

వచ్చాను. నాకు అప్పుడు అనిపించింది. "7వ మైలు వరకు వెళ్ళడం టైమ్ వేస్ట్, పెద్ద కాలవ క్రిందకు యిక్కడే దింపితే వూళ్ళోకి తొందరగా వెళ్ళ వచ్చునని" కాలవలోతుగానే వుంటుంది. దిగడం కూడా కొంచెం కష్టమే ! బండి పల్టీలు కొట్టే అవకాశం చాలా ఎక్కువ. చీకటి, వర్షం జల్లు అయినా సరే, ధైర్యం చేసి దున్నల్ని కుడి ప్రక్కకు అదిలించి క్రిందవేపుతోలేను (తర్వాత తెలిసింది - నేను ఎక్కడికి వెళ్ళేనని షమ్మ అడిగిందట. ఎవ్వరూ తెలియదన్నారు. వెంటనే అమ్మ గొడుగు తీసుకొని అన్న పూర్ణాలయం మేడ మీదకు వచ్చి నేను వున్న వేపు అయిదు నిమిషాలు నుంచుని క్రిందకు వెళ్ళిందట. వాణ్ణి గురించి ఎవ్వరూ పట్టించుకోరు అని కోపంగా అందట). ఈ సమయంలోనే నాకు బండి కంట్రోల్ తప్పింది. క్షణంలో నాకు అర్థమయింది బండి పల్టీలు కొట్టబోతోందని. వెంటనే టార్చిలైట్లు, చేతి కర్ర తీసుకున్నాను. అంతే! బండి నాలుగు పల్టీలు కొట్టి నీళ్ళలోకి పడిపోయింది. నాకు గొంతు వరకు నీళ్ళు. బండి పొజిషన్ అర్థం కాలేదు. దున్నల సంగతి గుర్తొచ్చి, ఎక్కడ దెబ్బలు తగిలాయోనని, ధైర్యం తప్పింది. అంతే ! ఒక్కసారిగా, అమ్మా ! నా సంగతి చూడు తల్లీ ! అని భయంతో అమ్మని తల్చుకుంటూ దున్నల కోసం వెతుకుతున్నాను. నీళ్ళల్లో పడ్డ ఒక దున్నతోక దొరికింది. ఆ తోకలాగేను. రెండు దున్నలూ వెంటనే లేచి బండి నేను ఎక్కడానికి రెడీగా వుంది. వెంటనే బండి ఎక్కి కాలవదాటి, చాకలి చెరువు మీదగా ఆవరణంలోకి వచ్చి దున్నల్ని గొడ్ల కొష్టంలోకి తెచ్చి గడ్డివేసి, నేను స్నానం చెయ్యడం కోసం కస్తూరి, నేను వుండే పాకవైపు (ప్రస్తుతం అందరింటికి కుడివైపు మూలగా, అమ్మ ఆలయానికి వెళ్ళే రోడ్డు ప్రక్కగా వుండేది) వెళ్ళాను. కస్తూరి చెప్పింది విషయాలన్నీ నా గురించి ఎవ్వరూ పట్టించుకోటం లేదని అమ్మ బాధ పడిందట. నేను స్నానం చేసి, అక్కడే భోజనం చేసి అమ్మ దగ్గరకు వెళ్ళాను. (అమ్మ అప్పుడు ప్రస్తుతం విశ్వజననీ పరిషత్) ఆఫీసుకు ఎడం ప్రక్కగా, అమ్మ పెద్ద కోడలు శేషు వుంటున్న పోర్షన్‌లో వుండేది) అమ్మ పాదాల దగ్గర కూర్చున్నాను.

అమ్మ : అన్నం తిన్నావా నాన్నా ?

నేను : తల వూపేను

అమ్మ : "ఎక్కడవున్నా యింత సేపు?"

నేను : 7 ఎకరాలలో చిన్న పనిమీద వెళ్ళానమ్మా

అమ్మ : "వర్షం నాన్నా ! ఒక్కడివి ఎందుకు వెళ్ళావ్ ? అని దగ్గరకు తీసుకుని వీపు నిమిరింది (రాత్రి 11 గం.లు) ప్రక్కనే వున్న చాపను అక్కడే పరుచుకుని పడుకుని నిద్రపోయాను.

(3)

ఒకసారి, అంటే ఫిబ్రవరి 1966లో జనుము కోయాల్సి వచ్చింది. పొద్దున్నే మంచుపడుతూ వుంది. మాకు మనుషులు తక్కువయ్యారు. పొలం మొత్తం 4 ఎకరాలు (అంటే ప్రస్తుతం కళ్యాణమండపం నుండి పాండురంగారావు గారి యిల్లు దాటి 100 మీటర్లుంటుంది) జనుము కోత ఉదయం 5 గంటల నుండి 11 గంటల వరకు, తర్వాత సాయంత్రం 5 గంటల తర్వాత నుంచి (వెన్నెల ఉంది) మాకు ఓపిక ఉన్నంత వరకు, ఆవరణలో వాళ్ళంతా మినుము, పెసర కోతలకు వెళ్ళారు. కూలీలు లేరు. ఏం చెయ్యాలో తోచలేదు. హనుమయ్యను (అప్పుడు చాలా చిన్నవాడు 15 సంవత్సరములు వుంటాయి) "మనిద్దరం కలసి 3 రోజుల్లో కోయగలం కదా! మొదలు పెడదామా !" అన్నాను.

"రాధన్నయ్యా ! చాలా కష్టం అయినా నీవు ఉన్నావుకదా, పనిపూర్తయ్యేంత వరకూ పొలం వదలకూడదు. సరేనా!" అన్నాడు. మేం మొత్తం పొలాన్ని 8 భాగాలుగా విభజించి పొద్దున్న 5 గంటలకు కొడవళ్ళు తీసుకుని కోత మొదలు పెట్టాం. గం. 6.30 లు అయ్యే సరికి నాకు బాగా నీరసం వచ్చింది. అయినా 8 గంటల వరకు సాగించాను. ఆ తర్వాత నీరసంతో పాటు, వికారం కూడా మొదలయ్యింది ముందుకు కదలడం కష్టమయింది. అయినా పట్టుదలతో కోత ఆపలేదు. రెండు గజాలు ముందుకు వెళ్ళానో, లేదో, కళ్ళు తిరగడం మొదలైంది. ఇంక సాగడం నావల్ల కాలేదు. అల్లాగే నేలమీద కూర్చుని "అమ్మా ! యిది నా పరువు ప్రతిష్ఠలకు సమస్యమ్మా! నువ్వు చెయ్యి అందిస్తే గాని నా తరం కాదు తల్లీ ! ఏదో మార్గం చూపించవమ్మా!" అని కళ్ళ నీళ్ళతో వేడుకున్నాను. "రాధా! అమ్మ రమ్మంటోంది" అని కేక కస్తూరి నుంచి వచ్చింది. (కస్తూరి అంటే ప్రస్తుతం బి. హెచ్.ఇ.ఎల్. రామచంద్రాపురంలో వుంటోంది. ఆ రోజుల్లో నా బాగోగులు చూడమని అమ్మ తనకి చెప్పింది. అలాగే వసుంధర, వరలక్ష్మి కూడా నన్ను ఎంతో జాగ్రత్తగా చూచుకునేవారు. అల్లాగే నీరసంగా అమ్మ దగ్గరకు వెళ్ళాను. అమ్మ నన్ను చూసి నవ్వింది. నెమ్మదిగా వెళ్ళి అమ్మ వొళ్ళో తలవాల్చి పడుకున్నాను.

"ఏం చేస్తున్నా ? నాన్నా!"

"నీకు తెలియకే అడుగుతున్నావా అమ్మా !" నీరసంగా సమాధాన మిచ్చాను.

"పిచ్చినాన్నా ! పొలం పనుల అంత తేలిక కాదురా!"

"ఇంతవరకు బాగానే వుంది కదమ్మా ! అయినా నువ్వున్నావుగా!" అన్నాను.

"దా నాన్నా ! యిది తిను" అని నోట్లో తాటిబెల్లం ముక్క పెట్టింది. పదినిమిషాల్లో వికారం, కళ్ళు తిరగడం, తగ్గిపోయి, చాలా శక్తి, హుషారు కూడా వచ్చాయి.

"వెళ్తా నమ్మా, పనిచాలా వుంది" అని పొలం వేపు వెళ్ళిపోయాను. హనుమయ్యా, నేను మూడు రోజుల వరకు అలా పని చేస్తూనే వున్నాం. మూడో రోజు రాత్రి 10 గంటల వరకూ, వెన్నెలలో, బురదలో వంగి, మొత్తానికి కోత పూర్తి చేశాం. ఈ లోపు నాన్నగారు, మునసబుగారు వచ్చి మా అవస్థచూసి వెళ్ళారు. మొత్తానికి ఎలాగైతేనేం. జనుము కోత పూర్తిచేశాం.

ఇలాగే పొలంపనుల్లోనే వుండే వాణ్ణి. ప్రతి రోజు వడ్లుపురులు కట్టడం, గడ్డివాములు వెయ్యడం, పొలాల్లో వేసవిలో మట్టిపని, ఎరువుతోలడం లాంటివి చేస్తూండేవాణ్ణి. నాతో కాక జంటగా మన్నవదత్తు కూడా కలసి తిరిగేవాడు. అప్పుడప్పుడు జమ్ములపాలెం, రేటూరు నుంచి వడ్లు మరపట్టించుకు వచ్చేవాళ్ళం. ఈ పనుల్లో రాచర్ల శ్రీరామ్మూర్తి కూడా వచ్చేవాడు. నేను మాత్రం చాలా వరకు అమ్మ దగ్గరే పడుకునే వాణ్ణి. ఎన్ని పనులు చేసినా శరీరానికి ఏ మాత్రం శ్రమ వుండేది కాదు. ప్రొద్దునే అమ్మ దగ్గరే కాఫీ తాగి (ఒక్కొక్కప్పుడు అన్న పూర్ణాలయంలో చద్ది అన్నం తిని) పొలం వెళ్ళేవాణ్ణి.

ఒక రోజు రాత్రి 10 గంటలకు అమ్మ కోసం (పాక ఇంట్లోకి వెళ్ళాను. "అమ్మ పోస్టాఫీసు పాక దగ్గరకు వెళ్ళింది" అని వరలక్ష్మి చెప్పింది. దూరంగా చీకట్లో మంచం మీద ఒంటరిగా కూర్చుని వుంది (అంటే ప్రస్తుతం నాగప్రతిష్ఠ జరిగిన చోట). చీకట్లో నెమ్మదిగా వెళ్ళి అమ్మ ప్రక్కనే నుంచున్నాను. "రా నాన్నా !" అమ్మ పిలిచింది. వెళ్ళి అమ్మ పాదాల దగ్గర కూర్చున్నాను. చాలా సేపు నిశ్శబ్దంగా కూర్చున్నాను తర్వాత నాలుగైదు పశువులు అమ్మ వైపు వచ్చి 10 గజాల దూరంలో నుంచొని అమ్మవైపే చూస్తున్నాయి తలత్రిప్పకుండా. నేను వాటిని త్రోలుదామని లేవబోయాను. "ఫర్వాలేదు నాన్నా ! వుండనీ వాటిని" అంది అమ్మ. నేను కూర్చున్నాను. అందులో నెమ్మదిగా ఒకటి వచ్చి అమ్మ మంచం ప్రక్కగా మంచం పట్టెకి తల అన్చింది. అమ్మ కొంచెం

మంచం లోపలి వైపుకు జరిగి తన పాదాలు మంచం పట్టె మీద వుంచింది. మొదటిది వెళ్ళి దూరంగా నుంచుంది. రెండవది నెమ్మదిగా మంచం దగ్గరికి వచ్చి తలను అమ్మ పాదాల దగ్గర మంచం పట్టెకి ఆన్చింది. అమ్మకు కొమ్ములు తగుల్తాయని భయం వేసింది. నేను తోలబోతూంటే అమ్మ నెమ్మదిగా నివారించింది. ఇట్లాగే మిగిలిన పశువులు కూడా చేసి, అన్నీ గుంపుగానే నెమ్మదిగా వెళ్ళిపోయాయి. తర్వాత అమ్మ యింటికి వచ్చింది. నేను అమ్మను అనుసరించాను. మరి పశువులు అమ్మ పాదాభివందనం కోసం వచ్చాయా ? వస్తే, అవి రోజూ వస్తున్నాయా ? రోజూ అదే టైమ్‌లో వస్తాయా ? ప్రత్యక్షంగా ఆ రోజే వచ్చాయా ? అదృశ్యంగా కూడా అవి వస్తూంటాయా ? నాకు తెలియదు.

అక్కడ వుండే ప్రతిరోజు నాకు, నా జీవితానికి అనంతకోటి జన్మల పూర్వ పుణ్యఫలం. అమ్మ నాకు చాలా స్వతంత్రం యిచ్చింది. నేను కూడా అమ్మకే దగ్గరయ్యాను. అప్పుడప్పుడు చాలా గారాబం చేసేది. నాకు గర్వం లేదు కానీ మనస్సంతా ఆనందంతో నిండిపోయేది. ఇందులో ప్రత్యేకత లేకపోయినా రాస్తున్నాను. ఒక రోజు పాక యింటి వెనుక గదిలో క్రింది పడుకున్నాను. మధ్యాహ్నం నిద్రలో వున్నాను. వేసవి కాలం నిద్రకదా. మెళుకువ వచ్చినా బద్ధకంగా వుంది. నాకు ఏదైనా తినాలనిపించింది. నెమ్మదిగా అమ్మని పిలిచాను. అమ్మ నావైపు చూసింది ఏమిటి?అన్నట్లు. "ఏదైనా తినాలని వుందమ్మా!" "ఏం కావాలి?" అంది అమ్మ. 'నీ యిష్టం' అన్నాను. అమ్మ నెమ్మదిగా లేచి వరలక్ష్మిని పిలిచి "కుంపట్లో బొగ్గులు వేసి నిప్పు చెయ్యమ్మా" అంది. అమ్మ కుంపటి దగ్గర కూర్చుని కుంపటి మీద మూకుడు పెట్టించి మూల చెక్క బీరువాలో డబ్బా తీసి అందులోంచి జీడిపప్పు వేసి, వేయించి పెట్టింది. అలాగే వేయించినవి నాకే కాకుండా, చుట్టూ ఆవరణలో వున్న అందరికి పంచిరమ్మని ప్రక్కనే వున్న వారిలో ఎవర్నో పంపింది. "అమ్మ" కనుక ప్రతిరోజూ పండుగే కానీ యీ రోజు పండుగ అంటూ వచ్చే రోజులు కొన్ని. అట్లతద్ది రోజు ఆడపిల్లలందరూ తలంటి పోసుకుని తెల్లవారు ఝామున అమ్మను దర్శించి పాదాభివందనం చేసేవారు. అమ్మ ఆవరణలో అందరికీ సూర్యోదయానికి పూర్వమే ఆవకాయ, సాంబారు, పెరుగు అన్నం స్వయంగా కలిపి, తన ఒక్క అరచేతితో అందరి దోసిళ్ళు నింపేది. ఇవన్నీ, అనుభవించిన బిడ్డల జీవితాలే కాకుండా పరోక్షంగా

జీవ సముదాయమే కాక అదృశ్యరూపంలో అందుకున్న ఋషి దేవతా సమూహాలు కూడా ధన్యులు. అలాగే సంక్రాంతి పండుగ, ధనుర్మాస ప్రారంభంలో రోజూ అమ్మ, అందరికీ స్వయంగా దధ్యోదనం, చక్రపొంగలి, కట్టెపొంగలి మొదలైన ప్రసాదాలు సూర్యోదయ ప్రారంభ కాలంలోనే పెట్టేది. ఆవరణం అంతా, ముత్యాల ముగ్గులు నింపేవారు. అక్కయ్యలు, చెల్లెళ్ళు. సంక్రాంతి రోజున ఆవరణలో వున్న అందరికి అమ్మ స్వయంగా వచ్చి, ఒక్కొక్కరికి బొట్టు పెట్టి భోగిపళ్ళు పోసేది. ఎన్నివేల మందైనా సరే ప్రతి ఒక్కరికీ ఆ రోజు అమ్మచేతి భోగిపళ్ళతోనే ఆశీస్సులు. ఇలాగే ఎన్నిపండుగలో. దేవీ నవరాత్రులు, నవదుర్గలెలా వుంటారో గానీ, అమ్మ ఆ నవరాత్రాలలో నవ దుర్గలుగా శోభిస్తూ కనిపించేది. విఘ్నేశ్వరచతుర్థి రోజున పూజలో అమ్మ ముఖ మండలంలో కవళికలు మారి గజాననుని దర్శించగలిగిన వారికి తర్వాత అమ్మ తెరవేసి, ఆ ! ఏం కాదులే మన అమ్మే కదా!' అనిపించేది. ఒకసారి మందిరంలో (అంటే అమ్మ పాకయింటి దక్షిణం వైపు) మహాశివరాత్రి రోజున అమ్మకు అభిషేకాలు చేస్తున్నారు. నేను దూరంగా నుంచుని చూస్తూన్నాను. జనం రెండు వందల కంటె వుండరు. వసుంధర అమ్మకు ఎదురుగా దూరంగా నుంచుని అమ్మవైపు చూస్తూ నవ్వుతోంది. ఇంతలో వసుంధర నన్ను చూచి పిలిచింది. నేను వెళ్ళి "ఏమిటి సంగతి?" అని అడిగాను. "అమ్మను చూడు" అంది నవ్వుతూ. అమ్మను చూసి క్షణమాత్రం నిశ్చేష్టుడనయ్యాను అమ్మ శిరస్సంతా ఆంజనేయస్వామి స్వరూపం. నాలుక బయట పెట్టి, హాస్యంగా నా వేపు చూస్తూ వెక్కిరిస్తోంది. నేను "వస్తున్నా" వస్తున్నా' అనుకుంటూ దృష్టి మరల్చి కూడా తిన్నగా అమ్మ వైపు దగ్గరగా నడిచాను. అమ్మకు అయిదు అడుగుల దూరం వచ్చి చూచాను. అమ్మ ప్రశాంతంగా, గంభీరంగా, కిరీటం ధరించి హారతి స్వీకరిస్తోంది. ఇదంతా ఎందుకంటే ? అమ్మ కదా ?

1966లో అనుకుంటా. ఫిబ్రవరిలో 5 ఎకరాలలో (ప్రస్తుతం ఓరియంటల్ కాలేజి వున్న చోట) ప్రొద్దున్న 10.30 గంటలు పనిలో వున్నాను. ఇంతలో ఎవరో వచ్చి రాధన్నయ్యా ! నిన్ను అమ్మ రమ్మంటోంది అన్నారు. పొలం లోంచి పైకివచ్చి, ఇంటి వైపు బయల్దేరాను. అమ్మ పాక యింటికి వచ్చాను. "అమ్మ బాత్‌రూమ్‌లో వుంది" అన్నారు. అలాగే తలుపు తీసుకు లోపలికి వెళ్ళాను. అమ్మ స్నానం ప్రారంభం కాబోతోంది. (లోపలి ఆనందంగా వున్నా) కొంచెం విసుగుతో, "ఏంటమ్మా పిల్చేవుట,

అవతల చాలా పని వుంది చెప్పు. అన్నాను. అమ్మ గట్టిగా నవ్వుతూ "మా పిల్లవాడు అలసిపోతున్నాడమ్మా పొలం పనుల్తో" అంది. అప్పుడు (నాకు సరిగా గుర్తులేదు) బాత్‌రూమ్‌లో. కృష్ణవేణమ్మగారు. కాత్యాయనీ, వసుంధర, గజేంద్రమ్మ అక్కయ్య వున్నారు. అమ్మ నవ్వుతూ. నా వైపు చూసి. "నాన్నా ! ఒడుగు చేసుకుంటావా? అంది. "ఇదేంటమ్మా, యిందుకా పిల్చింది. అవతల పనుందమ్మా ! ఇప్పుడు నా ఒడుగు తొందరేముంది ? అన్నాను. "ఇప్పుడు చేస్తే చేసుకుంటావా నాన్నా !" అంది "నువ్వు చెప్పింది నేనెప్పుడన్నా కాదన్నానమ్మా ! నీ యిష్టం" అన్నాను. అంతే ! అక్కడే, గోడమేకుకు తగిలించి వున్న యజ్ఞోపవీతం తీసి మెళ్ళో వేసి "అయిందిపో నీ ఒడుగు" అంది నవ్వుతూ. నేను నవ్వుతూ. "అయింది కదమ్మా ఇంక నే వెళ్తున్నానమ్మా" అని బయటికి వచ్చేశాను. మళ్ళీ అమ్మ పిలుస్తోంది అన్న పిలుపు. ఈసారి అమ్మ స్నానం చెయ్యకుండా, వెనకాల గదిలోకి వచ్చి మంచం మీద కూర్చుంది నేను వెళ్లేను. "దా నాన్నా ? రాధా".

వచ్చి అమ్మ పాదాల దగ్గర కూర్చున్నాను. అమ్మ పొలం విషయాన్ని గూర్చి 10 ని.లు మాట్లాడింది. ఇంతలో కృష్ణవేణమ్మ గారు ఒక గిన్నెలో ఇడ్లీలు తెచ్చారు. అమ్మ వాటిలో నెయ్యి వేసి నెమ్మదిగా ఎంతో వాత్సల్యంతో "తిను నాన్నా" అని నోటికి తినిపించింది. చాలా పెట్టిందేమోననిపించింది. అమ్మ అక్కడే గిన్నెలో చేతుల కడుక్కుని చేయి తుడుచుకుని కృష్ణవేణమ్మగారి వైపు చూసింది. ఆవిడ అమ్మకి నూనెగిన్నె నిచ్చారు. అమ్మ నా తలకు నూనె పెట్టి, కృష్ణవేణమ్మగారితో "రాధను తీసుకు వెళ్ళి తలంటు పోసి, పాదాలకు పారాణి పెట్టు" అని చెప్పి నా తలమీద చెయ్యి పెట్టి లేచి మళ్లీ స్నానాల గదిలోకి వెళ్ళింది. కృష్ణవేణమ్మ గారు నాకు తలంటు పోసి, పాదాలకు పారాణి రాసి "అమ్మ కట్టుకోమంది" అని పసుపు దీక్షా వస్త్రాలు యిచ్చింది. ఇంతలో మళ్ళీ అమ్మ పిల్చింది. ఆ పాక యింట్లో లోపలికి వెళ్ళాను. అమ్మ తలంటు పోసుకుని వచ్చి లోపల కూర్చుంది. ఆ రోజు మహాశివరాత్రి కదా ! అమ్మ పూజకు సిద్ధమౌతుంది. లోపల హరికేన్ లైటు వుంది. అమ్మ పాదాల వద్ద కూర్చున్నాను. "నాన్నా ! దీక్షా వస్త్రాలిచ్చారా ?" "యిచ్చారమ్మా ! కట్టుకున్నాను" అక్కడే వున్న కుంకుమ భరిణలోంచి కుంకుమ తీసి నామం బొట్టు పెట్టింది. బుగ్గలు నిమురుతూ "నాన్నా! పూజ జరుగుతుండగా దీక్షా వస్త్రాలతో వచ్చి భిక్ష అడుగు" అంది. అలాగేనని చెప్పి, పాదాలకు నమస్కరించి బయటకు వచ్చేశాను. తర్వాత పూజలో అమ్మకు కిరీటం పెట్టేరు.

జేగంటలు, శంఖం మ్రోగుతున్నాయి. నేను తిన్నగా వెళ్ళి అమ్మ ముందు నుంచుని "భవతీ ! భిక్షాం దేహి!" అన్నాను. అమ్మ అర్ధనిమీలితంగా, తన వోళ్ళో వున్న పూలు తీసి నా భిక్షా వస్త్రంలో వేసింది. నేను అలాగే అమ్మ పాదాలకు తలవంచి నమస్కరించి ప్రక్కకు తప్పుకున్నాను. పూజ అయిన తర్వాత అమ్మ రాయప్రోలు భద్రాద్రి రామశాస్త్రి గార్ని పిలిచి "రాధకు 16 రోజులు ఉభయ సంధ్యలు చేయడం నేర్పు" అంది. ఆ రోజు నుంచి పొలం లేదు. 16 రోజులు దీక్షా వస్త్రాలతో శ్రద్ధగా సంధ్యవార్చేవాణ్ణి? చివరకు అమ్మ 16 రోజుల పండుగ చేయించింది. ఈ మహాతల్లి నాకు ఉపనయనం చేయడానికి బహుశా కారణం చాలా కాలం తర్వాత తెలిసింది అని నేను అనుకున్నాను. ఏది ఏమయినా నేను నిమిత్త మాత్రుడిగానే వుండేవాణ్ణి. ఎందుకంటే, ఏంకావాలో, ఏం చెయ్యాలో తెలియదు కనుక.

(4)

అక్కడ, విచిత్రం అనను గానీ, విశేషంగా మనం వినేది, "అమ్మ ఏం చేస్తోంది?" ఆవరణలోని వాళ్ళు అందరూ కూడా, పొద్దున్నించి సాయంత్రం వరకు అటూ ఇటూ వస్తూ పోతూ, "అక్కయ్య అమ్మ ఏం చేస్తోంది ?" అని అడగటం, దానికి సమాధానంగా, అప్పటి పరిస్థితిని బట్టి, అమ్మ ఫలాన వాళ్ళతో మాట్లాడుతుందనో, లేక స్నానం చేస్తోందనో, లేక పూజలో (అంటే అందరికి దర్శన మిస్తూ పూజలందుకోవడం) వుందనో చెప్తూ ఉంటారు. అడిగిన వారు వీలైతే అమ్మను మళ్ళీ మళ్ళీ పూజలో దర్శించడమో, కాక అమ్మ దగ్గర (వీలైతే) కాస్సేపు కూర్చుని వెళ్ళటమో, లేక ఒకసారి కిటికీల్లోంచి అమ్మను చూచి వెళ్ళడమో జరుగుతుంది. అక్కడ రోజూ వుండేవాళ్ళకు కూడా అమ్మను ఎన్నిసార్లు చూచినా తనివితీరదు. అమ్మ మాటలు వినాలి - అవి అర్థమయినా కాకపోయినా - మనకి సంబంధించినవైనా కాకపోయినా, అమ్మ మాటలలోని ధ్వని, అమ్మను జన్మ జన్మల పాటు విన్నా తనవి తీరనిది. నా మటుకు నాకు అమ్మ "దా నాన్నా రాధా!" అని పిలినప్పుడు మనస్సు ఆనందంతో పరవశించేది.

మా నాన్నగారు, నా స్కూలు రోజుల్లో కూడా, ఉదయాన్నే నిద్రలేపుతూ" నాన్నా రాధా ! తెల్లవారింది" లే అని, అంతటితో ఊరుకోకుండా, "రాధ' యను సుధా మధురాక్షరములు రెండు కలవు" అని యేదో పాట పాడి నన్ను లేపేవారు. అలాగే "అమ్మ" యను సుమధుర, మధుర మధురాక్షరములలోంచి వచ్చిన నా పేరుతో నా

జన్మ పునీతమైంది అనిపించింది. అలాగే అమ్మ ఎడంచేత్తో బుగ్గలు పట్టుకుని, యెంతో ఆప్యాయంగా కళ్ళల్లోకి చూస్తూ బొట్టు నామం పెడ్తున్నప్పుడు, "నాన్నా ! నీకు ఇది నా రక్ష నాన్నా" అంటున్నట్లు అనిపించేది. ఎందుకంటే అనంత కోటి బ్రహ్మాండాలను తనలో వుంచుకున్న ఈ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి దృష్టి, అల్పాతి అల్పమైన ఈ ప్రాణిపైన కూడా పడింది కదా అన్న బ్రహ్మానందం. నాకేకాదు, అమ్మను దర్శించిన లక్షలాది సోదరీ సోదరులకు కూడా, 'అమ్మ నన్ను ప్రత్యేకంగా చూస్తోంది' అన్న ప్రగాఢమైన విశ్వాసం వుంది. అందరి అమ్మ కదా! తనకు 'ఈ కలిలో ఆకలిలేదంటూ' లక్షమంది బిడ్డలు అన్నం తిన్నారనే తృప్తి కన్నా, 'ఒక్క బిడ్డ అన్నం తినలేదనే బాధ యెక్కువమ్మా' ! అన్న మాతృమూర్తి మాటలో మమతల గర్భగుడి కదా ! నాకు అన్వయించుకోవడం అపరాధమైనా, ఇక్కడ ఒక సంఘటన వివరించక తప్పదు. ఎందుకంటే జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గర నా జీవితం కదా!

1966లో అమ్మ జన్మదినోత్సవం దగ్గరవుతోంది. నేను చాలా పనుల్లో తిరుగుతున్నాను. సింగుపాలెం తాతయ్య ఆధ్వర్యంలో పందిళ్ళు పూర్తి అయినాయి. నేను కూడా నా ఓపిక కొద్దీ చెయ్యగలిగాను. అందరింటికి రంగులు వెయ్యాలని, ప్రారంభించాను. క్రింద గదులన్నింటికి రంగులు వేశాను. అమ్మ జన్మదినం, పూజలు మొదలయినాయి. జనం 10 వేల వరకు వుంటారు. వడ్డనకు చాలా మంది కావలసి వచ్చారు. నేను కూడా వడ్డన మొదలెట్టాను. మధ్యాహ్నం ఒంటిగంట నుండి రాత్రి 12 గంటల వరకు అందరితో బాటు వడ్డన చేశాను. తర్వాత ఆకలి లేక వెళ్ళి నిద్రపోయాను. అప్పుడు అమ్మ అందరింటి చివరి గదుల్లో వుండేది. పొద్దున్నే లేచి అమ్మ గదిలోకి వెళ్ళాను. అప్పటికే లోపల అమ్మ చుట్టూ పదిమంది దాకా వున్నారు. అమ్మ చాలా బడలికగా కన్పించింది. నేను అమ్మ వైపు చూశాను. అమ్మ నావేపు చూడలేదు. అక్కడ గంట సేపువున్నాక అమ్మ నన్ను చూసినా చాలా చికాకుగా మొహం త్రిప్పుకుంది. నేను హడలిపోయాను. భయపడ్డాను మొదటిసారిగా. క్రుంగిపోయాను. చాలా ఏడుపు వచ్చింది ఆపుకున్నాను. అమ్మ నెమ్మదిగా లేచి నన్ను ఆనుకొని నా ముందు నుంచి వెళ్తూకూడా నన్ను చూడలేదు. నాకు అర్థమైంది "ఈవిడగారికి నా మీద కోపం వచ్చినట్లుంది – ఎందుకు ?" నాకు అర్థం కాలేదు. నాకు అమ్మ నవ్వితే చాలు, చాలా వుత్సాహం వస్తుంది. ఎన్ని పనులకైనా సిద్ధం. ఈ ప్రపంచం అంతా ఎంతో ప్రేమ, ఆనందమయంగా కన్పించేది. కానీ అమ్మ ఎందుకు యిలా వుంది ?

సరే అమ్మతో తర్వాత మాట్లాడవచ్చు అనుకొని వెళ్ళిపోయాను. కాని పొద్దున్న టిఫిన్ తినాలనిపించలేదు. ఆ రోజు 11 గంటలకు అమ్మకు అందరింటి ముందు వేదికపై పూజ చేస్తారు. అమ్మ స్నానం చేసి వచ్చే టైముకు నేను కూడా స్నానం చేసి వచ్చేను. అమ్మ తయారైంది. నేను లోపలికి వెళ్ళాలని తలుపు కొట్టాను. (మామూలుగా అయితే నాకు తలుపు వెంటనే తీసేవారు) కానీ ఎవ్వరూ తలుపు తీయలేదు. బయట గుమ్మం ముందు రెండు వరుసలుగా జనం వేదిక వరకు నుంచున్నారు. రాధాకృష్ణరెడ్డి జేగంట కొడుతూ, శంఖం వూదుతూ, "అనుసూయా రావమ్మ, రాజేశ్వరీ రావమ్మా" అంటూ పాడుతుంటే, అందరూ కూడా పాడుతున్నారు. నాకు ఏం చేయాలో తోచక అమ్మ వచ్చే గుమ్మానికి ఎదురుగా నుంచున్నాను. (అమ్మ నన్ను దాటుకు వెళ్తేగాని రెండో గుమ్మం దాటి వేదికవేపు వెళ్ళే అవకాశం లేదు. అసలు నేను అక్కడ నుంచో కూడదు. చాలా తప్పు. ఎవ్వరికీ అక్కడ నుంచునే ధైర్యం వుండదు ఆ సమయంలో రామకృష్ణ అన్నయ్య వేదికపైన అమ్మకోసం ఎదురుచూస్తున్నాడు. జనం అయిదు వేల వరకు వుంటారు). ఇంతలో తలుపు చప్పుడైంది. తలుపు తెరుచుకుంది. ఎదురుగా అమ్మ. అలంకారంతో చాలా గంభీరంగా వుంది. గుమ్మానికి ఇటు నేను, అటు అమ్మా, నేను కదలలేదు. "నువ్వెవరివిరా ! మా అమ్మను ఆపడానికి ?" అన్నట్లు తలుపులు రెండూ నా మోహాన్న మూసుకున్నాయి. అంటే అమ్మ ప్రక్క గదిలో తలుపులు తీసి మళ్ళీ యీ గదిలోంచే వేదిక వేపు వెళ్లాలి. నేను యిది వూహించి, కుడి ప్రక్కకు తిరిగి నుంచున్నాను. బయట అమ్మను ఆహ్వానిస్తూ రాధాకృష్ణరెడ్డి వాళ్ళందరూ జేగంటలతో అమ్మ నామం చేస్తున్నారు. మళ్ళీ కుడిప్రక్క తలుపు తెరుచుకుంది. ఎదురుగా అమ్మా, వెళ్ళద్దని నేను గుమ్మానికి అడ్డంగా చేతులు పెట్టాను. అమ్మ నా వేపు చూసి ప్రక్కకు తప్పుకోమన్నట్లు సౌంజ్ఞ చేసింది. నేను లేవన్నాను. అమ్మ ముందుకు నడిచి నా చేతిమీద కొట్టింది. క్షణంలో ఏం జరిగిందో తెలియదు. నేను ఏం జరిగిందా అని చూసే సరికి అమ్మకు వేదికపై పూజ జరుగుతుంది. నాకు ఏమైందో తెలియలేదు. అమ్మ మీద చాలా కోపం వచ్చింది. చాలా వుక్రోషంగా వెళ్ళిపోయాను. ఆ రోజంతా చాలా బాధపడ్డాను. చాలా వెనుక నుంచే అమ్మకు జరిగే పూజ చూచి అక్కడక్కడే తిరిగేను. వడ్డన చేశాను. భోజనాల టైములో. ఆ రోజు అన్నం తినాలనిపించలేదు. ఆ రోజు రాత్రి కూడా అమ్మ మీద కోపంతో భోజనం చెయ్యలేదు. రాత్రికి చాలా మంది జనం వెళ్ళిపోయారు. కస్తూరి చాలా బ్రతిమాలింది. నాకు అన్నం

తినాలనిపించలేదు. నేను, సుబ్బారావు (అమ్మగారి పెద్దఅబ్బాయి), గదిలో (ప్రస్తుతం సుందర రామిరెడ్డిగారి గది వెనుక భాగంలో) పడుకున్నాను.

మర్నాడు ఎక్కడికీ కదలలేదు గదిలోనే వున్నాను. కస్తూరీ కాఫీ యిస్తే తాగేసాను. పగలు భోజనం చెయ్యలేదు. ఆవరణలో నీరసంగా పచార్లు చేస్తున్నాను. అమ్మ మీద కోపం, ఉక్రోషం – అన్నం తినాలనిపించదు. సాయంత్రం 7.30 గంటలకు ఒక్కడిని, రూమ్‌లో మంచం మీద పడుకున్నాను. నా రూమ్‌లోకి రావాలంటే వెనుక వైపు పునాదుల మీదుగా రావాలి. ఆలోచిస్తూ చాలా బాధగా పడుకున్నాను. అమ్మ నాతో ఎందుకు మాట్లాడలేదు. ఇదే ఆలోచన. ఆకస్మాత్తుగా రూమ్‌లో శబ్దమైంది. కళ్ళు తెరిచాను. ఎదురుగా అమ్మ. తెల్లచీర, జుట్టు విరబోసుకుని వుంది (స్నానానికి వెళ్ళాలేమో). వెనుకాల కస్తూరి, వసుంధర. నేను మంచంలోంచి లేవకుండానే "ఎందు కొచ్చావ్ ?" అంటూ నెమ్మదిగా లేచి మంచంమీదనే కూర్చున్నాను. అమ్మ నుంచునే వుంది. ఎడం చేత్తో నా జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి గట్టిగా పట్టుకుని కుడి చేత్తో దవడమీద శబ్దం (మాత్రమే) వచ్చేట్లుగా గట్టిగా కొట్టింది. (నేను ఏ అదృష్టం చేసుకున్నానో అమ్మ చేతిదెబ్బ తినడానికి) అమ్మ కొట్టడం శబ్దం వరకే పరిమితమైంది. ("అమ్మ కదా!")

అమ్మ : "అన్నం మానేసి ఎవణ్ణి ఉద్ధరిద్దామనుకున్నావురా ?"

నేను : "నీకు నా మీద కోపం ఎందుకు వచ్చింది ?" సీరియస్‌గానే అన్నాను.

అమ్మ : నువ్వు మొన్న అన్నం తిన్నావా ? (అమ్మ పుట్టినరోజున)

నేను : నన్నేం చెయ్యమంటావమ్మా ! ఆ రోజంతా వద్దన హడావుడిలో ఆకలి వెయ్యలేదు. నువ్వు చెప్పవచ్చు కదా ! నేను యిక్కడికి దేనికి వచ్చాను ? కూలికి కాదు కదా? నీ చిరునవ్వులోనే నేను బ్రతుకుతున్నాను. నాలో ఏమన్నా తప్పువుంటే నువ్వు పిలిచి చెప్పు. అంతేకాని నువ్వు సీరియస్‌గా వుంటే నాకు యెట్లా వుంటుంది ?

అమ్మ : అయితే జీవితంలో నువ్వు యెన్నడూ అన్నం మానకూడదు, సరేనా !

నేను : అయితే నువ్వు కూడా అకారణంగా నా మీద కోపం తెచ్చుకోకూడదు. నేను చూచినప్పుడల్లా నువ్వు నవ్వుతూ ఉండాలి. సరేనా ! అలా అని నా చేతిలో చెయ్యి వెయ్యి" అని నా చెయ్యి చాచేను.

అమ్మ నా చేతిలో చెయ్యి వేసి, నడుం చుట్టూ కూడా చెయ్యి వేసి "పద అన్నం తిందువు గాని" అని తనగదిలోకి తీసుకొని వెళ్ళి తన గదిలోకి అన్నం తెప్పించి కలిపి నోటికి అందించి తినిపించింది. నాటి నుంచి నేటి వరకు నేను అన్నం మానలేదు. అమ్మ కూడా రాజగోపాలచారి అన్నయ్యగారింట్లో అనారోగ్యంతో విపరీతంగా దగ్గుతూ కూడా ఆ బాధలో నవ్వేది. నాకు అర్థమయి, అమ్మను బ్రతిమాలేను. "అమ్మా యింత బాధలో నవ్వవద్దమ్మా, నాకు యిచ్చిన మాటేమిటమ్మా నా కారణంగా బాధపడవద్దమ్మా" అని ప్రార్థించేను. కానీ అమ్మ యిచ్చిన మాట కదా ! వరాల మాట కదా !

కాలం గడిచిపోతోంది. నెమ్మదిగా పొలం పనుల్లోంచి లైబ్రరీలోకి వచ్చాను. ఆవరణ నిర్వహణకు సంబంధించిన పనులు కూడా ఎక్కువైనాయి. ఇంతలో అమ్మ నుంచి పిలుపు వచ్చింది. అమ్మ దగ్గరకు వెళ్ళాను ప్రక్కనే వసుంధర వుంది. రామకృష్ణ అన్నయ్య లెఖ్ఖల్లో హడావుడిగా వున్నాడు, కొంతకాలం నువ్వు యిక్కడ కూర్చుని పూజలు చేయించు నాన్నా" అంది. "అదేంటమ్మా నాకు అసలు ఏమీ తెలియదు. ఎప్పుడు అగరువత్తులు వెలిగించాలో ఎప్పుడు హారతి యివ్వాలో, ఏమీ తెలియదు. నాకు పొలం పనుల్లోనే చాలా బావుంది. నాకు వొద్దమ్మా" అన్నాను. "నాన్నా నీ యిష్టం వచ్చినట్లు చేయించు అదే పూజ" అంది నవ్వుతూ. వసుంధర, "రాధన్నయ్యా నేను నీ ప్రక్కనే కూర్చుని చెప్తూంటాలే నీకు అలవాటయ్యే వరకు" అంది. నాకు యేం చెయ్యాలో తోచక "నీ యిష్టం అమ్మా" అన్నాను. అప్పటి నుంచే ప్రారంభం అయింది నా అర్చకత్వ కార్యక్రమం. దగ్గర దగ్గర ఒక సంవత్సరం పాటు అమ్మ పాదాలకు అర్చకుణ్ణి అయ్యాను. అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు వినియోగపడ్డాను. రకరకాల వ్యక్తులతో పరిచయం, వివిధ రకాల పూజలు, ఆ రోజుల్లో ఒక రోజు అమ్మను చూడటానికి ఉమామహేశ్వర పండిట్ వచ్చారు. నేను వీరిని గురించి చాలా విన్నాను. ఇప్పుడు చూశాను. మంచి విగ్రహం, దబ్బపండు రంగు, శ్రీనాధుడంటే బహుశా వీరిలాగే వుండేవారేమో. వీరంటే క్రైస్తవ మత ప్రచారకులకు సింహస్వప్నం. వీరు అమ్మతో ఏం మాట్లాడుతారోనని కుతూహలం. పాకయింట్లో హాలులోకి ఆహ్వానించి అమ్మ మంచం ముందు కూర్చోమన్నాను. టేప్ రికార్డర్ రెడీ చేశాను. ఉదయం పదకొండు గంటలయింది. అమ్మ హాల్లోకి నెమ్మదిగావచ్చి మంచం మీద కూర్చున్నారు. నేను అమ్మకు ఎడం వైపుగా పాదాల దగ్గర కూర్చున్నాను. నా ప్రక్కన వసుంధర, తర్వాత డైరీరాయడానికి కుమారి కూడా కూర్చుంది. హాల్లో నిశ్శబ్దంగా

వుంది. ఉమామహేశ్వర పండిట్ అమ్మ పాదాలను చూసి తర్వాత అమ్మకళ్ళలోకి చూశారు. అమ్మ ప్రశాంతంగా ఆయన కళ్ళల్లోకి చూసింది. అలా రెండు నిమిషాలు. సంభాషణ ప్రారంభం అవుతుందని నేను టేప్‌రికార్డర్ ఆన్ చేశాను. ఆయన నెమ్మదిగా తలవంచు కున్నారు. ఆయన కళ్ళల్లో నీళ్ళు. ఆయన చాలా సేపు ఏడుస్తూనే వున్నారు. 'అజ్ఞానిని క్షమించు తల్లీ!" అన్నారు ఏడుస్తూనే. అమ్మ ఆయన వైపు చూసింది. నవ్విందా లేదా అనిపించింది. ఆయన అమ్మ పాదాల మీద వాలేరు. రెండు నిమిషాలు శిరస్సు అమ్మ పాదాల మీద వుంచి, నెమ్మదిగా తలయెత్తి, "వెళ్లివస్తాను సెలవిప్పించండి" అన్నారు. కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ, అమ్మ, ప్రక్కనే వున్న కుంకుమ పొట్లం తీసి వారికి బొట్టు పెట్టింది. రెండు పళ్ళుయిస్తూ, "భోజనం చేసి వెళ్ళు నాన్నా!" అంది. ఆయన నమస్కారం చేసి, నెమ్మదిగా బయటకు వెళ్ళారు. నేను అమ్మ వైపు చూసి "ఇదేంటమ్మా ఇక్కడ సంభాషణ కోసం ఇన్ని ఏర్పాట్లు చేసుకుంటే యిట్లా చేశావ్, ఒక్క మాట కూడా లేదు" అన్నాను. అమ్మ చిరునవ్వే సమాధానమయింది.

5

ఆ రోజుల్లో కొన్ని సమయాల్లో, కొంతమందిని నాకు ప్రత్యేకంగా పిలిపించి చూపించేది. అంటే వారికి అమ్మలో ఐక్యతకు కొద్ది కాలమే వుందన్నమాట. ఇలాగే ఒకసారి నన్ను పిలిపించింది. నేను వెళ్ళినవెంటనే "దా, నాన్నాకూర్చో" అంది. అమ్మ పాదాల దగ్గర కూర్చున్నాను. అమ్మ నా వేపు కొంచెం వంగి "ఆ బాబును చూడు" అంది. కొంచెం వెనుక 13 ఏళ్ళ కుర్రవాడు కూర్చున్నాడు. ఎరుపు తెలుపు కలిపిన రంగులో, ఎంతో కళగా బాగున్నాడు. అమ్మ చాలా నెమ్మదిగా "ఎన్‌లార్జిమెంట్" అంది. ఖంగారుగా అమ్మవేపు చూసి "ఎప్పుడు'" అన్నాను. నాకు చాలా బాధవేసింది. తర్వాత ఆ కుర్రవాడు. తల్లిదండ్రుల్తో భోజననానికి వెళ్ళిపోయాడు. ఇలాంటి విషయాలలో అమ్మ నన్నే ఎందుకు చాలా సార్లు పిల్చిందో నాకు నేటికీ బోధ పడలేదు. వారంరోజుల తర్వాత ఆ అబ్బాయి తండ్రీ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది అమ్మకు " మా అబ్బాయి హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్"తో పోయాడని.

ఒకసారి వెంకటేశ్వరరావుగారు, డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఒంగోలు నుండి ఆఫీసు పని మీద జిల్లెళ్ళమూడి వచ్చారు. నేను వారికి ఒక రూమ్ ఇచ్చాను. ఆయన చాలా అహంకారంతో, పొగరుగా వున్నాడు. "మీ పనయిం తర్వాత చెప్పండి అమ్మను

చూసి వెళ్దురుగాని" అన్నాను. "Let me see. If I find time, I will think it over" అన్నాడు. ఆ తర్వాత ఆయన పని అయింతర్వాత, పాక యింటి హాల్లోకి తీసుకు వెళ్ళాను. అమ్మ అక్కడే వుంది. దర్శనం కోసం వచ్చిన 10 మంది వున్నారు. ఆయన అయిష్టంగానే, వెనక్కూ కూర్చున్నారు. అమ్మ తీర్థం యిస్తున్నారు. నేను అమ్మ పాదాల వద్ద కూర్చుని "రండి, తీర్థం తీసుకోండి అన్నాను. "That's alright. It's OK" అన్నారు. "ఫర్వాలేదు రండి" నేను మళ్ళీ అన్నాను. ఆయన కొంచెం ఇబ్బందిగానే వచ్చి తీర్థం తీసుకొని బయటకు వెళ్ళారు. ఆ తర్వాత ఆయన సతీసమేతంగా పది రోజులు తర్వాత వచ్చారు. ఆవిడ చాలా సౌమ్యురాలు అమ్మను చూడగలిగినందుకు ఎంతో ఆనందించింది. నెలరోజుల తర్వాత పిల్లలతో సహా వచ్చారు. ఆవిడ అమ్మతో చెప్పింది. "మా వారు ఫారెన్ వెళ్తున్నారమ్మా నెలరోజుల పాటు" అని. అమ్మ "పిల్లలకి సెలవులు కదా నాన్నా, నువ్వు వచ్చేంత వరకు పిల్లల్ని, అమ్మాయిని యిక్కడే వుంచవచ్చు. "పిల్లల ఆవరణలో పిల్లలతో కలిసి ఆడుకుంటారు" అని ఆయన "నేను ఏర్పాటు చేశానమ్మా. ఓడరేవులో గెస్ట్‌హౌస్‌లో వుంచుతున్నాను" అన్నారు. అమ్మ నీ యిష్టం నాన్నా! ఇక్కడ చాలా మంది పిల్లలున్నారు. ఆవరణం అంతా తిరగవచ్చు, అమ్మాయి (వారి భార్య) నా దగ్గర వుంటుంది, ఆ పైన నీ యిష్టం" అని. తర్వాత ఆయన వెళ్ళిపోయారు. 3 నెలల తరువాత ఆయన, భార్యతో వచ్చారు. చాలా చిక్కిపోయాడు. అమ్మ పాదాలపై పడి చాలా యేడ్చాడు. ఆయన కొడుకు (13 సంవత్సరాలు) ఓడరేవులో సముద్రంలో ఆడుకుంటూ అమ్మలో ఐక్యమయ్యాడు. ఇలాంటి సంఘటనలు జరుగుతూండేవి. వీటిలో చాలా సంఘటనలకు ముందు అమ్మ సూచనలతో నాకు అర్థమయ్యేవి, వారు అమ్మలోకి ప్రయాణానికి సిద్ధమౌతున్నారని.

అక్కడ వుండే రోజుల్లో అనేకమైన శుభకార్యాల్లో వివాహాలు చాలా మందికి చేసేది. ఆర్థికంగా ఇబ్బంది లేక అన్ని వసతులు వున్నవాళ్ళకి ఏ సమస్య లేదు. ఒక్కొక్కప్పుడు ఆర్థికంగా ఏ స్తోమత లేని వారు యిరువైపుల వాళ్ళు వచ్చేవాళ్ళు. మాకు వాళ్ళ వివాహం చాలా ఆనందాన్నీ, తృప్తి నిచ్చేది. నేను సన్నాయి కార్యక్రమాలు ముందే టేపు చేసి రెడీగా వుంచేవాణ్ణి. నేను సరే అర్చకుణ్ణి ! మా వాద్యబృందం టేపు రికార్డర్. ఆవరణంలో వాళ్ళు ఆడపెళ్ళివారుగా, మొగపెళ్ళి వారుగా వుండేవారు. అమ్మ పాదాల దగ్గర వారి వివాహం అత్యంత వైభవంగా జరిగేది. అమ్మ పెళ్లి కొడుక్కి బట్టలు

పెట్టింది. అంతేకాదు కొత్త దంపతులు కదా, వారి ఖర్చుల కోసం కొంచెం డబ్బు కూడా యిచ్చేది. పెళ్లికూతురికి పట్టుచీర, కట్టుడు చీర, తన చేతుల నుండి బంగారు గాజులు యిచ్చేది. ఇవి వాళ్ళు ఎన్నడూ ఊహించనివి. ఎంత అదృష్టవంతులో వాళ్ళు. తరువాత వాళ్ళందరికి భోజనాలు ఆవరణంలో వాళ్ళుఅందరూ, తమ యింట్లో. జరుగుతున్నట్లే ఆనందంతో ఆ పెళ్ళి కార్యక్రమంలో పాల్గొనేవారు.

ఇలా నేను అర్చకుడి స్థానంలో సంవత్సరంపైగా కూర్చునే అవకాశం యిచ్చింది అమ్మ. అనేక కార్యక్రమాలు పసిపాపల అన్నప్రాసన, బాలసారె, నామకరణం, అక్షరాభ్యాసం, తర్వాత ఉపనయనాలు, వివాహాలు, అమ్మకు వివిధ రకాలుగా పూజలు మొదలైన వాటన్నింటిలోనూ అమ్మ పాదాల దగ్గర కూర్చుని, నేను డ్యూటీగా మాత్రం నిర్వహించే వాణ్ణి. అమ్మను చూస్తూ వుండటం, అమ్మ మాటలు (ధ్వని) వినడంలో వున్న ఆనందం, సంతోషం, అర్చక స్థానంలో అనుభవించలేదు. ఇలా చాలా కాలం తర్వాత, ఒక రోజు అమ్మ పాకయింటి హాల్లో, అమ్మను దర్శించిన సోదరీ సోదరులంతా భోజనాలకి వెళ్ళిపోయారు. అమ్మ, నేను వున్నాం. ప్రశాంతంగా వుంది. అమ్మ పూలరేకులు తన పాదాలపై వేసుకుంటూ యేవో ఆలోచిస్తోంది. పదిహేను నిమిషాలు.

నేను : అమ్మా ! ఏంటి ఆలోచిస్తున్నావు ?

(అమ్మ దగ్గర నుండి సమాధానం లేదు. నేను మళ్ళీ అదే ప్రశ్న అడిగాను)

అమ్మ : (నావేపు చూసి నవ్వుతూ) నాన్నా, యింతమంది చేత పూజలు చేయిస్తున్నావు, చేయించావు, నీకు ఎప్పుడూ పూజ చేసుకోవాలని అనిపించలేదా ? (ఎంతో వాత్సల్యంతో అడిగింది)

నేను : ఏంటోనమ్మా ! నాకు ఎప్పుడూ ఈ ఆలోచన లేదు. నిత్యం నిన్ను చూడాలని, నువ్వు మాట్లాడుతుంటే నీ స్వరం వినాలి అనే తప్ప. చేసేదంతా, నేను కాదు, నువ్వు చేయిస్తున్నావు. అనే ఆలోచన కూడా లేకుండా చేతులు కదులుతున్నాయి. కళ్ళు చూస్తున్నాయి. నోరు అవసరాన్ని బట్టి మాట్లాడుతోంది. నేనేం చెయ్యనమ్మా. నాకు ఆకలి వేసినప్పుడు నిన్ను దర్శించటానికి వస్తున్న వాళ్ళు వున్నా కూడా ముందు నేను అన్నం తిన్న తర్వాత నీ దగ్గర పూజలు చేయించబడతాయి. వీళ్ళందరూ హాల్లోంచి వెళ్ళిన వెంటనే నిద్రలోకి వెళ్లటం జరుగుతోంది. నీకు ఎలా కావాలంటే అలా నడిపించు. నేను ఎందుకు, ఏమిటి అని ఆలోచించలేదు. (ఇది జరిగిన తర్వాత నేను రెండు

నెలలు 24 గంటల్లో 20 గంటలు నిద్రలో వుండేవాణ్ణి) ఒక్కొక్కప్పుడు స్నానం చేసి వచ్చి అమ్మ హాల్లోనే నిద్రపోయేవాణ్ణి. తలుపులు వేసి అమ్మను చూడటానికి వచ్చేవాళ్ళు బయట వరండాలోనే నిరీక్షిస్తూ ఉండేవాళ్ళు. అమ్మ హాల్లోకి వచ్చి కూర్చున్న తర్వాత వరలక్ష్మి, వసుంధర వచ్చి లేపే వాళ్ళు. నేను నిద్రలేచి పూజలు నిర్వహించే వాణ్ణి. వాళ్ళు వెళ్ళిన వెంటనే మళ్లీ నిద్రలోకి వెళ్ళేవాణ్ణి. ఈ ప్రక్రియ తర్వాత నేను నిత్యం మెళుకువగానే ఉండేవాణ్ణి. అంటే, అమ్మని స్నానాల గదిలోకి తీసుకువెళ్ళడం, టూత్‌పేస్ట్ అవీ యిచ్చి బ్రష్ చేసేంతవరకు, తర్వాత అమ్మ సబ్బుతో మొహం కడుక్కునేది చంద్రబింబంలాగా ఒక్క సెకండ్‌లో చక్కగా బొట్టు పెట్టుకునేది మంగళసూత్రాలపై గ్లాసుతో కొంచెం నీళ్ళు పోసి, కళ్ళకద్దుకొని తీర్థంగా స్వీకరించేది. నెమ్మదిగా వెనుక గదిలోకి వచ్చి కూర్చునేది. వరలక్ష్మి అమ్మకు నాకు రెండు గ్లాసుల్లో కాఫీ యిచ్చేది అమ్మ తను కొంచెం తాగిన తర్వాత నా గ్లాసులో కొంచెం పోసిన తర్వాత నేను తాగేవాణ్ణి రోజంతా పూజా కార్యక్రమాలతో పాటు ఆవరణలో పనులు చూసి మళ్ళీ రాత్రి అమ్మ గదిలోనే అమ్మను చూస్తూ కూర్చునే వాణ్ణి. అప్పుడప్పుడు కొంచెం కునుకు వచ్చినా అమ్మ చెయ్యి కదిలనప్పుడు వచ్చిన గాజుల శబ్దానికి వెంటనే మెళకువలోకి వచ్చేవాణ్ణి. ఇలా కంటి రెప్ప వెయ్యకుండా, రెండు నెలల పాటు వున్నాను. కానీ నాకు ఎప్పుడూ శ్రమ అనిపించేది గాదు. అమ్మ నాకు, యింతకు పూర్వం వివరించినట్లు స్నానాల గదిలో ఒడుగు చెయ్యడం, ఈ కార్యక్రమాలు నిర్వహించడం కోసమా ? అని నవ్వుతూ అమ్మ కళ్ళలోకి చూశాను.

అమ్మ నా తలనిమురుతూ "నీకు యివన్నీ అక్కర్లేదులే నాన్నా" అంది. (కానీ, నేను అమ్మా ఎందుకు యిలా అంటున్నదా అని ఎప్పుడూ ఆలోచించలేదు. నేటి వరకు పూజ అనేది ఎట్లా చెయ్యాలో నాకు తెలియదు. అందరూ పూజ చేస్తూంటే ఆనందించటం తప్ప. ఈ విషయాలు ఈ రోజు రాస్తూంటే 1967లో జరిగిన చిన్న సన్నివేశం జ్ఞాపకం వస్తోంది. వాటిని గురించి రాసి మళ్ళీ వెనక్కి వస్తాను.

6

1967 లో అప్పుడు అమ్మ అందరింటి మూడవ అంతస్తులో వుంది. మధ్యాహ్నం 2 గంటలయింది. నేను ఒక్కణ్ణే అమ్మకు ఎడమ ప్రక్కగా పాదాల దగ్గర కూర్చున్నాను. అమ్మ నెమ్మదిగా నా వైపు చూస్తూ నా కుడిచేతిని తన చేతుల్లోకి తీసుకుంది. తన వేళ్ళకి వున్న ఒక్కొక్క ఉంగరం నా వేళ్ళకు తొడిగింది. ఏవీ నా వేళ్ళకు సరిపోనేలేదు.

మళ్ళీ అవే నా ఎడమచేతి వేళ్ళకి ప్రయత్నించింది. నా వేళ్ళకి ఏవీ సరిపోలేదు. నేను ఆసక్తిగా కూడా చూడటం లేదు. నాకు వేటిమీద ఆసక్తి లేదు. (నాడు – నేడు కూడా) అమ్మ పాదాలు నా దగ్గర వుంటే చాలు. నాకు యిది ఎందుకు ? (అనుకున్నాను మనస్సులో). అమ్మ ఆ వుంగరాలు తన వేళ్ళకి తొడుక్కుని నా వేళ్ళను చూసి, తర్వాత నా వేపు చూసి "నీకు యిది వద్దులే నాన్న" అంది నేను తలవంచుకుని అమ్మ పాదాలను ఆ పాదాలకు తొడిగిన బంగారపు ఉంగరంపై కన్పిస్తున్న భగవత్ స్వరూపాలను చూస్తూ, నా అరిచేతులు రెండూ అమ్మ పాదాలు ముందు (పాద పీఠంపైన వున్న వెల్‌వెట్ కుషన్ ప్రక్కగా) వుంచాను. అమ్మ తన రెండు పాదాలు నా రెండు అరిచేతుల్లో వుంచింది చాలా సేపు. ఆ తర్వాత నేనెప్పుడు వెళ్ళినా, అమ్మ పాదాల ముందు నా అరిచేతులు వుంచితే ఆ రెండు పాదాలు నా అరిచేతుల్లో వుంచేది చాలా సేపు. కానీ యీ సన్నివేశం ఎందుకు జరిగిందో నాడూ నేడు నా మనస్సు వివరణ కోరలేదు. అప్పటికి నా కుడిచేతికి ఒక పూర్తి బంగారపు చిన్న ఉంగరం వుంది. (ఈ ఉంగరం అతి విచిత్ర సన్నివేశాలలో కూడా నా నుంచి దూరమై, మళ్ళీ నా దగ్గరకే వచ్చింది) 1. నేను ఆఫీసులో కాగితాల చింపి వేస్ట్ పేపరు బుట్టలో వేస్తున్నాను. ఆ రోజు ఆఫీసు నుంచి సాయంత్రం, యింటికి వచ్చిన తర్వాత నా వేలికి ఉంగరం లేదు. చాలా సేపు ఆలోచించి మర్నాడు రోజు సెక్యూరిటీ ఆఫీసర్‌ను పిలిచి, క్రితం రోజు సాయంత్రం పారపోసిన చెత్త గుట్టలన్నీ వెతికించమన్నాను. నేను ఊహించినట్లుగానే ఉంగరం దొరికింది. 2. నేను ఆఫీసు క్యాంటీన్‌లో లంచ్ తీసుకుని చెయ్యి కడుక్కుని నా సీటుకి వచ్చి చూసుకుంటే, చేతికి ఉంగరం లేదు. చాలా సేపైంది అయినా మా స్టాఫ్‌ను పంపాను. వాళ్ళు వచ్చి "క్యాంటీన్ నేలంతా కడిగేశారు సార్" అన్నారు. నేను లేచి క్యాంటీనుకు వెళ్ళాను" డైనింగ్ హాల్ తలుపు తెరిచి, నేను లోపలికి వెళ్ళకుండా, దూరం నుంచే డైనింగ్ టేబుల్స్ కాళ్ళ దగ్గర జాగ్రత్తగా చూస్తున్నాను. ఒక డైనింగ్ టేబుల్ కింద కాళ్ళ దగ్గర ఉంగరం కన్పించింది. 3) నేను ఒకసారి కలకత్తా వెళ్తూ కోరమండల్ ట్రైన్‌లో రాజమండ్రి వచ్చిం తర్వాత బాత్‌రూమ్‌కి వెళ్ళి వచ్చాను. విశాఖపట్నం సమీపిస్తుంటే నా ఎదురు సీటులో కూర్చున్న వ్యక్తి "ఈ ఉంగరం మీదేనేమో చూడండి" అని ఆ ఉంగరం ఇచ్చారు. (నాకు అంతవరకు ఆ ఉంగరం వేలికి లేనట్లు ధ్యాసే లేదు) ఈ ఉంగరము యిన్ని సార్లు నాకు దూరమై మళ్ళీ నా దగ్గరకే ఎందుకు వచ్చింది ? ఏమోలే" అనుకున్నాను 'అమ్మ' విగ్రహ

ప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో ఎవరో నా ముందు వెండి పళ్ళెం తీసుకు వచ్చారు. ఏం చెయ్యాలో తోచక, మూడుసార్లు దూరమై నా దగ్గరకు చేరిన ఆ ఉంగరం ఆ పళ్ళెంలో వేశాను. కారణం తెలియదు. ఆలోచన లేదు. "నాకు యివన్నీ ఎందుకమ్మా" అన్న సన్నివేశం గుర్తుంది. ఈ రోజు నా చేతికి ఉంగరాలు లేవు.

1967 జనవరి వచ్చింది. నేను అక్కడ వున్న ప్రతీరోజు, ప్రతీ క్షణం ఎంతో ఆనందంగా గడిచిపోతోంది. కానీ నేను హైమతో మాట్లాడటం మానేసి సంవత్సరం దాటింది. ఆ విషయాలు ప్రస్తుతం రాయటం లేదు. ఈ విషయంలోనే నేను చాలా బాధపడ్తూంటే వాణ్ణి. ఈ విషయంలో తప్ప నేను హాయిగానే వుండేవాణ్ణి. జిల్లెళ్ళమూడి రవి కాలేజి చదువుల్లో వున్నాడు. అప్పుడప్పుడు వస్తూండేవాడు. ఆ సమయాల్లో యేదో నాటకాల రిహార్సల్స్, క్రికెట్ ఆటలు, అమ్మ ముందు ఒక్కొక్కసారి నాటకాలు వేస్తుండేవాళ్ళు. అమ్మ పాక యింట్లోనే వుండేది.

పోతుకూచి రవి విషయం రాయడం చాలా ముఖ్యం. అమ్మ యింటి ఎదురుగా కొద్ది దూరంగా (ప్రస్తుతం హైమాలయం బయట హాలు) ఒక మందిరం వుండేది. ఇది కూడా తాటి ఆకులతో కట్టిందే. ఇందులో కూడా ఆవరణలో మూడు, నాలుగు కుటుంబాలు వుండేవి. రవికి ఒంట్లో బావుండని కారణంవల్ల, అందర్నీ ఖాళీ చేయించి, రవిని అక్కడకు చేర్చి మంచంలో పడుకోబెట్టారు. తల దిక్కు దక్షిణంవైపు అమ్మ యింటి గుమ్మానికి యెదురుగా, యీ మందిరం గుమ్మం అంటే రవి మంచంలో పడుకుంటే అమ్మ లోపలి గుమ్మం కూడా చూడవచ్చు. రవి చిన్నప్పటి నుండి హార్ట్ ఎన్‌లార్జ్‌మెంటుతో బాధపడుతున్నాడు. చిన్నప్పుడు రవి పెద్ద అక్క జ్యోత్స్న అనేదిట "పెద్దయిం తర్వాత నేను మెడిసన్ చదివి నీకు ట్రీట్‌మెంట్ యిచ్చి నీ జబ్బు తగ్గిస్తాను" అని రవిని మందిరంలో చేర్చించిన టైమ్‌లో జ్యోత్స్న ఎం.బి.బి.యస్. పూర్తి చేసి పి.జి. ఫైనల్ యియర్ వుంది. పోతూకూచి ఈశ్వర చంద్రవిద్యాసాగర్ గారు, వారి శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ గారు, వారి పిల్లలు రమణ, రవి, సావిత్రి, ఝాన్సీ, హైమ, రాణి, ప్రసాద్‌లతో అమ్మ దగ్గరకు వచ్చి అందరూ ఆవరణంలో పనులు చేసుకుంటుండే వాళ్లు. అమ్మ రవితో (సుమారు 15 ఏళ్ళు వుంటాయేమో) "నాన్నా! నువ్వు పశువుల్ని చూసుకుంటూ ఇక్కడే వుండు" అన్నదిట. రవి ఒక రోజు అలాగే చేసి మర్నాడు రాత్రి అమ్మ పాక యింటి వరండాలో పడుకున్నాడు. తెల్లవారిం తర్వాత అమ్మ రవిని అడిగిందట "రాత్రి ఎక్కడ పడుకున్నా"వని ? ( ) మాట్లాడకుండా తలవంచుకొని

వెళ్ళిపోయాడు. ఆనాటి నుంచి రవి పశువుల కొష్ఠంలోనే వుండేవాడు. రాత్రింబవళ్ళు వాటి సంరక్షణే అతనికి ఎంతో ఆనందకరమైన సాధన. వాటికి స్నానం, మేత (పండుగలు వస్తే ప్రత్యేకంగా ఉలవలు తెప్పించి వేసేవాడు, మెళ్ళో మువ్వలు కట్టేవాడు) తనే స్వయంగా వేసేవాడు. ఆనందించేవాడు. ఆవరణలో తక్కువగా కన్పించేవాడు. గడ్డిమోపులు నెత్తిన పెట్టుకొని తెచ్చేవాడు. బరువు పనులు చాలా చేసేవాడు. ఎందుకంటే తన బరువు బాధ్యతలన్నీ అమ్మ తీసుకుంది అని తనకు తెలుసు. అమ్మను పరోక్షంలో "వాడు" అని సంబోధించేవాడు. తను చిట్టుడుకు నీళ్ళు (పల్చటి గంజి), కొబ్బరి ముక్కలు, కొబ్బరినీళ్ళు, అన్నంలో మజ్జిగ, ఆహారంగా తీసుకునేవాడు. ఇది అమ్మ చెప్పిందిట. మంచి రంగు వచ్చాడు. పొడుగు అయ్యాడు. కానీ ఊపిరితిత్తులంతగా గుండెలు, గుండెలు అంతగా ఊపిరితిత్తులు అయినాయి. 1967 జనవరిలో ఆరోగ్యం దెబ్బతింది. మంచంలో పడుకోపెట్టి, తలదిక్కున అయిదు పెద్ద దిండ్లు సపోర్టుగా పెట్టేరు. అతను గాలి పీలుస్తూంటే మంచం కదిలేది. ఒక రోజు అమ్మ నన్ను పిలిచి "నాన్నా రవి దగ్గర కూర్చుంటావా !' అని అడిగింది. "అలాగే నమ్మా" అని రవి మందిరంలోకి వెళ్ళాను. ఇరవై నాల్గు గంటలూ అతనికి సేవనా పరమార్థమైంది. 24 గంటలూ అతని తలదిక్కున అమర్చిన దిండ్లకు నేను సపోర్ట్‌గా వుండి విసనకర్రతో విసురుతుండేవాణ్ణి. మధ్య మధ్యలో సావిత్రి, ఝాన్సీ వాళ్ళు కూడా రవికి సేవ చేసేవాళ్ళు. (ఆ టైములో నేను స్నానానికి, భోజనానికి వెళ్ళే వాణ్ణి). ఆ రోజుల్లో రవి రకరకాల విషయాలు చెప్పేవాడు. అమ్మ రవిని, 'వీడొక్కడే అసలైన బ్రహ్మచారి వీడు ఎన్నడూ, ఉప్పు పులుపు రుచి యెరుగడు అనేది. రవి తన పశువుల సంరక్షణ ఎలా చేసింది చెప్పేవాడు. అమ్మను రవి 'వీడు - వాడు' అనేవాడు. పరోక్షంలో తనను తాను యెన్నడో అమ్మకు సమర్పించుకున్నాడు. తన శరీరాన్ని చూపిస్తూ 'ఇదంతా వాడి బాధ్యతే అనేవాడు. రవికి అమ్మ భగవంతుడే. ఒక రోజు మధ్యాహ్నం రవి నాతో మాట్లాడుతూ "రాధన్నయ్యా! అమ్మ యింట్లోకి ఎవరొచ్చారో చూడు అతను బాపట్ల వెడుతున్నానంటూ అమ్మచే బొట్టు పెట్టించుకోడానికి వచ్చాడు. నువ్వు తొందరగా వెళ్ళి అమ్మకు చెప్పి తర్వాత ఆ పళ్ళెంలో పూలు, దండ వున్నాయి. వాటి క్రింద యేమున్నాయో చూడు" అని అన్నాడు. నేను వెళ్ళి లోపల కూర్చున్న అమ్మతో ఫలానా వ్యక్తి బాపట్ల వెళ్ళడానికి అమ్మ దగ్గర బొట్టు పెట్టించుకోడానికి వచ్చాడని చెప్పాను. అమ్మ "అలాగే వస్తున్నాని చెప్పు" అంది ఇంతలో ఆ వ్యక్తి బయట వరండాలోకి

వెళ్ళి నుంచున్నాడు. నేను వెళ్ళి అమ్మ కొద్ది సేపట్లో వస్తున్నారని చెప్పాను. అతను ఆ వరండాలోనే కూర్చున్నాడు. నేను వెళ్ళి హాల్లో అమ్మ మంచం దగ్గర కూర్చుని, ఆ వ్యక్తి తెచ్చిన పండ్లు, పూల పళ్ళెం దగ్గరగా లాక్కుని (అర్చకుణ్ణి కదా) పువ్వులు, దం[illegible] సవరించాను. అడుగున కత్తి వుంది ఆశ్చర్యపోయాను. అమ్మకు చెప్దామని లోపలికి వెళ్ళి వరలక్ష్మిని "అమ్మ ఏది?" అని. "అమ్మ యిక్కడ లేదు, అందరింటిలో శేషగిరిరావుతో మాట్లాడుతుంది. వెళ్ళి రెండు గంటలయింది" అంది. "అదేమిటి నేను యిప్పుడే అమ్మతో మాట్లాడేను కదా" అన్నాను. "మాట్లాడి వుండవచ్చులే" అని నవ్వింది. నాకు అర్థం కాలేదు. అర్థం చేసుకొన్నాను. బయటికి వచ్చి "అమ్మ శేషగిరిరావు గారితో మాట్లాడుతుంది. అందరింట్లో" అన్నాను. "సరేలే అన్నయ్యా" అని ఆ వ్యక్తి తెచ్చిన పూలు, పళ్ళుతో సహ వెళ్ళిపోయాడు. తరువాత ఒకసారి అమ్మకు పాలతో అభిషేకాలు చేస్తుంటే ఆ [illegible]క్తి కుండా, [illegible]ళ్ళ నీళ్[illegible]ట్టుకుంటూ, పాలగిన్నెతో, క్యూలో నుంచున్నాడు. అతను [illegible]ళ్ళో వ్యక్తి. ఆ వూళ్ళోని పాతకక్షల్ని యింకా గుండెల్లో వుంచుకున్నాడనుకుంటాను అమ్మ కరణం కాకపోయినా కరణీకం చేసేదేమో ఆ రోజుల్లో. అయినా నేను ఫలానా వ్యక్తి బొట్టు పెట్టించుకోడానికి వచ్చాడని చెప్పినప్పుడు విన్న అమ్మ ఎవరు ? అని నేను రవి దగ్గరకు వచ్చి జరిగింది చెప్పేను. రవి "అంతా వాడి మాయ" అంటూ నవ్వేశాడు.

7

రవి ఆరోగ్యం ఫిబ్రవరిలో బాగా క్షీణించింది. డాక్టర్ జ్యోత్స్న వచ్చి చూచి వెళ్తోంది. 20వ తారీకుకు చాలా సీరియస్‌గా వుంది. జ్యోత్స్న వెళ్లి సీనియర్‌ను తీసుకు వచ్చి చూపించి ఆక్సిజన్ సిలిండర్స్ కనెక్షన్ యిచ్చారు. 27వ తారీకున ఉదయం నాతో, "రాధన్నయ్యా వాడికి నన్ను చూడాలనిపిస్తే యిప్పుడు చూడు ఎలాంటి అలంకారంతో వస్తాడో" అని అమ్మ అలంకారం అంతా వర్ణించాడు. ఆ రోజు రాత్రి వర్షూ ప్రసాద్ (వర్షూ శివరామయ్య గారి అబ్బాయి ప్రస్తుతం రిటైర్ అయి హైదరాబాద్‌లో వుంటున్నాడు. మొన్ననే షష్టిపూర్తి జరిపారు. అనసూయా వ్రతం చేసి) అరుణల వివాహం – ముహూర్తం దగ్గరవుతోంది. బ్యాండ్ మేళం వాయిస్తే రవి ప్రాణాలకి సమస్య, కాకపోతే వివాహ పద్ధతిలో వెలితి. నాకు వచ్చి చెప్పారు (అప్పుడు నేను యింకా అర్చకుడుగా వర్ధిలుతున్నాను). నేను అమ్మని అడిగి చెప్తానన్నాను. రాత్రి

గం. 7.30కి నేను రవి దగ్గర కూర్చున్నాను. లోపల రెండు హరికేను లైట్లు వున్నాయి. ఇంతలో అకస్మాత్తుగా అమ్మలోపలికి వచ్చింది. రవి కోరుకున్నట్లుగా "తెల్లపట్టుచీర, బంగారుపూల డిజైన్, పెద్ద ఎఙ్జరీ బోర్డర్, ఎఙ్జ జాకెట్, సర్వాలంకారాలతో మెరిసిపోతుంది. రవి ప్రక్కన వాళ్ళందర్నీ వెళ్ళిపొమ్మంది. నాకు సంజ్ఞ చేసింది. నన్ను కూడా వెళ్ళమంది. లోపల అమ్మ, రవి జ్యోత్న్న వున్నారు. నేను బయటకు వచ్చాను. ఇరవై నిమిషాల తర్వాత అమ్మ బయటకు వచ్చి వివాహ వేదికపైకి వచ్చింది. "బ్యాండ్ మేళం, వాడి చావు బ్రతుకులను నిర్ణయించదు. పెళ్ళి యధావిధిగా జరిపించండి" అంది. పెళ్ళి చాలా బాగా జరిగింది. ఆ రాత్రి రవి చెప్పాడు. అమ్మను జ్యోత్న్న అడిగింది 'అమ్మా రవి దగ్గర ఒకసారి పడుకుంటానమ్మా! అని అమ్మ రవి వేపు చూసింది. రవి "నేను యిప్పుడే పోతానంటావా, యిప్పుడే పడుకోమను, నాకు యింకా కాలం వుందంటావా, యిప్పుడు ఆ ప్రశ్న అనవసరం" అని అన్నాడు అమ్మతో. అమ్మ రవి మంచం మీద కాసేపు కూర్చుని తర్వాత వేదిక వైపు వెళ్ళిందిట. మర్నాడు 12.30 కు, రవి దగ్గర కూర్చున్న నన్ను అమ్మ పిలిచి అడిగింది "నాన్నా ! జోత్న్న భోజనం చేసిందా ? పెళ్ళి భోజనాలు పూర్తి అయ్యాయా" అని "లేదు భోజనాలు యిప్పుడే మొదలయ్యాయి". అమ్మా ఏంటి ? టైమ్ అయిందా ! (రవి అంతిమ ప్రయాణానికి అన్నట్లు చూశాను). "జ్యోత్న్నను తొందరగా తినమను నాన్నా" అని అమ్మ అంది. జ్యోత్న్నకు కబురు చేశాను. మధ్యాహ్నం రెండున్నరకు పెళ్ళి భోజనాలు పూర్తి అయ్యాయి. రవి మంచం మీద, అతి కష్టంగా గాలి పీలుస్తున్నాడు. మంచం కదుల్తోంది. నేను రవి తలదిక్కుగా దిండ్లు సపోర్టుగా పట్టుకున్నాను. జ్యోత్న్న మంచం పక్కన క్రింద కూర్చుని రవి వైపు చూస్తోంది. వున్నట్లుండి రవి ఒక్కసారిగా, గురకతో వెనక్కి విరుచుకున్నాడు. 'జ్యోత్నా నువ్వు రవిని పట్టుకో" అన్నాను. క్షణంలో జ్యోత్న్న రవి మంచంలో కూర్చుని రవిని రెండు చేతులతో పట్టుకుంది. నేను అమ్మ యింట్లోకి దూకి అమ్మ దగ్గరకు వెళ్ళాను. అమ్మ చెయ్యి పట్టుకుని లాగాను. "రవి - రవి" అంటూ. అమ్మ రవి మందిరం వేపు గబగబా నడుస్తూ "తులసి తీర్థం తీసుకురా" అని వెళ్ళిపోయింది. నేను, అమ్మా వెళ్ళేసరికి రవి ముందుకు, వెనక్కూ వూగుతూ గురకవేస్తున్నాడు. అమ్మ రవి గొంతుకలో తులసి తీర్థం పోస్తూ "నేను రవితో మాట్లాడాలి, మీరు బయటకు వెళ్ళండి" అంది. నన్ను, జ్యోత్న్నను బయటకు పంపింది. అయిదు నిమిషాల తర్వాత నేను లోపలికి వెళ్ళాను. అమ్మ నావేపు చూచి "నాన్నా! పంతులుగార్ని

పిలవండి. రవిని బయటకు తీసుకు వెళ్ళండి" అని తను యింట్లోకి వెళ్ళింది. పంతులు గారు, నేను, యింకా నలుగురు అస్తమించిన రవి శరీరాన్ని (ప్రస్తుతం నాగప్రతిష్ఠ చేసిన స్థలం యివతలగా) పాకవైపు తీసుకు వెళ్ళాం. ఆ సాయంత్రం అమ్మ బండిలో వచ్చి రవికి అగ్ని క్రియలు చేసింది. తర్వాత డ్రైన్ కాల్వవ వైపు అమ్మతో సహా అందరం వెళ్ళి స్నానాలు చేశాము. జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గర ఎవరైనా శరీరాన్ని వదిలితే, అమ్మలో ఐక్యమైనారన్న భావనో యేమో ఎవ్వరికీ దుఃఖం రాదు. డ్రైన్ కాల్వవైపు పిక్‌నిక్‌లా వెళ్ళివస్తాం. ఆనాడు కూడా అలాగే జరిగింది. అందరం అమ్మ ఒళ్ళో పిల్లలమే కదా ! మర్నాడు రోజు రవికి కర్మకాండలు ఎవరు చెయ్యాలి, అడి అడిగారు అమ్మని. 'రాధ చేస్తాడు, భద్రాద్రి రామశాస్త్రిగార్ని కూడా అడగండి వెళ్ళి అన్నట్లు' నాకు లీలామాత్రంగా గుర్తు. భద్రాద్రి రామశాస్త్రిగారు నా చేత ఊళ్లో చెఱువు గట్టు మీద రవికి కర్మతంతు పూర్తి చేయించారు. ఇందుకోసమే యింత క్రితం వివరించినట్లు అంత అర్జంటుగా, స్నానాల గదిలో నాకు ఒడుగు చేసింది ! అమ్మే కదా అన్నిటికీ 'కర్త' మరి రవి అదృష్టం ?

ఒక రోజు అమ్మ పాక యింటి హాల్లో అమ్మ పాదాల దగ్గర కూర్చుని పూజలు జరిపిస్తున్నాను. మొత్తం 15-20 మంది వుంటారు. అమ్మ తీర్థ ప్రసాదాలు యిస్తోంది. ఇంతలో వెనుకనుంచి, ఒక ముసలి ఆవిడ (అడుక్కునే మనిషిలా వుంది) అమ్మ ముందుకు త్రోసుకు వస్తోంది. నేను విసుగుతో బయటకు వెళ్ళమన్నాను. అమ్మ పాదాల దగ్గర కూర్చున్నా, అర్చక స్థానంలో వున్నా నా స్వభావం నా తత్వం నాదేగా! చాలా మంది వెళ్ళింతర్వాత, అమ్మ నావేపు చూసి, ఆ ముసలమ్మను పిలువమంది. అయిష్టంగానే "ఏయ్ ! ఇక్కడకురా" అని పిలిచాను. ఆమె వచ్చి అమ్మ ముందు కూర్చుంది. అమ్మ ఆమెకు తీర్థం వేసి, ప్రక్కనే వున్న పళ్ళు యిచ్చి బొట్టు పెట్టింది. అమ్మ ఆమెతో నవ్వుతూ !", నాకేమి తెచ్చావు ? ఆమె 'నేనా ! నీకేం దెచ్చేది ? నువ్వు అమ్మవు కదా! నువ్వే నాకిచ్చావు. ముసిల్దాన్ని నాకాడ యేం వుంటుంది'.

అమ్మ : (గట్టిగా నవ్వుతూ) నీ వెనకాల మూటలో యేం వుంది ?

ఆమె : అదా !అది నీగ్గాదులే ! నీకు దణ్ణం బెడతా అంతే, అంతకంటే ఏం జేసేది?

అమ్మ : చిరునవ్వుతో (మధురం హసితం) అది నాకివ్వు !

ఆమె : అమ్మోవ్ అది నీగ్గాదని జెప్పేగా: మా తల్లిగాదు, నేను వూరకే నీ పాదాలకి దణ్ణం బెడదామని బాపట్ల నుంచి వచ్చా.

నేను : ఇవ్వమంటే యివ్వరాదూ, వూరికే సణుగుతావెందుకు

అమ్మ : (నాభుజం మీద చెయ్యివేసి) కుడి చెయ్యి ఆమె వేపు జాపుతూ, (బ్రతిమాలాడే ధోరణిలో) ఇయ్యమ్మా !

ఆమె : అమ్మోవ్, నువ్ యిట్టా అడిగితే నేనేం జేసేది ? అయిదురోజులాయె, నీ కాడికి వద్దామంటే డబ్బులు లేవు; అందుకనీ యియ్యాళ నడిసొచ్చినా, నన్ను యిరకాటంలో బెడితివే ! అంటూ వెనుక మూటలోంచి బొప్పాయి కాయ తీసి, బాధపడుతూ, అమ్మ చేతికి యిచ్చింది.

నేను : 'నాకు యివ్వు ప్రక్కన పెడతాను" అన్నట్లు చెయ్యి జాపేను అమ్మ వేపు.

అమ్మ : (పసిపిల్లలాగా) నేనివ్వను అన్నట్లుగా కుడి ప్రక్కన దాచుకుంది. పండు బాగా పాడైపోయింది.

నేను : ఏంటమ్మా యిటివ్వు, అని గట్టిగా అడిగాను.

అమ్మ : మారాం చేస్తున్నట్లు అడ్డంగా తలతిప్పి; పాడైపోయిన పండుతినడం మొదలెట్టింది.

ఆమె : అమ్మోవ్ యింక చాల్లేమ్మా ! పూర్తిగా పాడైందమ్మా పండు. ఇంకేం దింటావు పాడైనపండు ! పక్కన యాపిల్‌పళ్ళున్నాయ్, అయి దినరాదు ? నేం దీసకరాక బోయినా బావుణ్ణు. ఏం జేసేది (కన్నీళ్ళు పెడ్తోంది).

అమ్మ : లొట్టల వేసుకుంటూ మమ్మలందర్నీ చూస్తూ మొత్తం పండంతా తొక్కతో సహా తింది. నేను విసుక్కున్నాను "ఏంటమ్మా యిదంతా" అని. అమ్మ నవ్వింది. అక్కడే వున్న గిన్నెలో చెయ్యి కడుక్కుంది. నేను గ్లాసులో నీళ్ళు పోస్తూంటే.

అక్కడ వున్న వాళ్ళందరూ అమ్మ వాత్సల్యం చూసి 'యీ ముసలమ్మ ఎంత అదృష్టవంతురాలో" అని అనుకున్నారు. అమ్మ, ముసలమ్మను దగ్గరకు తీసుకొని వొళ్ళంతా నిమిరింది. "సాయంత్రం వరకు వుండి బస్సులో వెళ్ళమ్మా, అబ్బాయి (నేను) డబ్బులిస్తాడు. భోజనం చేసి వెళ్ళు" అంది నావేపు చూస్తూ, "నాన్నా, తీసికెళ్ళి భోజనం పెట్టించు" అంది. "ఆహా, అలాగే అనుకుంటూ (మనస్సులో వి.ఐ.పి.,

వి.వి.ఐ.పి.అనుకున్నాను) నేను ఆమెకు అన్నం వడ్డించేంతవరకు వుండి "అన్నం తిన్న తర్వాత ఇక్కణ్ణే సాయంత్రం వరకు కూర్చుని అమ్మ దగ్గరకురా!" అన్నాను. ఆమె అన్నం తింటూ 'అట్లాగే' అన్నట్లు తల వూపుంది. నేను అమ్మలోపలి గదిలోకి వెళ్ళి 'మీ అమ్మాయికి (ముసలమ్మకు) భోజనానికి ఏర్పాటు చేశానమ్మా' అన్నాను నవ్వుతూ. 'నా చిన్నప్పటి నుంచి నేను తనను చూస్తున్నాను; నన్ను తను చూస్తోందిరా' అంది. ఎంతో ఆర్తిగా'. నాకు చాలా బాధవేసింది. ఆ సాయంత్రం ఆ ముసలమ్మకు డబ్బులు యిచ్చి పంపించాను.

8

ఇట్లాగే ఒకసారి అమ్మ అన్నపూర్ణాలయం ముందు వరండాలో కూర్చుంది. అమ్మ దర్శనానికి వచ్చిన వాళ్ళు 30 వరకు వుంటారు. అందులో కుష్టువాళ్ళు ఎనిమిది మంది దాకా వుంటారు. వాళ్ళు అమ్మ పాదాలకి నమస్కారం చేసుకుందామనుకుంటే నేను దూరంగా వుండి నమస్కారం చేసుకోమన్నాను. వాళ్ళు అలాగే చేస్తున్నారు. అమ్మ "ఫర్వాలేదు నాన్నా ! పాదాలు ముట్టుకోవచ్చు" అంది వాళ్ళతో. వాళ్ళు ఎంతో ఆనందంగా తృప్తితో అమ్మ పాదాలు స్పృశించి ధన్యజీవులయ్యారు. తర్వాత వాళ్ళందరికీ భోజనాలు పెట్టించి పంపేను. ఇలాంటి సమయాల్లో అమ్మను చూస్తే నాకు కోపం వస్తుంది. ఎందుకంటే నేను అల్పమానవుణ్ణి కదా! అందుకే అమ్మ నన్ను చాలా ప్రేమగా చూసేది.

కాలం గడిచిపోతుంది. అందరిల్లు పూర్తిగా తయారయింది. క్రింద పది ఫ్యామిలీ పోర్షన్స్, పైన 20 రూములు, అన్నింటికి రంగులు వెయ్యడం పూర్తయింది. అమ్మ అందరింటి మూడవ అంతస్థులోకి మారింది. రామకృష్ణన్నయ్య పనులన్నీ పూర్తి చేసుకుని, జిల్లెళ్ళమూడిలోనే వుంటున్నాడు. నేను అర్చకత్వం చేయడం లేదు. కానీ వీలైనంత వరకు అమ్మ దగ్గర వుంటున్నాను. లైబ్రరీ పని, "మాతృశ్రీ" సంచిక డిస్పాచ్ వర్క్, చందాల వివరాలు, పొట్లూరి సుబ్బారావు గారు తెచ్చే ఫోటోల అమ్మకం. మిగిలిన ఆవరణ పనులు చూస్తూండేవాణ్ణి. గోపాలన్నయ్య పబ్లికేషన్స్ వర్కులో చాలా బిజీగా వుండేవాడు. అమ్మ దర్శనానికి వచ్చే వాళ్ళ సంఖ్య చాలా పెరిగింది. రోజూ వందలు, వేలల్లో వచ్చేవారు. టూరిస్ట్ బస్సులు వచ్చేవి. నాకు రోజులు సరిగ్గా గుర్తు లేవు. "అమ్మ - వసుంధరల కళ్యాణం జరిగింది" అమ్మ శ్రీ కృష్ణ స్వరూపంలో

వేదికను అలంకరించింది. ఈ వివాహానికి చాలా మంది వచ్చారు. ఆ రోజు భోజనాలలో వెయ్యి మందికి పైగా వచ్చారు. శేషయ్య గారి వంట, పి.ఎస్.ఆర్ ఆంజనేయులు గారి కవితలు, సాహిత్య హాస్య ప్రసంగం అందరికీ ఎంతో ఆనందాన్నిచ్చింది. వసుంధర వివాహంలో అమ్మ అష్టలక్ష్ములను వివాహం చేసుకుంటుదేమోనన్న చిరు ఆశ. అలా జరక్కపోవడంతో కొంతమంది సోదరీమణులకు నిరాశ పరచింది. వారెవరు అన్నది అప్రస్తుతం. జరగలేదు కదా ! ఆ వివాహంలో "అమ్మ వసుంధర"లకు ఫోటోలు నేనే తీసేను. అమ్మను "పురుషోత్తమ" స్వరూపంలో చూడడం అమ్మ ఈ జన్మలో నాకు యిచ్చిన అదృష్టం.

1967లోనే ఒక రోజు ఉదయం 11 గంటలకు అమ్మ, వసుంధర కిచెన్‌లోకి వెళ్ళింది. అక్కడ ఒక చిన్న కిటికీ వుంది. అమ్మ ఆ కిటికీలోంచి దూరంగా, చూస్తోంది. అక్కడే వసుంధర ఏదో పని చేసుకుంటోంది. నేను నెమ్మదిగా అమ్మ వెనుక వెళ్ళాను. అమ్మ ఎటు చూస్తోందో గమనించాను. అమ్మ 7వ మైలు వంతెన వైపు చూస్తూ, నోటితో విజిల్ వేస్తోంది. "ఏంటమ్మా సంగతి" అన్నాను. "నాన్నా, ఎదురుగా, ఎడమగా, కుడిగా, కనిపిస్తున్నంత దూరం చూడు. ఆ కనపడే పొలాల నిండా జనం కూర్చుని భోజనాలు చెయ్యాలిరా ! నేను అమ్మ వేపు చూస్తూ "పదవమ్మా తల్లీ, పద లోపలికి" అన్నాను నవ్వుతూ. అమ్మ కూడా, నవ్వుతూ, నా చెయ్యి పట్టుకుని లోపలికి తీసికెళ్ళి మంచం మీద కూర్చుంది. నేను అమ్మ పాదాల దగ్గర కూర్చున్నాను. అమ్మ నా చెయ్యి తన రెండు చేతుల్లోకి తీసికొని చిరునవ్వుతూ "నాన్నా మనం చూసిన పొలాల నిండా జనం సూర్యోదయం నుంచి, సూర్యాస్తమయం వరకు భోజనం చెయ్యాలంటే, ఎన్ని కూరలు, వసతులు, వడ్డించే వాళ్ళు కావాలో ఎంత బియ్యం కావాలి ?" అంది. "వడ్డించే వాళ్ళు వేల సంఖ్యలో కావాలి. మిగిలినవి చెప్పడం నా తరంకాదు తల్లీ. ఇది నా ఊహకి అందని ప్రశ్న" అన్నాను. తర్వాత అమ్మ నిశ్శబ్దంగా కూర్చుంది. రాబోయే స్వర్ణోత్సవానికి అది నాంది ప్రస్తావన అని అప్పట్లో నా ఊహకు అందలేదు. తర్వాత, స్వర్ణోత్సవానికి నేను జిల్లెళ్ళమూడిలో లేను.

ఒక్కసారి 1966 కు పూర్వం (1961-65) రోజుల్లో, (రోజు సంవత్సరం సరిగా గుర్తులేదు) అమ్మ పాకయింటి హాల్లో మంచం మీద కూర్చుంది. అమ్మను దర్శించడానికి వచ్చిన వాళ్ళలో ఒకాయన మద్రాసు నుండి వచ్చాడు. తెలుగురాదు. ఆయనకు

యేదో సమస్యలు వున్నాయి. హాల్లో అమ్మ మంచానికి దూరంగా కూర్చున్నాడు. (ఆయన పేరు ఆ రోజుల్లో వ్రాసిన డైరీలో వుంటుంది).ఆయన అమ్మతో తమిళంలో మాట్లాడుతున్నాడు. అమ్మ అతనికి తెలుగులో సమాధానం చెప్తోంది. ఇలా కొంత సేపు అయిన తర్వాత, ఆయన అమ్మకు నమస్కారం చేసి, అమ్మ యిచ్చిన ప్రసాదంతీసుకుని హాల్లోంచి బయటకు వెళ్ళాడు. నేను వెంబడించి, ఆయనను "మీకు తెలుగ ఎలా అర్థమయింది ? అమ్మ తెలుగులో మాట్లాడుతూంటే మీరు తమిళంలో ఎందుకు మాట్లాడేరు" అని ఇంగ్లీషులో అడిగాను. ఆయన, "అమ్మ నాతో తమిళంలో మాట్లాడింది. తెలుగులో కాదు" అని నా వేపు ఆశ్చర్యంగా చూసి వెళ్ళిపోయాడు !!!

1962లో అమ్మ చీరాల వెళ్ళినప్పుడు కొంతకాలం ఓడరేవు దగ్గర బంగాళాలో బస చేసింది. అప్పుడు నేను కూడా అమ్మతోనే వున్నాను. ఒక రోజు ఉదయం, అమ్మ జీపు డ్రైవ్ చేసింది. కాస్సేపు తర్వాత ఆ జీపు అక్కడ నీళ్ళలో యిరుక్కుపోయింది. ఇసుకలోంచి లాగడానికి అమ్మ చుట్టూ వున్న గుంపుల అంతా విశ్వ ప్రయత్నం చేసినా ఇంకా లోతుకు పోతోంది. అమ్మ "మీరెంత ప్రయత్నం చేసినా కుదరదు, అక్కడ వున్న బెస్తవాళ్ళు నలుగురు చాలు, వాళ్ళను పిలవండి" అంది. ఏం చేసేది లేక, బెస్తవాళ్ళను పిలిచారు. వాళ్ళు ఆరుగురు వచ్చారు. వాళ్ళు 5 నిమిషాల్లో జీపును ఎక్కువ శ్రమ లేకుండా బయటకు తీశారు. మేము, 20 మంది చెయ్యలేంది వాళ్ళు ఆరుగురు చేశారు. అందరికీ చాలా ఆశ్చర్యం వేసింది.

ఒకసారి అమ్మ సముద్రపు వొడ్డున కుర్చీలో కూర్చుంది. సముద్రం వేపు చూస్తూ అమ్మను చూస్తూ ముప్పై మంది యిసుకలో కూర్చున్నారు. నేను వచ్చి అమ్మ పాదాలపై పువ్వులు వేసి, నమస్కారం చేసి లేస్తోంటే ఆ సముద్రపు హోరులో, అమ్మకు కొంచెం దూరంలో కూర్చున్న వ్యక్తి అమ్మతో సంభాషణ చేస్తున్నాడు. అమ్మ అతని వేపు చూసి తలవూపుతోంది. అతను మాట్లాడుతున్నది అమ్మ దగ్గర వున్న నాకు వినిపిస్తోంది. కానీ అమ్మ శబ్దం వినిపించటం లేదు. అమ్మ నోటి దగ్గర చెవి పెట్టాను. ఏ ధ్వని లేదు. కానీ అతను అమ్మ అతన్ని అడిగినట్లు అవును. కాదు అంటునే వున్నాడు.అమ్మ దగ్గర్నుంచి ధ్వని తరంగాలు అతని కోసమే అతని వరకు మాత్రమే చేరుకున్నాయి. ఎందుకంటే, అమ్మ సంభాషణ పద్ధతి 15 నమిషాలు గమనించాను కాబట్టి.

మళ్ళీ ముందుకు వస్తే 1967 ఏప్రిల్‌లో : ఆ రోజుల్లో రాత్రిళ్ళు నేను అమ్మ మంచం ప్రక్కనే వీలైనంత వరకు రాత్రంతా కూర్చునే వాణ్ణి. నిద్ర వస్తే మంచం

ప్రక్కగా క్రింద నిద్రపోయేవాణ్ణి. ఒక రోజు రాత్రి 11 గంటలు. అప్పుడు అంతా ఖాళీ ప్రదేశం (ప్రస్తుతం ధ్యానమందిరం ఉన్న చోటు). అమ్మ చుట్టూ వున్న జనం నెమ్మదిగా అందరూ వెళ్ళిపోయారు. నేను మంచం ప్రక్కన కూర్చున్నాను. (మామూలుగా తెల్లవార్లూ కూర్చుంటాను. ఒక వేళ క్రిందపడుకుంటే 'అమ్మ గాజులు ఏ మాత్రం శబ్దమయినా, నాకు క్షణంలో మెళుకువ వచ్చి కూర్చుంటాను) ఆ రోజు పౌర్ణమికి ముందు రోజు. రాత్రి నడిరఘాము దాటింది. అమ్మ చేతులు గడ్డం క్రింద పెట్టుకుని నిద్రలో వుంది. నేను అమ్మను చూస్తున్నాను. వెంటనే అమ్మ గాజులపై దృష్టి పడింది. ఆ వెంటనే చంద్రుణ్ణి చూశాను. ఆలోచన ప్రారంభం అయింది. అంతా నిశబ్దంగా వుంది. అమ్మ, నేను తప్ప ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేరు. అమ్మ అమ్మ గాజులు (బంగారపువి) చంద్రుడు, ఎవరి కాంతి ఎక్కువ ? (అని అనుకున్నాను మనస్సులో) మనస్సులో అమ్మకి చెప్పాను నా ఆలోచనలు. క్రమంగా అమ్మ కాంతిలేత చేమంతిలోకి మారింది. క్రమంగా నేను ఎన్నడూ చూడని విధంగా అమ్మ దేదీప్యమానంగా వెలిగిపోతోంది. చంద్రుడు చిన్నబోయాడు. బంగారు గాజులకు వన్నె పోయింది. అమ్మ ముఖమండలం కాంతివంతమై పోతుంది. నాకేనా యీ అదృష్టం. నేను అమ్మను కళ్ళార్పకుండా చూస్తూ ఆనందపడిపోతున్నాను. ఆనందాన్ని పట్టలేక "ఓ బంగారు పిచ్చుకమ్మా ? అన్నాను గట్టిగా. అమ్మ కళ్ళు తెరచి నన్ను చూసింది. "ఏం నాన్నా!" అంది. నేను నా ఆలోచన నేను చూసింది అమ్మకు చెప్పాను "పడుకో నాన్నా" అని నాకు చెప్పి తను నిద్రపోయింది. కానీ అమ్మ మళ్ళీ మామూలుగానే వుంది. ఈ మార్పు ఎప్పుడు ఎలా వచ్చిందో నేను గమనించలేదు. ఏదైనా అదృష్టం నాది ! ఇలాగ కొన్ని కొన్ని సార్లు క్షణమాత్రంలో విచిత్రమైన స్వరూపాలలలో కన్పించినట్లు నాకు అనిపించేది. మరుక్షణం "కాదులే నేను పొరబడ్డానేమో"అనిపించి స్వప్నంలాగా మరచి పోతూండేవాణ్ణి. ఇది నా దురదృష్టం. బహుశా ఏమీ జరగలేదేమో ! ఎన్ని జరిగినా అమ్మ దైవత్వం గూర్చి ఆలోచన లేదు. నాలో ఏమీ మార్పు లేదు. సగటు మనిషిని కూడా కాదు. అమ్మను అమ్మగానే చూశాను. అమ్మ కూడా నన్ను అలాగే దగ్గరకు తీసుకుంది. నాకు అప్పటి నుంచే ఇక నేను హైదరాబాద్ వెళ్ళిపోవాలనే ఆలోచన మొదలయింది. అమ్మ జన్మదినోత్సవాలు జరిగిన తర్వాత అమ్మకు చెబుతామనుకున్నాను అలాగే అమ్మ పుట్టినరోజు అయిన వారం రోజులకి ఎవ్వరూ లేకుండా చూసి, (అందరిల్లు మూడవ

అంతస్తు గదిలో) అమ్మ పాదాలు దగ్గర కూర్చున్నాను. మంచం పట్టెమీద తలపెట్టి క్రింది వైపు అమ్మ పాదాలు చూస్తూ నెమ్మదిగా "అమ్మ" అన్నాను.

అమ్మ పలుకలేదు.

"అమ్మా" రెండు నిమిషాల తర్వాత తలెత్తి అమ్మ వైపు చూస్తూ మళ్ళీ పలిచాను.

అమ్మ చూసింది నా వైపు "ఏంటీ ?" అన్నట్లు.

నేను "నాకు ఎందుకో యింకా హైదరాబాద్ వెళ్ళాలని అనిపిస్తోందమ్మా".

అమ్మ నాలోంచి శూన్యంలోకి చూస్తోంది. నాకు అనిపించింది. అమ్మతో చెప్పడానికి యి సమయం కాదని మాట్లాడకుండా కూర్చున్నాను. రెండు నిమిషాల తర్వాత "ఏమన్నావ్ ? అంది. నేను మళ్లీ చెప్పాను. ఏమీ మాట్లాడలేదు. మామూలుగా నా వేపు చూసింది "అన్నం తిన్నావా. నాన్నా ?" "లేదమ్మా" అన్నాను.

"అన్నం తినిరా నాన్నా" ఇంక నా ప్రశ్న అప్రస్తుతం అనుకొని "అమ్మ"ను ఒంటరిగా వదలలేక, అట్లాగే కూర్చున్నాను. ఎందుకంటే, అమ్మ నావీపు నిమురుతున్న చెయ్యి తియ్యలేదు. ఇంతలో రామకృష్ణ అన్నయ్య అప్పుడే లోపలికి వచ్చాడు. నేను నెమ్మదిగా బయటకు నడిచాను. వారంరోజుల తర్వాత మళ్ళీ అమ్మ ఒంటరిగా వున్న సయమం చూసి చెప్పాను. ఈ లోగా నేను వెళ్తున్నాను అని వీలైనంత పబ్లిసిటి యిచ్చాను. మహిళా మండలికి కూడా చేరవేశాను. (వసుంధర - కృష్ణవేణమ్మ గారు, రుక్మిణమ్మగారూ, వీళ్ళంతా అమ్మకు స్నానం చేయిస్తుండేవాళ్ళు. ఆ సమయంలో కూడా నేను వెళ్ళిపోతున్న నన్న వార్త అమ్మకు చేరింది). ఒకసారి పిలిచి అందరిలోనూ అడిగింది "నాన్నా హైదరాబాద్ వెళ్ళిపోదామనుకుంటున్నావా?" అని నాకు కోపం, నవ్వు, యేడుపు చికాకు, అన్నీ ఒక్కసారిగా వచ్చాయి. 'ఇదేంటమ్మా, నేను యింతకు ముందు నీకు రెండుసార్లు చెప్పాను కదా! మళ్ళీ ఎందుకు అడుగుతున్నావు ?' అమ్మ చాలా సేపు నవ్వి నన్ను దగ్గరకు తీసుకొని "నువ్వు వెళ్తావన్నమాట నాకు వినిపించదు నాన్నా !" అంటూ "నువు లేకపోతే ఎట్లారా ? ఈ ఆవరణం అంతా ఏమవుతుంది? ఈ పొలాలన్నీ యెవరు చూస్తుంటారు. నువ్వు తెచ్చిన క్రమశిక్షణ అంతా ఏమవుతుంది? అసలు నువ్వు వెళ్ళగలవా నాన్నా ?" అక్కడ కూర్చున్న వారితో "నా దగ్గర వుందామని వీడు హైదరాబాదులో వుద్యోగం వదలి వచ్చాడమ్మా. వచ్చి రెండు సంవత్సరాలు దాటింది. ఇప్పుడు వెళ్ళాలనిపిస్తోందిట మా అబ్బాయికి" అని చెప్తోంది. (వీడెక్కడికి

వెళ్తాడు అన్నట్లు). అమ్మ నవ్వుతోంది ఎంతో వాత్సల్యంగా. అక్కడవున్న వాళ్ళు కూడా, నెమ్మదిగా నవ్వుతూ చూస్తున్నారు. నేను తలవంచుకు కూర్చున్నాను మాట్లాడకుండా. అమ్మ నా జుట్టు పట్టుకుని నెమ్మదిగా తలెత్తి "అన్నం తిన్నావా నాన్నా ?" అంది. "లేదమ్మా నే వెళ్ళి భోజనం చేసి వస్తాను' అని లేచిపోయాను. అమ్మ మరుసటి రోజు పిలిచి "నాన్నా మధు (అడవుదీవి - కరణం, మధుసూదనరావు గారు) వివాహం నిశ్చయమైందిట" అంది 'చాలా సంతోషమైనవార్త, మరి నా ప్రయాణ ముహూర్తం?' అన్నాను. "మధు పెళ్ళికి వుండవా ?" అంది "పెళ్ళి చూసేవెళ్తానమ్మా" అన్నాను.

నాకు సరిగ్గా గుర్తు లేదు. మధు పెళ్ళి తారీఖు. అయితే వేసవికాలంలో మాత్రమే, మధు పెళ్ళి అమ్మ దగ్గర చాలా వైభవంగా జరిగింది. నేను నా ప్రయాణం సంగతి అమ్మని ఎప్పుడు అడగాలా అని ఎదురుచూస్తున్నాను. పెళ్ళయిన రెండో రోజున అమ్మ పిలిచి, నా వేపు చూస్తూ "కోనా సత్యం ఉపనయనం చేసుకుంటాడట" అంది నేను నుంచుని అమ్మ వైపు చూస్తూ నవ్వుతూ అలాగే అన్నాను (అర్థమయింది అన్నట్లు) తర్వాత వారం రోజుల్లో కోనా సత్యం ఉపనయం పూర్తి అయింది. నా ప్రయాణం గురించి అమ్మతో ప్రసావ్తన చేయలేదు.

నాలుగు రోజుల తర్వాత ఒక రోజు వెన్నెల రాత్రి అమ్మ మంచం క్రింద చాపవేసుకుని పడుకున్నాను. రాత్రి రెండు గంటలయింది. అమ్మ లేచి కూర్చుంది. వెంటనే నేను లేచి కూర్చున్నాను. కాస్సేపు మాట్లాడకుండా కూర్చుంది. తర్వాత "కాసేపు నడుస్తా నాన్నా ?' అంది వెంటనే క్రింది స్లిప్పర్స్ అమ్మ పాదాలకు అందించాను. నేను నుంచున్నాను అమ్మ నా చెయ్యి పట్టుకుంది.

నెమ్మదిగా మూడో అంతస్థు ఖాళీ ప్రదేశమంతా నడుస్తోంది.

అమ్మ : నెమ్మదిగా నాన్నా ! నీకు వెళ్ళాలని వుందా !

నేను : అవునమ్మ.

అమ్మ : ఎందుకని ?

నేను : తెలియదు.

అమ్మ : ఎప్పుడు వెళ్దామనుకుంటున్నావు ?

నేను : రేపుగానీ, ఎల్లుండి గానీ

అమ్మ : అట్లాగే నాన్నా. (నెమ్మదిగా నడుస్తున్నాం అమ్మ కుడిచేత్తో నా యెడమ చేతిని పట్టుకుని నడుస్తోంది) నన్ను వదలి నువ్వు ఉండగలవా నాన్నా ?"

నేను : నేను మనిషినమ్మా, నేను నిన్ను వదలి ఉండగలను. నువ్వు తల్లివి కదా? అందుకని నన్నే కాదు నువ్వు ఎవర్నీ వదలి ఉండలేవు. అంతేకాదు నా చేతిని నువ్వు పట్టుకున్నావు కదా అలాగే పట్టుకుని వుంచు తల్లీ !

అమ్మ : (అయిదు నిమిషాల నిశ్శబ్దం తర్వాత) నాన్నా ! నువ్వు ఎక్కడున్నా, నేను నీ ప్రక్కనే వుంటాను అనుకొని హాయిగా వుండు. నీకు వీలైనన్ని సార్లు వస్తూ వుండు.

నేను : అలాగే నమ్మా. అయితే ఎల్లుండి ప్రయాణమవమంటారా ?

అమ్మ : నీ యిష్టం.

అమ్మ మేడ చివరి వైపు వచ్చి చేతిలో (వెన్నెలలోనే) పొలాలవైపు చూపిస్తూ భవిష్యత్‌లో ఏ ప్రదేశం ఏ భవనాల వస్తాయో వివరించింది అన్నీ విన్నాను. నెమ్మదిగా వచ్చి మంచంపై కూర్చుంది. నేను మంచానికి ఆనుకొని అమ్మను చూస్తూ కూర్చున్నాను. నిద్రపట్టింది. తర్వాత రెండోరోజు బట్టలు సర్దుకుంటున్నాను (పగలు 12.30) అమ్మ నుంచి పిలుపు వచ్చింది. లోపలికి వెళ్తూంటే వసుంధర చెప్పింది. "జాగ్రత్త, అమ్మకు గుండెల్లో నొప్పిగా వుందని" నేను లోపలికి వెళ్లాను. అమ్మ ఒంటరిగా మంచంలో బాధపడుతూ కళ్ళు మూసుకుంది. "అమ్మా !" అన్నాను కూర్చుని. మళ్ళీ పిలిచాను. అమ్మ నెమ్మదిగా బాధతో కళ్ళు తెరిచింది. "అమ్మా, నాకు నీ మీద చాలా కోపంగా వుందమ్మా ! నా ప్రయాణం ఆపడానికి యింత బాధ తెచ్చు కోవాలా అమ్మా ! నువ్వు ఆగమంటే నేను ఆగనూ ! నువ్వు నవ్వుతూ హాయిగా పంపిస్తే నాకు ఎంత ఆనందంగా వుంటుంది. లే అమ్మా అందరూ డల్ అయిపోయారమ్మా ? నువు ఎప్పుడు వెళ్ళమంటే అప్పుడే వెళ్తానమ్మా ! నా బంగారు తల్లివి కనుక వెంటనే లేవాలిటా" అన్నాను. అమ్మ (దగ్గుతూ) నాన్నా నా కోసం రెండు రోజులు ఆగు అన్నది". తప్పకుండా వుంటానమ్మా నువ్వు నవ్వుతూ బొట్టు పెట్టి సాగనంపినప్పుడే నేను ఆనందంగా వెళ్ళగలుగుతాను, ఇంక నువ్వు లేచి కూర్చో తల్లీ, ఆవరణం అంతా కళకళలాడుతుంది" అన్నాను. ఇంతలో అమ్మ ఎప్పుడు చెప్పిందో వసుంధర రెండు గ్లాసుల్లో కాఫీ తెచ్చింది. ఇద్దరం కాఫీ తాగుతుండగా, గదిలోకి రామకృష్ణ అన్నయ్య వచ్చారు. మిగలిన వాళ్ళు కూడా అమ్మ కోసం గదిలోకి వచ్చి కూర్చున్నారు. క్షణం క్రితం అమ్మ బాధ పడింది అంటే నమ్మలేరు. అమ్మ నవ్వింది. ఆవరణం నవ్వింది.

నేను జిల్లెళ్ళమూడి వదలి వెళ్ళే రోజు వచ్చింది. నాకు అసలు గుర్తులేదు. అమ్మ ఆ రోజు నాతోబాటు క్రింద కూర్చొని అన్నం తినిపించింది. ఏవో కబుర్లు చెప్పింది. అమ్మ నాలో వుందా లేక నేను అమ్మలో వున్నానా అనిపించింది. చేయి కడిగింది. చీర కొంగుతో మూతి తుడచింది. ఆ రోజు ఒక్కణ్ణి, అమ్మ దగ్గర నిశ్శబ్దంలో రెండ గంటలకు పైగా, వున్నాను. కృష్ణవేణమ్మ అక్కయ్య వచ్చి అమ్మతో, "ఏంటమ్మా యింత గారం చేస్తున్నావు" అంది. "వీడు అడ్డాలలో పిల్లవాడమ్మా " అంది అమ్మ. ఆవరణాన్ని, అమ్మని వదిలి వెళ్తున్నానని అనిపించలేదు. ఏదో అమ్మ పనిమీద పంపిస్తోంది అనిపించింది. ఆవరణంలో చెల్లెళ్లు రాధన్నయ్య మళ్ళీ యెప్పుడువస్తావు (మా ప్రాణానికి అనలేదు) అన్నారు. ఆ సాయంత్రం అమ్మ పాదాలకి తల తాకించాను. అమ్మ నెమ్మదిగా లేవనెత్తి, ఎడం చేత్తో బుగ్గలు పట్టుకుని ఎంతో గారంగా చూస్తూ "రాధికా! ఓ రాధికా" అంటూ మళ్ళీ "ఛత్రపతీ" అంటూ నుదుటిపై నెలవంక బొట్టు పెట్టింది. "తొందరగా మళ్ళీ వచ్చేయ్" అంది. నేను తలవూపి రెండు చేతులూ జోడించి అమ్మకళ్ళలోకి చిరునవ్వుతో 'వెళ్ళిరానా' అన్నట్లు చూచాను. అమ్మ కూడా నవ్వుతూ "వెళ్ళిరా నాన్నా!" అన్నట్లు తలవూపింది. అక్షరాలా నా జన్మధన్యం అనిపించింది. మాధవత్వపు మమకారంలోంచి మామూలు ప్రపంచంలోకి తిరుగు ప్రయాణం సాగించాను. ఎందుకంటే నేను సగటు మనిషిని కనుక. ఇది 1965-1967లో అమ్మ దగ్గర నా చరిత్ర, లేక అనుభవం. మీ యిష్టం మీరు ఏదైనా అనుకోండి.

(ఈ రోజు తారీకు, అక్టోబరు 2, 2001 పౌర్ణమి, మంగళవారం ప్రొద్దున్నే స్కందగిరి వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో నవగ్రహ అభిషేకాలు చేయించి, "ఇంటికి వచ్చి స్నానానంతరం అమ్మకు పూజా కార్యక్రమం పూర్తి చేసి, తర్వాత జిల్లెళ్ళమూడి నుండి నిష్క్రమణ భాగాన్ని పూర్తి చేసి ఉష అక్కయ్యకు యిస్తున్నాను. నేను తెలుగు అక్షరాలు కొన్ని మర్చిపోయాను. తప్పులు చాలా వుండవచ్చు. నేను నాకు గుర్తున్నంత వరకు కర్తగా అమ్మ రాయించగలిగినవి. రాయించినంత వరకూ క్రియా స్థానంలో వున్నాను. అమ్మ దగ్గర నుంచి వచ్చిన తర్వాత విషయాలు చెప్పడానికి యెప్పుడైనా భవిష్యత్‌లో ప్రయత్నిస్తాను.

❖❖❖

అమ్మకు నాగేంద్ర బంధం

నాకు చాలా కాలంగా వచ్చే స్వప్నాల్లో సర్ప ప్రపంచం ఒకటి. బహుశా చాలా మంది స్వప్నాల్లో కూడా సర్పాలు కన్పించడం మామూలు. నా విషయంలో స్వప్నంలో సర్ప ప్రపంచం చాలా సార్లు కన్పిస్తుంది. ఎక్కడో ఊరు బయట పొలాలవైపు వెళ్ళటం. అక్కడ చాలా పాములు చుట్టలు చుట్టుకొని వుండటం కొన్ని నా వైపు రావడం నేను తీవ్రంగా భయపడటం జరిగేది. మెళుకువ వచ్చిన తర్వాత ఇదంతా కలే కదా అని అమ్మ నామం చేసుకుంటూ నిద్రలోకి వెళ్ళేవాణ్ణి. అమ్మ చరిత్ర చదువుతుంటే అమ్మకు నాగేంద్రునికి చాలా సన్నిహితం వున్న సన్నివేశాలు చాలా వున్నాయి. ముఖ్యంగా నాన్నగారు - బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు, అమ్మకు బావ వరుస అవుతారు. చాలా సన్నివేశాల్లో అమ్మ చుట్టూ నాగేంద్ర సర్పం తిరుగాడటం వివరింపబడింది. ఒకసారి చిదంబరరావు తాతగారు ఆంధ్రపత్రిక చదువుతూంటే సంపాదకుని పేరు కాశీనాధుని నాగేశ్వరరావు. కొద్ది సేపట్లో అమ్మ తాతమ్మ మరిడమ్మగారు అమ్మను అమృతాంజనం తెమ్మని చెప్తుంది. ఇక్కడ కూడా నాగేశ్వరరావుగారే అనే సమయంలో దొడ్లో నైట్ క్వీన్ క్రింద పెద్ద త్రాచు వచ్చి ఆడుతూ వుంటుంది. నీళ్ళుపోసే నారాయణ పామును కొట్టడానికి కర్ర తీసుకువస్తే పాము కనపడకుండా పోతుంది. ఎవరో నాగేంద్రుడు, మామూలు పాముకాదు అంటాడు నారాయణ. అదే సమయంలో అమ్మనాన్నగారు, రాఘవరావు మావయ్య, మన నాన్నగారు, (నాగేశ్వరరావుగారు వస్తారు. మరిడమ్మగారు నాగేశ్వరరావు గార్ని నాగేంద్ర అని పిల్చేది. పై జరిగినదంతా ఒకే సమయంలోనే అమ్మ " నాలుగు దిక్కులా నాగేంద్రమయం" నాకు దిక్కు" అనుకుంటుంది. అలాగే మౌలాలీ, చిదంబరరావు తాతగారు, గొల్ల నాగమ్మ, పోలిసులైన అంకదాసు - మస్తాను మన్నవ మాధవాచార్యులు, పూజారిగారు, కూడా ఈ నాగేంద్ర సర్పాన్ని దర్శనం చేస్తారు. జిల్లెళ్ళమూడి ఆవరణ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన అధరాపురపు శేషగిరిరావు అన్నయ్య గారి కుమార్తె పద్మ కూడా ఈ సర్మాన్ని జిల్లెళ్ళమూడి పొలాలలో చూసింది. అంతేకాదు, నేను జిల్లెళ్ళమూడిలో వున్నప్పుడు ఎలక్ట్రికల్ పనికోసం, కాంట్రాక్టర్తో బాటు అందరిల్లు వేదిక వెనుక ఒక నాపబండ ఎత్తాము. నేను వెంటనే బెదిరి భయపడి బండను ప్రక్కకు పారేసి పరిగెత్తి పోయాను. ఆ బండ క్రింద పాము పిల్లల కట్ట

షుమారు 100 వరకూ వున్నాయి. 8 అంగుళాలకు మించి వుండవు. తర్వాత వెంటనే భయపడుతూ వచ్చి చూస్తే ఒక్కటి కన్పించలేదు. పోయిన సంవత్సరం అమ్మ కళ్యాణ ఉత్సవానికి వెళ్ళాను. తిరిగి బయల్దేరేందుకు లక్ష్మణరావు గారు బాపట్ల టాక్సీకోసం ఫోన్ చేశారు రాత్రి ఎనిమిది గంటలకు రమ్మని. డ్రైవర్ రాత్రి 8 గంటలకు వచ్చి నాతో, "సార్ నేను వస్తుంటే చాలా పెద్ద నల్ల త్రాచు పాము నా కారుకు అడ్డం వచ్చింది. వెంటనే వెళ్ళిపోయింది. 8 అడుగుల వరకు వుంటుంది. నాకు చాలా భయమేసింది సార్" అన్నాడు. నేను "నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఆ పాము సామాన్యంగా ఎవ్వరికి కన్పించదు. ఈ సారి కన్పిస్తే అమ్మను తల్చుకో" అన్నాను. అతని పరిస్థితిలో నిజంగా నేను వుంటే అమ్మ నాకు గుర్తురాదు, రెండు రోజుల వరకు ఎవ్వరితోడూ లేకుండా పగలు కూడా జిల్లెళ్ళమూడి దాటి బయటకు వచ్చేవాడిని కాదు. జిల్లెళ్ళమూడిలో అమ్మ మొదట్లో వున్న పాకయింట్లో సగం పెద్ద పుట్ట వున్న విషయం నాటి తరం, జిల్లెళ్ళమూడి వెళ్ళిన చాలా మందికి తెలుసు. వీటి అన్నింటి కన్నా చాలా ముఖ్యమైన విషయం అమ్మ జీవిత చరిత్ర పుస్తకాలు. అంటే అమ్మ చెప్పగా యార్లగడ్డ భాస్కరరావు గారు వ్రాసిన ఒరిజనల్ నోట్ బుక్స్, అమ్మ పాకయింట్లో కాఫీ కలిపే రూమ్‌లో చెక్క బీరువాలో వుంచేవారు. ఆ పుస్తకాల్ని చుట్టుకుని చాలా పెద్ద పాము ఉండటం చాలా కొద్ది మంది మాత్రమే చూశారని అనుకుంటాను నేను. అందుకనే అమ్మ చరిత్రలో వున్న యీ సర్ప సన్నివేశాలన్నీ ఒక చోట వివరిస్తే అందరికీ విశేషంగా తెలుస్తుందని వీలైనంత క్లుప్తంగా అవసరమైన చోట పాత్రల సంభాషణలతో వివరించాను. విషయాలన్నీ చాల మందికి తెలిసి వుండవచ్చు. కాని యెంతమంది "అమ్మ జీవిత మహోదధి" చదివి వుంటారు. చదవని వారికి పత్రిక ద్వారా తెలియజేయటమే ఈ వ్యాసాల యొక్క ఉద్దేశం .

నాగేంద్రుని ఆహ్వానంతో గొల్ల నాగమ్మ ఇంటికి

నేడు సకల జనులచే నిరంతరం ఆరాధింపబడుతూ జిల్లెళ్ళమూడి అమ్మగా ప్రసిద్ధి చెందిన అనసూయమ్మ జననం గుంటూరు జిల్లా పొన్నూరు సమీపంలోని మన్నవ గ్రామం. మన్నవ కరణంగారు, మన్నవ సీతాపతి – రంగమ్మ పుణ్యదంపతులు అమ్మకే జననీ జనకులై ధన్యులయ్యారు. వీరి యింటిలోనే నిరంతరం సేవ చేసుకుంటున్న పుణ్యమూర్తి గొల్లనాగమ్మ, మరిడమ్మగారు అమ్మకు తాతమ్మ

ధన్యులైనారు. అమ్మ జననంతోనే చాలా సున్నితంగా వుండి ఆరోగ్యరీత్యా తల్లిదండ్రులను చాలా కలవరపెట్టేది. అందువల్ల తాతమ్మ మరిడమ్మ గారు అమ్మను కొంతకాలం గొల్లనాగమ్మ దగ్గర ఉంచుదామనుకుంటుంది. అమ్మకు 2 నెలలు గడచి 3 నెల ప్రవేశించగానే ముద్దకుడుములు పంచి వూరు వెళ్దామనుకుంటుంది.

అమ్మ పుట్టిన 30వ రోజున ముద్దకుడుములు పంచేరోజు. ఆ రోజు ఉదయం భజంత్రీలు "నాగస్వరము" వాయిస్తారు. అదే సమయానికి, ఒక పాములవాడు, అడుక్కోవడం కోసం వచ్చి పాములు ఆడిస్తాడు. అదే రోజు రాత్రి ఏడున్నరకు మరిడమ్మగారు. గొల్లనాగమ్మను పిలిచి " ఈ రోజు మంచిది. పండు వెన్నెల, నిండు తిధి, ఇంటికి తీసుకువెళ్ళి, రోజూ రెండు సార్లు తీసుకొచ్చి అమ్మాయికి (అంటే అమ్మ అమ్మగారైన రంగమ్మగారికి) చూపించు" అని అమ్మను గొల్లనాగమ్మ ఒడిలో పెడ్తుంది.

బంధువులతో సహా పెట్రోమాక్స్ లైటుతో గొల్ల నాగమ్మ యింటి వేడుకగా తీసుకెళ్తారు. నాగమ్మ యింటి ముందుకు పోగానే పెద్ద త్రాచు యింటికి ముందు ఆడుకుంటూ అమ్మ ముంగిలికి (అమ్మను యెత్తుకున్న నాగమ్మ ముందుకు వచ్చి) పడగను ముందుకు వంచి సాష్టాంగనమస్కారము చేయుచున్నట్లుగా పడుకొన్నది. ఈ విధంగా నాగస్వరంతో వేడుక ప్రారంభమై, నాగమ్మ ఒడిలో, నాగమ్మ యింటికి వెళ్ళిన వెంటనే సర్పమే సాష్టాంగనమస్కారంతో అమ్మను ఆహ్వానించింది.

మన్నవ శివాలయంలో నాగేంద్రుడు

ఒకసారి రేటూరు (జిల్లెళ్ళమూడి దగ్గర) నుండి అమ్మ, మరిడమ్మగారు (అమ్మ తాతమ్మ) అమ్మ తండ్రి సీతాపతిగారు, లోకనాథంగారు (అమ్మ మరిది ప్రస్తుతం హైదారాబాద్ లోనే వున్నారు), రాఘవరావు మావయ్యగారు (అమ్మ అన్నయ్యగారు), పడవలో మన్నవకు బయల్దేరి, సాయంత్రం 6 గంటలకు మన్నవ జేరారు. అమ్మ వయస్సు సుమారు 8 సంవత్సరాల లోపే వుండవచ్చు. మన్నవ ఊరి ముందు సత్రం దగ్గర, పెద్ద పాము పడగ విప్పి ఆడుతూ యెదురు గుండా నుంచుంది. అమ్మ దానిని చూడకుండా, తలవంచుకుని, దాని మీదుగానే వచ్చేసింది. ప్రక్కనే వున్న రాఘవరావు మావయ్య "ఓ మెద్దూ, పాము, చూడకుండా నడుస్తావేం?" అన్నాడు. నా వెంటనే జనం కర్రలతో వచ్చారు. ఆ పాము ఉత్తరం వైపు నుంచి ముఖం దక్షిణం మూపు

పెట్టి, అమ్మ ముఖం చూస్తూ, కొద్ది దూరం వెళ్ళి అదృశ్యమైంది. కర్రలు తెచ్చిన వాళ్ళకు మాధవాచార్యులు గారి అనుభవం వల్ల ఎవ్వరూ కొట్టటానికి సాహసించలేదు.

మాధవాచార్యుల వారి అనుభవం : మాధావాచార్యులువారు మన్నవ చెన్నకేశ్వస్వామి ఆలయంలో అర్చకుడు, ఆయుర్వేద వైద్యుడు, పాముల మంత్రగాడు కూడ. ఎలాంటి సర్పాన్నయినా చేత్తో పట్టుకొని ఆడించగలవాడు. ఆయనకు, మన్నవ గ్రామంలో శివాలయంలో వున్న నాగేంద్రున్ని పుట్ట చుట్టూ ప్రదక్షిణాలు చేసేవాళ్ళంటే చాలా హేస్యాస్పదంగా వుండేది.

మన్నవ గోపాలకృష్ణయ్య గారి కూతురు చాలా కాలం కడుపు నొప్పితో బాధపడుతూండటం వల్ల, ఆ పుట్ట చుట్టూ ప్రదక్షిణాలు చేసిన కొద్దికాలానికే కడుపునొప్పి తగ్గిపోయింది.

ఒక రోజు ఆ పుట్టలో రెండు పాములు కన్పించాయి. వెంటనే మాధవాచార్యుల వారు వచ్చి, 'నిజమైన నాగేంద్రుడైతే, చంపితే నన్నేమైనా చేస్తాడేమో చూద్దాం. స్వామి అయితే నన్ను యేదో ఒకటి చెయ్యాలి కదా' అని 'ఆ పుట్టను పగులకొట్టి రెండు పాములను చేత్తో పట్టుకొని, బజార్లోకి తీసుకొచ్చి అందరితో "మీరందరు మ్రొక్కుతున్నారు కదా, మనుషుల్లో సాధుత్వము గల వాళ్ళునట్లే, పాముల్లో కూడా వుండవచ్చు. చూడండి. నన్ను ఏమీ చేయలేదు. మీ యెదుటే చంపేస్తాను" అన్నాడు.

సాధుత్వం ఉన్నంత మాత్రం చేత పాములు దేముళ్ళవుతాయా ? అన్నాడు.

మన్నవ నరసింహంగారు (ప్రక్కనే చూస్తుంటారు). నువ్వు, గుళ్ళో అర్చకుడివి కామోసు. నువ్వు కొల్చే రాళ్ళన్నీ దేవుళ్ళేనా ? చైతన్యము లేని రాళ్ళే దేవుళ్ళని నీవు పూజిస్తుంటే, చైతన్యముతో వుండి, సాధుత్వము గల పాముల్ని పూజించటంలో తప్పేముంది ? ఎవరి యిష్టం వాళ్ళది అన్నాడు.

సంభాషణ జరుగుతుండగా మాధవాచార్యులు గారు ఆ పాము కోరలు తీస్తుండగా, యేదో గుచ్చుకున్నట్టుగా వుంటుంది. వెంటనే పడిపోయారు. అరగంట సేపటికల్లా ప్రాణం పోయింది. అందరూ, నాగేశ్వరస్వామిని చంపటం వల్ల వీడి ప్రాణం పోయింది అనుకున్నారు.

అంకదాసు - మస్తానుల సమక్షంలో

అమ్మకు ఆరుసంవత్సరాల వయస్సు లోపున, బాపట్ల పోలీస్‌స్టేషన్‌లో అంకదాసు, మస్తాను అనే పోలీసులు పనిచేస్తుండేవాళ్ళు. అంకదాసు కళావంతులు. రెండవ పోలిసు మస్తాన్ ముస్లిము. ఒక రోజు సాయంత్రం 6 గంటలకు అమ్మ స్టేషన్ చేరువలో, యూనియన్ ఆఫీస్ వద్ద మఱ్ఱి చెట్టు దగ్గర కూర్చున్నది. అప్పుడు ఒక పోలీసు అమ్మతో కూడ వచ్చి అమ్మతో యేయ్ అమ్మాయ్ నీ పేరేమిటి ? అంటాడు. అమ్మ చాలా సేపు జవాబు చెప్పదు. తర్వాత అతను యేయ్ అమ్మాయ్ అన్నాడు. అమ్మ మళ్ళీ సమాధానం చెప్పదు. అందుకని మళ్ళీ అడుగుతాడు. అందుకు అమ్మ పిలిచావుగా ! అదే నా పేరు అబ్బాయ్ అంటుంది.

పోలీసు : అబ్బాయేమిటి ?

అమ్మ : అమ్మాయి యేమిటి ?

పోలీసు : నీవు అమ్మాయివి గనుక

అమ్మ : నీవు అబ్బాయివి గనుక

పోలీసు : ఏయ్ ! నేను పోలీసును

అమ్మ : ఏయ్ ! నేను అనసూయను.

ఈ విధంగా అమ్మ – పోలిసుల సంభాషణ ప్రారంభమైన తర్వాత క్రమంగా అంకదాసు, మస్తాన్ అనే పోలీసులిద్దరూ అమ్మను ప్రతిరోజు, మఱ్ఱిచెట్టు క్రింద కాక, అద్దంకి వారి తోటలో కలుసుకుంటుంటారు. క్రమేపి వాళ్ళిద్దరూ అమ్మ కృపకు పాత్రులై అనేక అనుభూతుల్ని పొందుతారు. ఒకరోజు వారిద్దరూ అమ్మతో కలసి అద్దంకి వారి తోట నుండి రైలు పట్టాలు దాటి వెళ్తుండగా ఒక ముసలివాడు యెదురుపడి పోలీసులిద్దర్నీ చూసి తర్వాత అమ్మను తేరిపార చూచి సాష్టాంగ నమస్కారం చేసి, ప్రాణం వదుల్తాడు. నోట్లోంచి నురగ పడుతూంటుంది. వొళ్ళు పచ్చబడి వుంటుంది. (ఈ ముసలివాడు ఒకసారి భిక్షాటనకు వెళ్తే అమ్మ తన మెళ్ళో వున్న బంగారపు తాడు. సిగ్గుబిళ్ళ యిచ్చి, అతనితో వెళ్ళి బ్యాంక్‌లో పెట్టించి డబ్బు యిప్పించి తినడానికి కావల్సిన పదార్థములు యిప్పించింది. అమ్మ, ఆ పోలీసు లిద్దరితో కట్టెలు ఏర్పాటు చెయ్యమని తను, యింటికి వెళ్ళి కనపడి వస్తానని వెళ్తుంది. తర్వాత మళ్ళీ అమ్మ ముసలివాని శవం, దగ్గరకు వస్తుంది. అంకదాసు, మస్తాను కూడా వస్తారు అక్కడికి.

ముసలి వాడు నెమ్మదిగా కదిలి కాస్సేపటికి లేచి కూర్చుంటాడు. అంకదాసు ముసలి వానిని అమ్మ పాదాల మీద పడటానికి కారణం అడుగుతాడు. ముసలివాడు చెప్తాడు.

తాత : లేదు బాబూ తాచుపాము కరిచింది. బ్రతకననుకొని స్టేషన్‌కు పోదామనుకుంటుండగా, అమ్మ ఫలానా చోట ఉన్నట్లుగా శబ్దము వినపడింది. దీపము చూడకూడదన్నారు. దీపము లేకుండా అమ్మ దారి చూపించింది. సరాసరి అమ్మ దగ్గరకు వచ్చాను. యేమి తెలియలేదు. అమ్మ మొన్న కనపడ్డప్పుడే యీ డబ్బు నీవు సొంతం వాడుకుంటావా అన్నది. యింకొక ముక్క కూడా అన్నది. పెద్దవాడివి పాములు, తేళ్ళు, జాగ్రత్త ! అని. ఎన్నాళ్ల నుంచి తిరగటం లేదేమిటి ? యీ అమ్మాయి యిట్లా అంటుంది అనుకున్నా. అప్పుడు డబ్బు దాహం తప్ప మరేమీ కనపడలా. ఆ రోజు నుంచి అమ్మ రోజుకొక రూపంలో కనపడుతూ, మాటలు వినపడుతూ వున్నాయి. నిన్న రాత్రి నేను యేదో వచ్చి చచ్చిపోయినట్లు, అమ్మ యేదో మందు పోస్తే బ్రతికినట్లు కల వచ్చింది.

అంకదాసు, మస్తాను, తాత, అమ్మతో మాట్లాడుతూ వుంటారు. అప్పుడు అమ్మ 20 సం. వయస్సుతో కనిపిస్తుంది. తెల్లచీర, తెల్లరవిక, సొమ్ము లేమీ లేకుండా, నుదుటిన బొట్టు కూడా లేకుండా, తల విరబోసుకోని, బాసిపీట వేసుకొని కూర్చుండి వుంటుంది. ఈ రూపముతో అమ్మ ముగ్గురికి ఒకేసారి దర్శనమిస్తుంది.

తాతకూడ మస్తాను, అంకదాసుతో బాటు అమ్మతో మాట్లాడుతుండగా, వెనకాల తనను ఏదో కదలించినట్లుంటే తిరిగి చూస్తాడు. తనను కరిచిన నల్లతాచు తళతళాడుతూ వచ్చి నుంచుంటుంది. తాత భయంతో గట్టిగా అరిచాడు. పాము మిగిలిన యిద్దరికి కనిపించదు. ఆ పాము అమ్మ మీదకి పాకుతుంది. తాత కరుస్తుంది అని అరుస్తాడు. అమ్మ వంటి నిండా పాము చుట్టుకొని, అమ్మ శరీరం కనపడకుండా, పాము శరీరమే చుట్టినట్లుండి, చివరకు పాము ఆకృతిగా వుండి, పాము రూపమై అమ్మ ముఖము మాత్రము మామూలుగానే కనపడుతుంది. తాతకు, భక్తి కలిగి, భయం తగ్గుతుంది. అమ్మ సాక్షాత్ భగవంతుని రూపంగా విశ్వసిస్తాడు. భక్తి ఒక్కటే, కలిగే సదుపాయాలు వారి వారి స్థితిని బట్టి కలుగుతున్నట్లుగా ఇదంతా ఆలకించి, మస్తాను అంకదాసుతో అంటాడు – తాత, అమ్మను, ఎప్పుడు ఇట్లాగే దర్శనం యిమ్మని ప్రార్థిస్తాడు.

తర్వాత అమ్మ, మళ్ళీ చిన్న పరికిణీ, చొక్కాతో, మామూలుగా కనిపించి, ముగ్గుర్ని యింకో దారి ద్వారా వెళ్ళమని తను వెళ్ళిపోతుంది.

(పై సన్నివేశంలో అంకదాసు, మస్తాన్ సంభాషణలు ఎంతో విశిష్టంగా, అనుభవాలతో కూడి వుంటాయి. ఇవన్నీ అమ్మ జీవిత మహోదధి – మొదటి భాగంలో వివరంగా ప్రచురించబడ్డాయి. నాగ బంధం ప్రస్తుత విషయం కనుక, ఆ పరిధిలోనే వ్రాస్తున్నాను.)

లక్ష్మణాచార్యుల వారి దగ్గర

అమ్మ చిన్నతనం అంతా, చిన తాతగారైన చంద్రమౌళి చిదంబరరావు గారి (బాపట్ల) దగ్గరే గడిపింది. వీరింటికి తరచూ, లక్ష్మణాచార్యుల వారు వస్తూండేవారు. వీరు నృసింహ ఉపాసకులు. వీరికి అమ్మంటే విపరీతమైన అభిమానం. అమ్మ అలౌకిక స్థాయిమీద విశ్వాసం. అమ్మకు అప్పుడు 6 సంవత్సరాలలోపు – ఒక ఏకాదశి రోజున ఆచార్యులవారు అమ్మను వారింటికి తీసుకువెళ్ళారు. ఇంట్లో దేవాతార్చన కెదురుగా కూర్చోబెట్టి, యిద్దరూ మాట్లాడకుండా 3 గంటలసేపూ కూర్చున్నారు. ఆచార్యులవారు కళ్ళుతెరచి :

"తల్లీ యింతకూ నీ వెవరమ్మా చెప్పు ? రెండు మూడు నెలల నుండి యీ ఆలోచన కలిగింది. ఈ రోజుకు అడిగే అవకాశం కలిగింది. ఏమమ్మా మాట్లాడవేం ఎవరమ్మా ! పోనీ నేనెవరినోచెప్పు ! పలకమ్మా పలుకుగల తల్లీ పలకవేమి తల్లీ ?"

అమ్మ ; నీవు పలికే పలుకే నేను, నాయనా !

ఆచార్యులవారు : వెంటనే అమ్మను కౌగిలించుకొని, నేనే అమ్మ, అమ్మే నేను, నేనే అమ్మ, అమ్మేనేను, అని వెంటనే లేచి 41 కొబ్బరికాయలు కొట్టి నారింజ కాయంత హారతి కర్పూరం వెలిగించి, "అమ్మా నీ చేతిమీదుగా 'అమ్మ' అని వ్రాసియ్యమ్మా" అని అడుగుతారు.

అమ్మ : చదువురాదుగా నాయనా !

ఆచార్యులవారు: నీవు చదువుకొన్న చదువుతో వ్రాయి.

అమ్మ : (పుస్తకము తీసికొని) యేమి వ్రాయమంటారు ?

ఆచార్యులవారు: వెలితిలేనిదిగా, నీ యిష్టమొచ్చిందిగా రాయమ్మా !

అమ్మ : పెద్ద సున్నా ఒకటి చుట్టుతుంది. అది జానెడు కైవారం కలదిగా

వుంటుంది. ఆచార్యులవారు వెంటనే ఆ సున్నాను కళ్లకద్దుకొని, యెన్ని అర్థాలు గల అక్షరాన్ని యిచ్చావమ్మా !

అమ్మ : ప్రక్కన యే అక్షరం లేనప్పుడు అది వట్టిదేగా

ఆచార్యులవారు: ప్రక్కన అక్షరం లేనప్పుడు ప్రపంచం అంతా యిదేనని, నేనేనని చూపిస్తున్నావమ్మా, నా అనుభవాలన్నీ మన యింట్లో వాళ్లతో చెప్పమంటావా అమ్మా?"

అమ్మా : చెప్పినా, అది వారి అనుభవం కాదుగా, నాయనా.

ఆచార్యులవారు: చెప్పినా నమ్మరు. రాత్రి 12 గం॥లకు అమ్మ, ఆచార్యులవారు, చిదంబరరావుగారి యింటికి వస్తూ వుండగా, త్రోవలో పెద్దతాచు యిద్దరి మధ్యా నుంచిని వున్నట్లు కనపడింది. లక్ష్మణాచార్యులవారు ఉలికిపడి 'అమ్మా దూరంగా పో ! కాటేస్తుంది'.

అమ్మ : ఆ కాటులో ఘాటు లేదులేండి.

ఆచార్యులవారు: త్రాచుపామమ్మా విషం.

అమ్మ : త్రాచుపామేనా ?

లక్ష్మణాచార్యుల వారి యెత్తుగా లేచి పాము సరాసరి వారినే చూస్తు వుంటుంది. ఆయన విశ్చేష్టుడై చలనం లేనివాడై పోతాడు. ఒక అరగంటకు కళ్ళుతెరుస్తాడు. పాము అమ్మను చుట్టుకొన్నట్లుగా ఆయనకు కనపడుతుంది. ఆయన వెంటనే అమ్మ పదాల మీదపడి "నేను పాము అంటే భయంలేనివాడిని, యీ పామును చూస్తే ఎందుకింత భయం కలిగింది ? ఇది పాముకాదెమో ! అయినా, నిన్ను చుట్టవేసుకుందేమిటమ్మా ?

అమ్మ : పాము కాదు నాయనా నాగేంద్రుడు. ఆ నాగేంద్రుడే నన్ను చుట్టుకొని వున్నాడు. నేను నాగేంద్రుణ్ణి చుట్టించుకున్నాను. ఆ నాగేంద్రుడే నాగేశ్వరుడై వస్తాడు. వాడే నా కాధారం వాడి ఆకారమే నేను.

ఇదే నాగేంద్ర బంధం. ఆ తర్వాత ఆచార్యులవారు అమ్మను, ముగురమ్మల మూలపుటమ్మగా గుర్తించి ఆవేశంగా కేకలు వేస్తారు. అమ్మ వెంటనే చిదంబరరావుగారి యింటికి వెళ్లిపోతుంది. ఆచార్యులవారు రాత్రి 2 గంటలవరకు అక్కడ వుండి నెమ్మదిగా ఆయన యింటికి వెళ్లిపోతారు.

మౌలాలి అనుభవం

అమ్మ తన చిన్నతనం నుంచే అనేక మందికి దివ్యదర్శనాలిచ్చి వారి పాలిటి మోక్ష ప్రదాయిని అయింది. విశేషం ఏమిటంటే అమ్మ, ఈ మానవలోకంలో జన్మించక ముందే తను జన్మించనున్నట్లు అమ్మ తండ్రి సీతాపతిశర్మ గారికి 40 ఏళ్ళ ముత్తయిదువుగా కన్పిస్తుంది. "ఎవరమ్మా నీవు" అని అడిగితే "నేను అమ్మను" అని అదృశ్యమౌతుంది. భూలోకంలో అవతరణకు ముందే, యీ విధంగా అమ్మ ఎంత మంది పుణ్యాత్ములకు దర్శన మిచ్చిందో మనకు తెలియదు. అలాంటి పుణ్యమూర్తుల్లో మౌలాలి అనే అతడు ఒకడు. అమ్మ దర్శనంతోనే అతని జన్మ చరితార్థమై ధన్యమౌతుంది. అమ్మ కరుణకు పాప పుణ్యాలంటూ లేవు. అంతా, అందరూ ఒక్కటే. తల్లికదా. "కర్త, కర్మ, క్రియలు నీవే" అని చెప్పిన తల్లి, సకలచరాచర సృష్టి, స్థితి, లయలకు కర్త అయింది. ఆ మాతృమూర్తి చరిత్రలో అనేక మంది పుణ్యమూర్తులు తమ తమ పాత్రలు నిర్వహించడానికి అవతరించారు. వారిలో 'మౌలాలి' ఒకడు.

షుమారు 6 సంవత్సరాల వయస్సులోపు, అమ్మ బాపట్లలో భావన్నారాయణ స్వామి దేవాలయం దగ్గర నుంచి వెళ్తూండగా, చింపిరి గుడ్డలతో ఒక సాయిబు ఎదురు వచ్చాడు. చాలా సుస్థిగా ఉన్నాడు. అమ్మ వైపే చూస్తూ వున్నాడు. తన కోసమే చూస్తున్నాడనుకొని, అమ్మ దగ్గరగా వెళ్ళి, "యేం నాయనా !" అనగానే అమ్మను దగ్గరకు తీసుకొని తలను గుండెలకు అదిమి పెట్టుకొని, ముద్దు పెట్టుకుంటాడు. "దగ్గరకు వచ్చేటప్పటికి యెంత చిన్న పిల్లవయినావమ్మా అని, ఇందాక చాలా భారీ మనిషిగా కన్పించావు ఎందుకమ్మా ఇంత త్వరగా మారిపోయావు ? అంటాడు. అమ్మ, అతనిని ఏం కావాలో చెప్పమంటుంది. అతను అమ్మే కావాలంటాడు. అతను ఎందుకు ఏడుస్తున్నాడో కారణం అడుగుతుంది. అతను, తను సాయిబుల ఇంట్లో పుట్టి, బ్రహ్మం గారి భక్తులైన కోమట్ల యింట్లో పెరిగినట్లు, అందువల్ల తను యిష్టపడిన ఈశ్వరమ్మ మూర్తిని అమ్మలో చూచినట్లు చెప్తాడు. ఇలా మౌలాలి ప్రథమంగా, అమ్మ దర్శనం పొందాడు. అతనికి కళ్ళు సరిగ్గా కన్పించవు. అక్కడక్కడ అడుక్కొని, అమ్మని దర్శిస్తూ రోజులు గడుపుతుంటాడు. క్రమంగా అమ్మ, మౌలాలీని గూర్చి చిదంబరరావు గారికి చెప్తుంది. అమ్మ మన్నవ, తెనాలి వెళ్తే, ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో అడుక్కొని,

అమ్మ దర్శనం చేసుకుంటూ వుంటాడు. అమ్మ సంభాషణల్లో అనేక వేదాంత రహస్యాలు తెలియడం, అమ్మ అలౌకిక, దివ్య సాక్షాత్కారం కలుగుతుంది మౌలాలికి. అవన్నీ అమ్మ చరిత్ర "అమ్మ జీవిత మహోదధి" (మొదటి భాగంలో) ప్రచురించారు. ప్రస్తుత విషయం, అమ్మ చుట్టూ వున్న నాగేంద్ర మాయ సాక్షాత్కారాన్ని దర్శించి, అమ్మతో తాదాత్మ్యం పొందిన మౌలాలి గూర్చి మాత్రమే తెలుసుకుందాం.

మన్నవ (అమ్మ స్వగ్రామం) లో, అమ్మ తరచు, గంగరాజు పున్నయ్య గారి తోటలో ఎక్కువగా, ఒంటరిగా తిరుగుతుండేది. ప్రస్తుత విషయం జరిగిన కాలం, జూన్ నెల. విపరీతమై ఎండలు, వడగాల్పులు. ఎక్కడ నీరు అక్కడ భూమాత త్రాగేసింది. చెట్లు మొలవలేక పోతున్నాయి. చెట్ల మీద పక్షులు నిలవలేక పోతున్నాయి. మనుషుల్లో రక్తం కూడా పీల్చుకుపోతున్నది. ఇంట్లో ఆవిరి, వాకిట్లో వడ, గొడ్లు పాలివ్వకుండా యెండిపోయినాయి. ఇటువంటి పరిస్థితుల్లో అమ్మ రోజుకు 22 గంటలు పున్నయ్య గారి తోటలోనే కాలం గడుపుతూ వుండేది. ఇంట్లో అమ్మ పెళ్ళి విషయాలను గూర్చి ఘర్షణలతో చర్చలు జరుగుతుండేవి. అమ్మ 11 రోజులు ఒకే చింత చెట్టు క్రింది లేవకుండా కూర్చుంటుంది. 12వ రోజు కళ్ళు తెరిచేసరికి నాలుక విరుచుకు పోతూంటుంది. దగ్గరలో యెక్కడా మంచి నీళ్ళు లేవు. ఆ చింతమాను వంక ఒక అరగంట చూస్తూ కూర్చుంటుంది. మాను పగిలిపోతుంది. ఆ పగిలినప్పుడు వచ్చే ధ్వని "ఓంకార ధ్వనిగా, పెద్ద మోతగా, పిడుగు పడినట్లుగా, వూరంతా వినిపిస్తుంది. వెంటనే మేఘాలు పట్టి పెద్ద వర్షం కురుస్తుంది. వూరంతా చల్లబడుతుంది. చచ్చిపోయేవన్నీ బ్రతుకుతాయి. అయిదు రోజుల కల్లా భూమి పచ్చబడుతుంది. అమ్మ వానలో అక్కడే వుంటుంది. చెట్టు మాను పగిలినప్పుడు దానిలో నుంచి నురుగు, నురుగుగా కారుతుంటుంది. అమ్మ దోసిళ్ళతో ఆ రసం తాగుతుంది. దానినే "త్రింత్రిణీ సుధ" అంటారు. ఎటుచూసినా నాగజెముడు మట్టలు, చింతలు. " ఆ చింతల్లోని చింతే నా దాహాన్ని తీర్చింది" అనుకుంటుంది అమ్మ. ఎప్పుడూ " నాకు చింతలే కావాలి. చింతే నీడ నిచ్చింది. చింత అండన అలసట తీర్చుకున్నాను; చింత రసమే దాహం తీర్చింది. రేపు నేను ఈ ఊరు నుండి వెళ్ళేటప్పుడు కూడా యీ చింతే తీసుకెళ్తే, ఈ చింత నా చెంత నుండి మనసుకు యే చింతా లేకుండా చేస్తుంది" అనుకుంటుంది. ఒక పరికిణి, చొక్కాతో, వానకు తడుస్తూ యెండకు యెండుతూ, అక్కడ 11 రోజులు గడుస్తాయి.

మౌలాలి దొప్పలపూడిలో అడుక్కుతింటూ, రోజూ తోటలో అమ్మ దగ్గరకు వచ్చి వెళ్తుండేవాడు. తర్వాత దొప్పలపూడి వెళ్ళటం మానుకొని అమ్మ దగ్గరే తోటలో వుంటాడు. మౌలాలి రకరకాల అనుభవాలు కలుగుతాయి. అనేక ప్రశ్నలు, సందేహాలు, మళ్ళీ వాటికి సమాధానాలు వాటంతట అవే స్ఫురిస్తుంటాయి. అమ్మను చూస్తూ అమ్మలో కలిసిపోయిన వాడిలా, కన్ను అర్పకుండా కూర్చుంటాడు. అమ్మ వంటి మీద అనేక పక్షులు వాలి ఎగిరి పోతుంటాయి. కొట్టాలనుకుంటాడు. కానీ ఏమీ చెయ్యలేడు. అమ్మ వంటి మీద అనేక పురుగులు ప్రాకుతుంటాయి. తీసివేద్దామను కుంటాడు. కానీ ఏమీ చెయ్యలేడు. కన్పించింది. గుర్తిస్తాడే కానీ, యే సంకల్పాలు రావు. ఇలా అయిదు రోజులు గడుస్తాయి. పౌర్ణమి వస్తుంది. ఆ రోజు రాత్రి 12 గంటల సమయం. అమ్మను చుట్టుకొని, పైన గొడుగులాగా, పడగ విప్పి లెక్కకు వీలులేనన్ని శిరస్సులతో అమ్మ తలకు అర్ధ గజం యెత్తున అనేక రంగులతో మెరిసిపోతూ, తలలూపుతూ ఆడుకుంటున్నట్లు మహాసర్పం ఆ వెన్నెలలో కనపడుతుంది మౌలాలీకి. నా భ్రమా ? నిజమేనా ! అని దగ్గరకు వెళ్ళి చూస్తాడు అమ్మను. ఇంకా ఎక్కువ కాంతిగా కనబడుతుంది. గొడుగు ఆకారంగా ఒక్కొక్క శిరస్సు ఒక్కొక్క గొడుగు కడ్డీలాగా కనబడుతుంది. పాము చర్మము గొడుగు గుడ్డ లాగా వుంటుంది. క్రింద వైపున పాము చర్మము గొడుగు కర్రలాగా వుంటుంది. పామును అమ్మ పట్టుకొన్నట్లు ఇంకా చూడగా విష్ణుమూర్తి శేషశాయి మాదిరిగా అమ్మ కన్పడుతుంది. అమ్మకు ఆదిశేషుడు గొడుగై, యెండకు, వానకు కాపాడుతున్నాడు అనుకుంటాడు మౌలాలి. చూస్తూ చూస్తుండగానే అనేక రూపాలు వస్తాయి. అమ్మ, తనకు (మౌలాలికి) కనిపించిన అవతారాలన్నింటికీ మూలం కూడా అమ్మేనని అనుకుంటాడు. మూలమని గుర్తించడమే జన్మ తరించడం అని అనుకుంటాడు మౌలాలి. తర్వాత చాలా సేపు సంభాషిస్తాడు. అమ్మ చరిత్ర సాగుతుంది ముందుకు. అమ్మను ఆది శేషశయన మూర్తిగా దర్శించిన మౌలాలీ యెంతో పుణ్యమూర్తి కదా !

మౌలాలీ అమ్మతో కొంత సేపు మాట్లాడిన తర్వాత, అమ్మ ఆ రోజు యింటికి వెళ్తుంది. మర్నాడు రోజు అన్నం తీసుకొని తోటలోనికి వెళ్తుంది. మౌలాలీ భోజనం చేస్తాడు. అమ్మ ఇంకా చాలా జంతువులకు కూడా ఆహారం వేస్తుంది. మళ్ళీ మౌలాలీ అమ్మతో మాట్లాడుతూ "అమ్మా మొన్న నీ నెత్తిన గొడుగల్లే పామున్నది ఎందుకు?"

అమ్మ : ఏమో మౌలాలీ ! మొన్న యీ మధ్య నాకు కూడా మధ్యాహ్నమప్పుడు కూర్చుని నిద్రపోయి లేచాను. కళ్ళు తెరిచేటప్పటికి నా నెత్తిన నాకూ అలాగే కన్పడ్డది. ప్రక్కకు తిరిగితే ప్రక్కన, ఎదురు చూస్తే ఎదురు గుండా, ఎటు చూస్తే అటల్లా కన్పడ్డవి

నాకు. చింతచెట్టు చూస్తే చింత చెట్టు అంతా అలా అదిగానే కన్పడ్డది. అయినా యిదేంటో చూద్దామని రోడ్డునే బయలుదేరితే రోడ్డు నే నడిచినట్లే నడుస్తున్నది. చివరకు శివాలయం వాకిలి ముందు నుంచున్నా, ధ్వజ స్థంభం వంక చూస్తే దారి పొడుగునా కన్పడ్డది. నీ పాదాల దగ్గర నుండి గుడి వాకిలి దాకా వున్నది. ఇదేమిటని భావ నారాయణస్వామి దేవాలయానికి వెళ్ళాను అక్కడ కూడా ఉన్నది. అక్కడ కూర్చున్నాను చివరకు ఇదేమిటని తోచింది ఇదంతా నాలోదే ననిపించింది. నాలో ఎక్కడున్నది? అని నాలో నాకే ఆలోచన వచ్చింది. పాము చుట్టలు చుట్టుకొని పడగ ఎత్తి నుంచున్నపుడు యెట్లా వుంటుంది? మనిషి కూర్చున్న ఆకారంగా వుంటుంది. అదే "బ్రహ్మదండి" అంటారు. వెన్నెముక క్రిందుగా వుంటుంది ఆ నాడి. అదే "సుషుమ్న". అదే బ్రహ్మం గారి తత్వాల్లో వచ్చేది. నీకు తెలియకుండా వున్నదా ? ఒక మనిషిని జుట్టు పూర్తి తీసేయించి నుంచోబెట్టి వెనుక ప్రక్క నుండి చూస్తుంటే నాకేమో పడగ ఆకారంగా తోస్తుంది. ఆ తల యెవరితల అయినా అట్లాగే అనిపిస్తుంది. పాము ఆకారం ఎట్లా వుంటుందో మన శరీరంలో వుండే "సుషుమ్నా" నాడి అట్లాగే ఆపాదమూ వుంటుంది. దానికి కేంద్ర స్థానము నడుము దగ్గర్నుండి శిరస్సు వరకు అని చెప్పారు. అంత మాత్రం చేత నీ శరీరం అంతా లేదని కాదు. కొందరు సాధకులు ఉచ్ఛ్వాస నిశ్వాసాల ద్వారా గుర్తిస్తారు. కొందరు రెండు కనుబొమ్మల మధ్య దృష్టిని నిలిపి దాని ద్వారా గుర్తిస్తారు. అదే "కుండలినీ ప్రబోధమని". పడుకున్న పామును కొడితే తలెత్తి బుసకొట్టినట్లుగా కొంతమంది సాధకులు "హఠయోగము" అని చెప్తారు. స్థానాల్లో కేంద్రీకరణ ఎందుకంటే విగ్రహారాధన వంటిది. అనేకమంది అనేక విగ్రహాలు పెట్టుకొని ఒకే విషయం కోసం కృషి చేయటంలా ? ఒకే స్థితికి అనేక సదుపాయాలు, ఒక మేడకు నాలుగు వైపుల మెట్లు వేసినట్లు.

మౌలాలి : అయితే బయట సర్పమల్లే కనపడటం దేనికమ్మా ?

అమ్మ : లోపల యేదో వెలుపలా అదేనని. రెండు కావని ఇందాక నీవు అనలా?

మౌలాలీ : యేమన్నానమ్మా ?

అమ్మ : బ్రహ్మమైనా నంటివే, యెట్లా అయినావని అడిగితే బ్రహ్మను చూచి బ్రహ్మమైనా నన్నావు. చూపించింది చూచింది ఒకటైందిగా !

ఇలా అమ్మ, మౌలాలీల సంభాషణ నడుస్తుంది. మౌలాలీ మామూలుగానే అమ్మ వెళ్ళిన చోటల్లా అనుసరిస్తూ, భిక్షమెత్తుకుంటూ అమ్మను దర్శిస్తూ కాలం గడుపుతాడు.

చిదంబరరావు గారు - అమ్మతో

శ్రీశ్రీశ్రీ చంద్రమౌళి చిదంబరరావు గారు అమ్మ జీవిత చరిత్రలో అతి ముఖ్యమైన వ్యక్తి. ముఖ్యంగా శ్రీరామ - శ్రీకృష్ణ అవతారాలలో అవతార కార్య నిర్వహణ కోసం అనేక మంది దేవతామూర్తులు, జగన్నాటక సూత్రాధారి అవతరణకు ముందుగానే భూలోకంలో వివిధ పాత్రల నిర్వహణార్థం అవతరించారు. అలాగే శ్రీ చిదంబర రావు గారు కూడా అఖిలాండకోటిబ్రహ్మాండనాయకి మాతృ అవతారంతో అవతరించడానికి ముందు వివిధ పాత్రలను పోషించడానికి అవతరించిన దేవతామూర్తులలో అతి ముఖ్యమైన అవతారం అనడంలో అతిశయోక్తి లేదు. వీరు మన అమ్మకు చిన తాతగారు. వివరించాలంటే అమ్మ మాతా మహుడు. చంద్రమౌళి వెంకటసుబ్బయ్యగారి (తెనాలి) తమ్ముడు. వీరు సంస్కృత, ఆంగ్ల, ఆంధ్రభాషాపండితులు, అష్టావధాన - శతావధాన సమర్థులు. వీరు బాపట్లలో వకీలు వృత్తిచేసేవారు. అమ్మ చిన్నతనం నుండి వీరి దగ్గరే వుండేది. అనేక ఆధ్యాత్మిక సంభాషణలే కాక అనేక దివ్యానుభూతుల్ని ప్రసాదించింది. తన అవతార కారణాలను వివరిస్తూ తన సంపూర్ణ స్వరూపంతో అనేక రూపాలతో ప్రత్యక్షమై, ఎప్పటికప్పుడు మాయతెరలు వేసి "నేను చూసింది నిజమేనా ? అనే సందిగ్ధావస్థలోనే వుంచేది. వీరు అమ్మ చిన్నతనంలోనే అలౌకిక స్థితి గమనించి ఒక సందర్భంలో విపరీతంగా యేడుస్తూ నీ చరిత్ర ఏ పండితుడైనా వ్రాస్తే బాగుండు తల్లీ" అంటారు. దానికి అమ్మ (అప్పటికి 6 సంవత్సరాలలోపు) "పండితుడైన పామరుడు వ్రాయడు - పామరుడైన పండితుడు వ్రాస్తాడు" అంది. ఆ పామరుడైన పండితుడే 'మహర్షి' యార్లగడ్డ భాస్కరరావు (రేపల్లె దగ్గర సింగుపాలెం నివాసి). అమ్మ చెప్తూంటే వీరు అమ్మ చరిత్రను వ్రాశారు. అదే "అమ్మ జీవిత మహోదధి" చిదంబర రావు తాతగారు 1961 ప్రాంతంలో (సుమారు) అమ్మలో ఐక్యమయ్యారు.

అమ్మ రకరకాల దర్శనాలు ప్రసాదిస్తూ విశ్వరూప దర్శనం ఇస్తుంది. చిదంబర రావు తాతగారికి చివరిగా ఎక్కడో నానా బాధలు పడుతూ ఒకింట్లో సేవ చేస్తున్న స్త్రీమూర్తి కనబడుతుంది. యివన్నీ తెర మీద బొమ్మలలాగా కన్పిస్తుంటే ఆ స్త్రీమూర్తి పడే కష్టాలు చూడలేక" ఎవరమ్మా ఈ సహనమూర్తి ? ఇదివరకిటిదా, ఇప్పటిదా, ముందు రాబోతుందా, సహనమనే దేవతను ఆరాధిస్తున్న తల్లీ" అని కేకలు వేస్తారు.

తర్వాత సహజ సహనం అనే బంగారపు రంగులో అక్షరాలు వాటి కింద, చింపిరిజుట్టు, చీమిడి, బొడ్డు కిందకు జారిపోయిన పరికిణీ, చొక్కాలేకుండా ఒక పిల్ల కన్పడుతుంది. ఆ తర్వాత అమ్మ లక్షణాచార్యుల వారింటికి వెళ్తుంది. పూజకు వెళ్ళిన వాళ్ళు రాత్రి పదకొండున్నర పన్నెండు గంటల మధ్య వస్తారు. అన్నపూర్ణమ్మ గారు (చిదంబరరావు గారి భార్య) మేడ పైకి వస్తారు. చిదంబరరావు గారు మంచి నిద్రలో వుంటారు. ఆయన గుండెల్లో మొగలి పువ్వుల వాసన కదిలినట్లుంటుంది. ఏమిటో అని గుండెల మీద నుంచి చేత్తో తీసి వేయగా పాము జరజరా పాకి పోతుంది.

చేత్తో తీసివేసిన పాము కొంతదూరమే పోతున్నట్లు కనబడి తర్వాత కనపడదు. తూములో చేరింది అని అనుకుంటారు.

అమ్మ తల్లిదండ్రులు, తిరువళ్ళూరు వీరరాఘవస్వామి దగ్గరకు మొక్కుబళ్ళకు వెళ్ళి రావాలి. లక్షణాచార్యుల వారు మార్గశిర మాసంలో వెళ్ళిరమ్మంటారు. అలాగే నిశ్చయమౌతుంది. తర్వాత వచ్చిన పంచమి నాడు పొద్దున్నే నాగులచవితికి పుట్టలో పాలు పోయడానికి వూరంతా, రైలవతల అద్దంకి వారి తోటకు వెళ్తారు. అమ్మ కూడా వెళ్తూ చిదంబరరావు గార్ని కూడా తీసుకెళ్తుంది. అందరూ పాలు పోస్తుంటారు. అమ్మ వెళ్ళేసరికి పుట్టలో పాము పైకి వస్తుంది. నాగేంద్రుడే కాక తక్కిన పురుగులన్నీ లేచి నుంచుంటాయి. పాముపైకి వచ్చినప్పుడు క్రితం రోజు అనుభవంలోకి వచ్చిన మొగలి పువ్వు వాసన వస్తుంది. పాముపైకి రావడం చూసిన పురోహితుడు "ఎవరో అమంగళంగా వచ్చారు" అంటారు. పురోహితుడు మళ్ళీ పెద్దగా "ఎవరో అపవిత్రులు వచ్చారు" అంటారు. "వాళ్ళ వాళ్ళు వస్తేనే అది వచ్చింది" అని అంటారు చిదంబరరావుగారు. అన్నపూర్ణమ్మ గారు వెళ్ళిపోతుంది. గాలి, చినుకులు ప్రారంభం అవడంతో అందరూ వెళ్ళిపోతారు. పాము అమ్మ వంక చూస్తు నిలబడి వుంటుంది. అమ్మ దగ్గరకు వెళ్ళి ముఖంలో ముఖంపెట్టి, భయపడ్తున్న తాత గారి చెయ్యి పాము తలపైన పెట్టిస్తుంది. పాము ఎగిరి అమ్మ భుజం మీద వాల్తుంది. చిదంబరరావు గారు కొయ్యబారిన శరీరంతో అమ్మ భుజం మీద తల వాలుస్తారు. ఇక్కడ అమ్మ అనేక విషయాలు చెప్తుంది సంభాషణాపూర్వకంగా, చిదంబరరావు తాతయ్య గారితో, అప్పుడు అమ్మ వయస్సు షుమారు 6 సంవత్సరాలు లోపు.

బ్రహ్మకడిగిన పాదాలు

1968లో నేను అమ్మ దగ్గర వుండే రోజుల్లో కొన్ని రోజులు అమ్మ దగ్గర అర్చకత్వం నిర్వహించాల్సి వచ్చింది. అమ్మ అప్పుడు ప్రస్తుతం 'అలంకార హైమ'గా పిలువబడే మందిరంలో వుండేది. రామకృష్ణ అన్నయ్య జమాబందీ హడావిడిలో వుండేవాడు. అందుకని రాత్రంతా కూడా అప్పికట్లలో పనులు చేసి, యే తెల్లవారు జామునో బయల్దేరి పొలాల్లోంచి జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గరకు వచ్చేవాడు. అప్పట్లో అందరిల్లు, అన్నపూర్ణాలయం మాత్రం పూర్తి అయ్యాయి. ఆ రోజులలో అమ్మ దగ్గర అర్చకత్వం పనులు పూర్తి అయిన తర్వాత రాత్రంతా అమ్మ దగ్గర వుండేవాణ్ణి. అలా మామూలుగా జరిగే రోజుల్లో ఒక రోజు ఉదయం 7 గంటలకు అమ్మ దగ్గర్నుంచి అన్న పూర్ణాలయం వేపు బయల్దేరి వెళ్తున్నాను దారిలో గజేంద్రమ్మ యెదురైంది.

గజేంద్రమ్మ : "రాధన్నయ్యా ! అమ్మ యేం చేస్తోంది ?

నేను : "ఇప్పుడే స్నానానికి సిద్ధమౌతోంది"

(5 అడుగుల దూరం వచ్చేసరికి కస్తూరి యెదురైంది)

కస్తూరి : రాధన్నయ్యా ! అమ్మ యేం చేస్తోంది ?

నేను : ఇప్పుడే స్నానానికి బయల్దేరి వుండవచ్చు.

(ఇంకా 10 అడుగులు వెళ్ళాను. అక్కడ నాన్నగారు మంచం మీద కూర్చుని వూళ్ళో వాళ్ళెవరో యిద్దరితో మాట్లాడుతూ) "రాధా ! అప్పికట్ల నుంచి రామకృష్ణ వచ్చాడా?"

నేను : "రామకృష్ణ వచ్చి అరగంట అయింది నాన్నగారూ"

(నేను అందిరింటి వైపు తిరిగి వెళ్తున్నాను) హరిదాసుగారు "అబ్బాయ్ రాధా ! అమ్మ యేం చేస్తున్నారు"

నేను : ఇప్పుడే రామకృష్ణ వచ్చాడు. ఈ పాటికి స్నానానికి బయల్దేరి వుండవచ్చు. అని అన్నపూర్ణాలయం వేపు తిరిగితే శేషయ్యగారు – (ఆ రోజుల్లో వంట చేస్తూండే వారు) "అబ్బాయ్ రాధా ! అమ్మ దగ్గర యెవరున్నారు ? వెళ్ళవచ్చా ?"

నేను : తప్పకుండా వెళ్ళండి. ఈ పాటికి అమ్మ;ఇంకా రామకృష్ణ అన్నయ్యతో మాట్లాడుతూ వుంటే, మీరూ మాట్లాడండి. బహుశా స్నానానికి వెళ్ళి వుంటారేమో.

శేషయ్య : (హరిదాసుగారితో) నాకే కోపం యెక్కువ అని అందరూ అంటుంటే

మీ అబ్బాయికి అసలు కోపం లేదు" అన్నారు. హరిదాసుగారు నా వేపు చూచి నవ్వుతున్నారు. నాకు వొళ్ళుమండింది. నా పక్కనే - యెవరో నుంచున్నట్లు వుంటే, చూశాను. తాపీమేస్త్రీ నుంచున్నాడు. "ఏమిటి !" అన్నట్లు చూశాను. "సిమెంటు కట్టలు లేవు అన్నయ్యగారు" (నాకు చాలా చికాకు వేసింది)

నేను : ఏంటయ్యా సిమెంటు కట్టలు నన్నే అడగాలా !" (హరిదాసు గారితో "స్వామి ఈ విషయం చూడండి" అంటూ అందరింటి వేపు వెళ్తూంటే కీ.శే. అదరాపురపు శేషగిరిరావు గారు (జిల్లెళ్ళమూడి చరిత్రలో వీరికి చాలా విశిష్ఠ స్థానం వుంది. అన్నపూర్ణాలయం, అందరిల్లు నిర్మాణ కార్యక్రమంలో వీరు విశిష్ట సేవ చేశారు. అక్కడే నుంచున్నారు. మా కందరికీ ఆయనంటే చాలా గౌరవం. "రాధాకృష్ణ మూర్తిగారు అమ్మగారు యేం చేస్తున్నారు ?" అన్నారు. "ఇంతక్రితం రామకృష్ణ అప్పికట్ల నుంచి వచ్చాడు. నేను వస్తున్నప్పుడు అమ్మ స్నానానికి పోబోతూ అన్నయ్యను చూసి ఆగి అన్నయ్యతో యేమిటో మాట్లాడుతోంది" అన్నాను. ఆయన నన్ను చిరునవ్వుతో "మీరు అర్చక స్వాములు కదా ! అమ్మతో నేను ఒకసారి మాట్లాడాలి చెప్తారా !" నేను గౌరవంతోనే - "అన్నయ్యగారూ ! నేను అర్చక స్వామి నైతే, మీరు అమ్మకు అనుంగు బిడ్డలు. అందుకే మీరు మాకందరికీ పెద్దన్నయ్య అయ్యారు. ఇప్పుడే వెళ్ళి చెప్పి వస్తాను" అంటూ నెమ్మదిగా వెనక్కి వెళ్ళాము. తర్వాత విషయాలు మామూలుగానే జరిగిపోయాయి. నేను అమ్మ యింటివైపు వెళ్తూంటే మళ్ళీ దారిలో కన్పించే అందరూ ఇవే ప్రశ్నలు అమ్మ యేం చేస్తున్నారు ? స్నానానికి వెళ్లలేదా ? అమ్మ దగ్గర యెవరున్నారు? అంటూ - నాకు వీలైనంత వరకు నవ్వుతూ (సాధారణంగా నేను సీరియస్‌గా వుంటాను. అమ్మ నన్ను ఆవరణంలో క్రమశిక్షణ చూడటానికి నియమించింది. నా మొహం యెప్పుడూ చిటచిట లాడుతూ వుంటుందని అమ్మ దగ్గర కూర్చున్నా కూడా అవి అందరూ అనుకుండే వాళ్ళు. ఇప్పుడు నన్ను అర్చక స్థానంలో వుంచింది. నా క్రమశిక్షణ కోసం కాబోలు) సమాధానాలు చెప్తూ వెళ్ళేను.

ఇదంతా యెందుకు వివరిస్తున్నానంటే ఆవరణంలో వాళ్ళు నిత్యం అక్కడ వుంటూ కూడా అమ్మను విడిచి క్షణం కూడా వుండేవాళ్ళు కాదు. మళ్ళీ కాసేపట్లో బయట వూళ్ళ నుంచి జనం రోజంతా వస్తూనే వుండేవాళ్ళు. వాళ్ళకు అనుకూలం గా వుండటం కోసం వాళ్ళు వచ్చే లోపల వీలైనంత వరకు అమ్మ దగ్గర వుండాలని తాపత్రయం. ఇక మహిళా మండలి ముఖ్య సభ్యులు (అమ్మ స్నానం చేయించి వాళ్ళు 5-6 గురు మాత్రం) మళ్ళీ అమ్మ దగ్గర వుండేందుకు సమయం దొరుకుతుందో లేదో నని కనీసం

రెండు మూడు గంటలు అమ్మకు స్నానం చేయించేవారు. వారిదంతా శ్రీకృష్ణుని గోపికల స్థితిగదా. తల్లి అనేక లక్షల మందికి మాతృవాత్సల్య ప్రేమామృతాన్ని చవి చూపించింది. ఒక సోదరుడు అమ్మ పాదాల్ని స్పృశిస్తూ "అమ్మా ! యివి బ్రహ్మ కడిగిన పాదాలు కదమ్మా" అయితే "మీరంతా బ్రహ్మలు కాకపోతేగా" అంటూ తను అన్న "ధ్యాసే ధ్యానం" అన్న సూక్తిని స్ఫురణకు తెచ్చింది. తల్లి ధ్యాస అంతా తన బిడ్డలపై కేంద్రీకరించి వుండటం. ధ్యానం కదూ ! అన్న సత్యాన్ని తను అనకుండా మనకు జ్ఞప్తికి తెచ్చింది. అంతేకాదు అనేక సందర్భాలలో నిజంగానే పూజ చేసింది అని మనకు అనిపించడంలో యెంతో ఆనందం వుంటుంది. అలాంటి సందర్భాలల్లో సంక్రాంతి పండుగ ముఖ్యం.

ధనుర్మాసమంతా అమ్మ ఒక్కొక్క రోజు ఒక్కొక్క నివేదనను స్వీకరించి తన చేతులతో ప్రతి ఒక్కరికి ప్రసాదాన్ని పెట్టేది. అమ్మ చేతి గుప్పిట చాలా బుజ్జిగా వుంటే పెట్టే ప్రసాదం కానీ, అన్నం కానీ అందుకున్న మన దోసిళ్ళు సరిపోయేవి కావు. దోసిట్లో వున్న ప్రసాదాన్ని తినటం యెటునుంచి ప్రారంభించాలో చేతకాక మూతి అంతా అయ్యేది. దద్యోజనం తినేటప్పుడు చాలా యెక్కువగా అయి ఒకళ్ళను చూసి మరొకళ్ళు విపరీతంగా నవ్వుతుంటే అమ్మ కూడా మా నవ్వులలో భాగం పంచుకునేది. అక్కడున్న వాళ్ళంతా తమ అదృష్టానికి మురిసిపోయేవాళ్ళు.

ఇక సంక్రాంతి పర్వదినం రోజు (ధనుర్మాసం చివరి రోజు) ఆవరణంలోని అక్క చెల్లెళ్ళంతా గడచిన భోగి దినాన అన్ని రోజుల లాగే గొబ్బెమ్మల నలంకరించి చుట్టూ గొబ్బి పాటలతో ప్రదక్షిణం చేసేవారు. వాటితో చేసిన పిడకలతో భోగిమంటల కార్యక్రమంలో పాల్గొనేవారు. ధనుర్మాసం ఉదయాల్లో హరిదాసు వేషంలో హరిదాసుగారు అమ్మ మందిరం దగ్గరకు వస్తే, అమ్మ కొత్త బియ్యం భిక్షగా పోసేది. ఇక సంక్రాంతి రోజున అక్కయ్యలు వేసిన ముత్యాల ముగ్గుల రంగులు అందాలు చూడటానికి రెండు కళ్ళు చాలవు.

సంక్రాంతి పర్వదినపు చివరి ఘట్టం ఆ రోజు సాయంత్రం. అందరూ యెదురు చూసే సమయం. మధ్యాహ్నానికి అమ్మ, నాన్నగార్లకోసం పూలదండలు బిడ్డల ఆశీర్వచనాల కోసం షుమారు ఒక లారీపైగా బంతి, చేమంతి, కనకాంబరాలు, తామ్ర నాణెములు (రాగి కాసులు, దమ్మిడీలు) రేగిపండ్లు అన్నీ ఆవరణానికి చేరుకునేవి. ఆ రోజుజిల్లెళ్ళమూడిలో వున్న ప్రతి ఒక్కరూ, ఉదయం కుంకుళ్ళతో తలంట్లు పోసుకునేవారు. ఆవరణ అంతా కళకళలాడుతూ వుండేది. ఇక సాయంత్రం

1000–1500 మంది వరకు జనం అందరింటి ముందు వరుసలు తీరి కూర్చునేవారు. 5 గంటల కల్లా అమ్మ నేటి అలంకార హైమ మందిరం ఆనాటి 'విశ్వజనని రమ్య మందిరం' నుండి గంభీరత మిళితమైన చిరునవ్వులతో– ప్రశాంతవదనంతో నాన్నగారి నివాసం (ప్రస్తుతం లలితాంబ అక్కయ్య నివాసం) వైపు (అందరింటికి) బయల్దేరేది. ముందు రెండు లైన్లలో అటూ యిటూ పెద్ద బుట్టలతో గోవిందరాజుల దత్తుగారు, యోగయ్య గారు, మన్నవ ప్రసాదు, మన్నవ భూషిమామయ్య తదితరులు సంక్రాంతి భోగిపళ్ళు, పూలతో, జేగంటలతో అమ్మ నామం చేస్తూండగా పరివారమంతా నాన్నగారి నివాసానికి జేరే వారు. అక్కడ మన నాన్నగారు, మనల్నందర్నీ కన్నతల్లి అనసూయేశ్వరి జీవిత భాగేశ్వరుడైన నాగేశ్వరులను పుష్పాలంకృతులను చేసి, పాదపద్మాలకు భోగిపళ్ళు, పుష్పాలు సమర్పించి నమస్కరించేది. ఆ పూవులు తన శిరస్సుపైన చల్లుకుని వాటన్నింటిని అక్కడ వున్న పూబట్టలో కలిపేది. నెమ్మదిగా బయటకి వచ్చి వరుసల్లో కూర్చున్న బిడ్డల్ని చిరునవ్వులతో చూసేది. దాంతో అక్కడున్న వారంత సంతోషంతో, అమ్మని త్వరగా రమ్మని చేతులు వూపేవారు. బిడ్డల సంతోషాన్ని చూసి కదిలిన మాతృమూర్తి చిరునవ్వుల గాంభీర్యం చూసి, భూమాత కన్నులు ఆనందాశ్రువులతో చెమర్చి వుండవచ్చునేమో ! మన అమ్మ ఒక ప్రక్క నుంచి ప్రారంభించేది. ప్రతి బిడ్డ దగ్గరకూ వెళ్ళి కుంకుమ బొట్టుతో అలంకరించి, హారతి యిచ్చి, తలపైన పుష్పాలు, రేగిపళ్ళు నాణాల కలిపిన వన్నీ బిడ్డల శిరస్సుపై చల్లుతూ ముందుకు కదిలేది. ఇలా అక్కడ వున్న ప్రతి ఒక్కరికి అమ్మ ఆశీస్సుల పుష్పాలు చల్లేది. ఎవర్నీ విడవడం అంటూ లేదు. అమ్మకు పుష్పాలు అందించేందుకు వరుసగా బుట్టలతో నుంచునే వారు. అందిన వాళ్ళందరూ రాగి నాణాల కోసం వెతుక్కొనే వారు. ఇంకా అమ్మ తమ దగ్గరకు రావలసిన వారు ఆనందంతో కేకలు పెడ్తూండే వాళ్ళు. ఆదంతా సంబరం ఆనంద సంబరం. ఆ అదృష్టం పంచుకోడానికి దివి నుండి భువికి యే దేవతలు వచ్చారో యెవరికి తెలుసు ! ఈ భూగోళంలో అన్నం, విద్య కరువైన యీ కుగ్రామం పుణ్యక్షేత్రంగా, అన్నపూర్ణేశ్వరి నివాసంగా మారడానికి కారణం తన చిన్ననాటి 5–6 సంవత్సరాల వయస్సులో కలిగిన అమ్మ సంకల్పమేగా మరి ! అందరూ మాతృపూజ చేస్తూంటే అమ్మ శిశుపూజ చేస్తూ బిడ్డల్లో మాధవత్వం చూస్తూ "అమ్మా! ఇవి బ్రహ్మ కడిగిన పాదాలు కదమ్మా!" అంటే అమ్మ తడుముకోకుండా వెంటనే "నాన్నా! మీరు బ్రహ్మలు కాకపోతే కదా" అంటూ మనలోని బ్రహ్మ పదార్థాన్ని మాధవత్వాన్ని ఆరాధించిందంటే మరి అమ్మ పాదాలో– ?

ప్రేమించటమే హైమకు తెలుసు

ఆధ్యాత్మిక విషయాల్లో ఏ విధమైన ఆలోచన, అవగాహన లేని పరిస్థితుల్లో అనుకోకుండా అమ్మ ముందు ఉన్నాను. హైమను నా ముందు ఉంచింది 1961లో. హైమ నాకన్నా ఒక సంవత్సరం చిన్నది. అమ్మ నన్ను దగ్గరకు తీసింది. హైమకు నేను దగ్గరయ్యాను. ఇక నాకు వేరే ప్రపంచం లేదు. 1967 వరకు కలిసి వున్నాము. 1968లో నన్ను ఈ సకల ప్రపంచాన్ని విడిచి అమ్మలో ఐక్యమైంది. నేడు హైమవతీ దేవి పాదాల ముందు కూర్చుని నిశ్శబ్దంగా నా బాధని విన్నవించుకోవటం తప్ప నివేదనకు నా దగ్గర యేమీ మిగుల లేదు. హైమమ్మ అందరిని ప్రేమించి దగ్గరకు తీసింది. అందులో కొద్దిమంది చాలా దగ్గరయ్యారు. ఆ అదృష్టవంతుల్లో నన్ను కూడా ఒకణ్ణి చేసింది.

ఆ రోజుల్లో నేను జిల్లెళ్ళమూడి వెళ్ళే ముందుగానే ఉత్తరం రాసేవాణ్ణి. నేను 7వ మైలు వంతెన దగ్గర దిగగానే, తను మేడ మీద (ప్రస్తుతం ధ్యానమందిర ప్రదేశం) యెండలోనే నించుని చూస్తూనే ఉండేది. నేను రెండవ ఒరవ (ప్రస్తుతం కాలేజి ఉన్నచోట దగ్గరకు రాగానే తను నడిచి అంతవరకు వచ్చి వూళ్లోకి నాతోపాటు వచ్చేది. ఈ లోపల ఎన్నో కబుర్లు చెప్పేది. చెయ్యి పట్టుకొని అమ్మ దగ్గరకు తీసుకొని వెళ్ళేది. (నాన్నగారు హైమతో 7వ మైలు దిగిన వాడు ఇక్కడి రాకుండా, నిన్ను చూడకుండా యెక్కడికీ పోడు. అంతసేపు ఎండలో నుంచోవడం దేనికి ?" అని సున్నితంగా మందలించేవారు). దేవాలయం - పునాదుల దగ్గర స్నానం చేస్తుంటే దగ్గర నుంచి యెన్నో కబుర్లు చెప్పేది. భోజనం చేస్తుంటే ప్రక్కనే కూర్చుని కబుర్లు చెప్పేది. దేవాలయం పునాదుల దగ్గర రాత్రి 12 గంటలవరకు చాలా కబుర్లు చెప్పుకొని తర్వాత ఒకే చోట పడుకొనే వాళ్ళం. నిరంతరం నా గురించి ఆలోచించేది (ట). కొన్నాళ్ళు పర్చూరులో మా యింట్లో ఉన్నది. అమ్మ, నాన్నగార్ల అనుమతితో, మా పెద్ద అన్నయ్యగారి వివాహ సందర్భంలో హైమ మాతో కూడా తణుకు, పొడగట్లపల్లి (తూర్పు గోదావరి జిల్లా) తీసుకు వెళ్ళాం. ఎప్పుడూ నా దగ్గరే ఉండేది. మా అమ్మగారిని "అమ్మా" అని పిలిచేది. అలా యెవర్నీ, ఎప్పుడూ పిలువలేదు అని "అమ్మ" రెండు మూడుసార్లు అన్నట్లు నాకు గుర్తు. ఎన్నోసార్లు దేవాలయం పునాదుల దగ్గర కూర్చున్నప్పుడు, అమ్మ పాటలు

పాడేది (రాజు బావ రాసినవి). ఇలా రాయాలంటే అనేకం, మా యిద్దరికి మధ్య సాన్నిహిత్యాన్ని చూచి కాలానికి కన్నుకుట్టింది.

రకరకాల కారణాలు చోటు చేసుకున్నాయి. నాకుగా నేనే హైమను దూరం చేసుకున్నాను. మాట్లాడటం మానేశాను. జిల్లెళ్ళమూడిలో పొలం పని చేసుకొనే రోజుల్లో "రాధన్నయ్యా ! నాతో మాట్లాడవా" అంటూ వెంట పడేది. అన్నింటిలోనూ సున్నితమే.

అంతకాలం హైమతో కలిసి వున్న నాకు నేటికీ, హైమ స్వరం గుర్తుగా యీ మాటే మిగిలింది. ఆ దేవతామూర్తి ముందు అల్ప మానవుణ్ణి నేనెంత ? హైమకు ప్రేమించటం ఒక్కటే తెలుసు. హైమ క్షీర శిలావిగ్రహ ప్రతిష్ఠ సమయంలో అక్కడకి వచ్చిన బాల అక్కయ్య నాతో అంది (బాల అక్కయ్య ప్రస్తుతం హైదరాబాద్‌లో వున్నారు. కీ.శే. వల్లూరి మోహనరావు గారి శ్రీమతి. హైమ తనుగా తన జీవితంలో యెంతో ప్రేమించి, తన కష్ట సుఖాలు చెప్పుకున్నది ఈ అక్కయ్యతోనే). "రాధా ! హైమ తన జీవితంలో యెన్నో కష్టాలు సహించింది. తన యీ జీవితం సమాప్తం చెయ్యమని" అమ్మతో యెన్నో విధాలుగా వేడుకుంది. ఆనాడు హింసించిన వారు నేడు పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నారు" అంది. నాలో నేను నవ్వుకున్నాను. హైమ జీవితంలో యెంతో మంది పరిచయమైన వ్యక్తులు ఉండవచ్చు. హైమను వారి వారి పద్ధతులలో హింసించి ఉండవచ్చు. బాల అక్కయ్య నేటికీ అన్ని విషయాలు తన గుండెల్లో దాచుకుంది. హైమ అన్నీ నవ్వుతూ సహించింది. ఆ తల్లి కూతురేగా, తాము దహించుకుపోతూ ప్రపంచానికి చల్లదనాన్ని యిచ్చే స్త్రీ మూర్తులు. "నువ్వు యెక్కడ వున్నా నేను నీ ప్రక్కనే వున్నాననుకొని హాయిగా ఉండు నాన్నా" అన్న అమ్మ! "రాధన్నయ్యా ! నాతో మాట్లాడవా ?" అన్న హైమమ్మ నిరంతరం నా ప్రక్కనే ఉన్నారు అనుకోవడంలో నాలో సందేహానికి తావులేదు.

చాలాసార్లు నేను, హైమ, బాల ఒకేచోట కూర్చుని అనేక విషయాలు మాట్లాడుకునే వాళ్ళం. నేను తరచు బాల వాళ్ళింటికి వెళ్తుండేవాణ్ణి. అక్కడ మా కబుర్లు అమ్మ, హైమల గురించే. 31 డిసెంబర్ 2000 సంవత్సరం ఉదయం11 గంటలకు అన్నాను "బాలా ! హైమకు నేనంటే చాలా కోపం, నేను తనతో చాలా కాలం మాట్లాడలేదు కదా" అన్నాను "లేదు రాధా ! నాకు తెలిసినంత వరకు నిన్ను ప్రేమించి నంతగా ఎవర్నీ ప్రేమించలేదని నాకు తెలుసు" అని బాల చాలా విషయాలు చెప్పింది. "లేదు

బాలా. నీవన్నది నిజమే అయితే మనం మాట్లాడుతున్నవన్నీ తను వింటోంది కదా. నాకు యీ ఉద్యోగం యిష్టంలేదు. 24 గంటల్లో నేను నా కంపెనీ లోంచి బయటకు వచ్చేయాలి. అలా చెయ్యమను. నువ్వు చెప్పింది నమ్ముతాను" అన్నాను. మర్నాడు 1 జనవరి 2001. ఆఫీసుకు వెళ్ళి మా డైరెక్టరు కోసం ఫోన్ చేశాను. ఆయన అదే రోజు పొద్దున్న ఫ్లైట్‌లో హైదరాబాదు వెళ్ళారు అని చెప్పారు. ఇంకో అరగంటలో ఆయన ఆఫీసుకు వచ్చారు. నేను నా నిర్ణయం ఆయనకు చెప్పి రిజిగ్నేషన్ ఇచ్చి ఆ రోజే రిలీవ్ చేయమని అడిగితే చాలా సేపు మాట్లాడిన తర్వాత ఆయన సరేననటం నేను బయటకు రావడం జరిగింది (అంటే 24 గంటలలోనే). కానీ యిలాంటి సంఘటనలు ఆధారం చేసుకొని మాత్రం కాదు నేను, అమ్మను, హైమను చూసి, దగ్గర అయి యింతకాలం మనస్సులో ఆరాధిస్తోంది. వారిద్దరూ ప్రేమతత్వంతో, విచక్షణారహితమైన విశ్వప్రేమతో అందరితో పాటు, నన్ను కూడా దగ్గరకు తీసుకున్నారు.

హైమకు ప్రేమించటమే తెలుసు. పరిసరాల్లో వున్న ప్రతి చెట్టునూ ప్రేమించేది. మా యింటి నుంచి వెళ్ళే సమయంలో ప్రతి చెట్టు దగ్గరకు వెళ్ళి "నే వెళ్తున్నాను" అని చెప్పి బయల్దేరేది. భగవద్గీత అంటే చాలా యిష్టం. భరద్వాజ గారు పరిచయం అయిన తర్వాత షిర్డీ శాయిబాబా చరిత్ర కూడా పారాయణ చేసేది. ఎవరైనా అనారోగ్యంతో వున్నారని తెలిస్తే వారి ఆరోగ్యం కోసం జపం చేసేది. కొన్ని సందర్భాల్లో అమ్మ దగ్గరకు వెళ్ళి చెప్పేది. మళ్ళీ వారు ఆరోగ్యంగా వున్నారని తెలిసేంత వరకు నిరంతరం ఆలోచిస్తూ ఉండేది. తన వరకు అమ్మ దగ్గరకు వెళ్ళి యెవరికీ తాను యే సేవ అందించలేక పోతున్నానని బాధపడి తనను అమ్మలోకి ఐక్యం చేసుకోమని ప్రాధేయపడేది. మొదట నుంచీ వున్న అనారోగ్యం క్రమేపీ యెక్కువైంది. 1968 లో షిర్డీ వెళ్ళి బాబా గారిని దర్శించింది. తర్వాత కొంతకాలం ఔరంగాబాదులో వుండి, హైదరాబాదులో కొన్ని రోజులు ఉండటం, తర్వాత అమ్మ దగ్గరకు వెళ్ళడం జరిగింది. అనారోగ్యం తీవ్రత యెక్కువైంది. చివరకు ఏప్రియల్ 5, 1968 న హైమమ్మ సకల సోదరీ సోదర ప్రపంచాన్ని వదలి అమ్మలో ఐక్యమై హైమవతీ దేవిగా హైమాలయంలో, అమ్మచే ప్రతిష్ఠించబడింది. అందరి మనస్సుల్లో నిలిచింది.

నేను హైమకు దూరమై అమ్మను బాధపెట్టానో, హైమను బాధపెట్టానో, నన్ను నేను బాధలోకి నెట్టేసుకున్నానో ? భాగవత సిద్ధాంతం ప్రకారం ప్రేమతోనే కాదు

విరోధంతో కూడా భగవంతుని చేరవచ్చునట - నా ఇష్టాయిష్టాలతో పని లేకుండా అమ్మ నా వెంట ఉంటానన్నది. నాకు ఈ శరీరాన్నిచ్చిన కన్నతల్లికి అందరినీ కన్నతల్లి యిచ్చిన హామీ యిది. ఇక హైమను వదిలి నేను భౌతికంగా దూరంగా ఉన్నాను కాని నన్ను వదలి హైమ ఎక్కడున్నది ? నా ఊహలలో ఎప్పుడు ఉన్నది. తన ఆలోచనలతో, ఆప్యాయలతో నేనెప్పుడూ ఉన్నాననే దాఖలాలున్నాయి. మాది విడదీయరాని బంధం.

నేనంటే హైమకు ఎంతో ప్రేమ

ఆంజనేయులు గారూ !

1961 జూన్‌లో అమ్మను చూడటానికి మా కుటుంబం. అంతా జిల్లెళ్ళమూడి వెళ్ళాం. అది నాకు మొదటిసారి. వచ్చిన రెండో రోజున హైమను ఆవరణంలో చూశాను. ఎవరో తెలియదు. పరిచయం లేదు. నన్ను చాలా ఆకర్షించింది. ముఖ్యంగా పాదాలకి వెండి గజ్జెలు. నడుస్తూంటే చక్కటి ధ్వని. ఆవరణలో లక్ష్మీదేవి తిరుగుతున్నట్లుంది. శాస్త్రిని అడిగేను "యీ అమ్మాయి ఎవర్రా ?" అని "అదేంట్రా ! నీకు తెలియదా, మన సుబ్బారావు చెల్లెలు, అమ్మగారి అమ్మాయి" అని చెప్పాడు. హైమను పిలిచి "వీడు మా తమ్ముడు" అని పరిచయం చేశాడు. హైమ, ప్రశాంతంగా నవ్వుతూ "ఏం పేరన్నయ్యా" అంది తలవంచుకుని చెప్పాను నా పేరు రాధ" అని. అంతే అప్పటి నుంచి నేనంటే చాలా శ్రద్ధ చూపించేది. "స్నానం చేశావా అన్నయ్యా" కాఫీ తాగేవా, అన్నం తిన్నావా" అని నా దగ్గరే వుండేది అన్నం తింటూంటే. ఆ రోజుల్లో నేనున్న పరిస్థితులల్లో నాకు హైమ దగ్గర చాలా హాయి, శాంతి లభించాయి. ఆ విధంగా, అమ్మ దగ్గరకి వెళ్ళిన మూడోసారి మా అమ్మగారిని అడిగాను "హైమను మనింటికి తీసుకెళదామా అని మా అమ్మగారు, అమ్మని నాన్నగార్ని అడిగి అనుమతి తీసుకున్నారు. మీకు తెలుసు, హైమ మా యింట్లో వుండటం పరుచూరులో. ఆ రోజుల్లోనే మా పెద్ద అన్నయ్య పెళ్ళి సందర్భంలో, మాతో, తనను, పొడగట్లపల్లి తీసుకు వెళ్ళాం. నాకు యిప్పటికీ బాగా గుర్తు. నేను, హైమ, మా బంధువుల్లో ఇద్దరం గుర్రపు బండిలో వెళ్తున్నాం. ఒక ఆయన నన్ను చూస్తు వెకిలిగా "ఏంటీ ఈ అమ్మాయి కూడా, అమ్మగారంత అవుతుందా ? నువ్వు యీ అమ్మాయిని కూడా పూజ చేస్తావా ? అని. "ఆరోజు వస్తే నేనేంటి, మా అమ్మాయిని నీవు కూడా పూజ

చేస్తావు" అన్నాను నేను (హైమకు ఆలయం వుందని తెలిసికూడా, ఆయనకు చూసే అదృష్టం లేదు యీ రోజు కూడా!).

ఆంజనేయులుగారూ ! మీ అందరికీ తెలుసు హైమ మనస్తత్వం. తనకు తెలిసినా తెలియకపోయినా, ఎవరైనా కష్టాలలో వుంటే, వారి సుఖం కోసం, నివారణ కోసం నిత్యం పూజలు చేసేది. జిల్లెళ్ళమూడి ఎవరైనా వస్తే తనకు తెలిసి రాలేకపోయిన వారి కష్టసుఖాలు విచారించేది. వికాలంగుల విషయం సరేసరి. ప్రతీరోజూ వారి క్షేమ సమాచారాలు విచారించేది. నా దగ్గర యివే కబుర్లు. నాకు చాలా సార్లు చెప్పేది. "అన్నయ్యా ! నీవు కూడా అమ్మనామం నిరంతరం చేస్తూండు" అని అక్కడికి వచ్చే వారికి, హైమలో ఏదో ప్రత్యేకత కనిపించేది. "ఈ అమ్మాయి అమ్మగారి అమ్మాయా? అమ్మగారు తన శక్తులు యీ అమ్మాయికి యిస్తారా !" అని యేవేవో అడిగేవారు. యెవరికి తోచినట్లు వాళ్ళు. హైమకు అందరూ సమానమే. అయినా కొందరంటే చాలా శ్రద్ధ చూపించేది ఆ అదృష్టం నాకెందుకిచ్చిందో అమ్మ ? మరి. మీకు తెలుసు, నేను ఎక్కువ కాలం హైమ దగ్గరే వుండేవాణ్ణి. (40 సంవత్సరాల నాటి విషయాలు యివన్నీ. ఎలా రాయను!) రాయాలంటే చాలా విషయాలున్నాయి. చాలా సంక్షిప్తంగా రాస్తున్నాను. మీకు కూడా గుర్తు. మీరు కవితలు వినిపిస్తూంటే హైమ చాలా ఆనందించేది. "ఆంజనేయులు అన్నయ్య వస్తే బావుణ్ణు" అనుకునేది చాలాసార్లు (మీరు వస్తే ఎవరికి ఆనందంగా వుండదు ?) మీ కవితలన్నా, సిరిగిరి సుబ్బారావు (పుట్టుగ్రుడ్డి) లక్ష్మీ నృసింహ స్తోత్రం, అన్నా, తనకు చాలా యిష్టం. మేం పరుచూరులో వుండే రోజుల్లో, సిరిగిరి సుబ్బారావు, ప్రతిరోజూ, మా యింటికి వచ్చి లక్ష్మీ నృసింహ స్తోత్రం చేస్తూంటే, హైమ చాలా ఆనందంతో శ్రద్ధగా వినేది. హైమ మానసిక ప్రాంగణంలో నాకు తెలిసినంత వరకు అత్యంత సన్నిహితులు, రాజు బావగారు, వేటపాలెం శేషు, కిష్టు, రవి (రవి అల్లరి వల్ల భయం కానీ ఆనందించేది. నేను హైమ కూర్చుని వుంటే, రవి అనేవాడు "రాధా! నీకు ఛాన్సు మళ్లీ దొరుకుతుందో లేదో, యిప్పుడే పూజ చేసుకో ఈ చిన్మాతని" అని), మీరు, తంగిరాల కేశవశర్మగారు, వల్లూరి మోహనరావు, బాల, జానకి, అడవుల దివీ నుండి మధు, శ్రీరామమూర్తి గారు, ప్రసాదు, పొత్తూరి వెంకటేశ్వరరావు గారు, తంగిరాల శాస్త్రి యింకా నాకు తెలియని, గుర్తు రాని వారు యింకెందరో వున్నారు. వీళ్ళందర్ని తరచూ, యేదో ఒక సందర్భంలో గుర్తు చేసుకుండేది.

అమ్మ జన్మించిన వెంటనే, అమ్మలో ఐక్యమైన ప్రాణుల్లో ఒక తేలుకూడా ఉంది. హైమ విషయంలో చిన్న సంఘటన వుంది. నాన్నగారి పోస్టాఫీసు పాకని ఆనుకుని శిథిలమవుతున్న యింకో పాక వుండేది. ఆ పాకలో నేను, హైమ కూర్చునేవాళ్ళం. బాల అక్కయ్య నాకు హైమకు, అన్నం వండి పెట్టేది. ఒక రోజు (వర్షాకాలం) సాయంత్రం నుంచి వానమొదలైంది. రాత్రి అన్నం తిని అక్కడే చాపలు పరచుకొని పడుకున్నాం. కబుర్లు చెప్పుకుంటూ నేను, బాల, హైమ. ఇంతలో హైమ "రాధన్నయ్యా ! వేలు మీద తేలుకుట్టుంది' నెమ్మదిగా అంది. అంతా చీకటి. లైటు లేదు. "మళ్ళీ కుట్టి నట్లుంది" అది మూడోసారి. నేను ఆదుర్దాతో వర్షంలోనే అమ్మ యింటికి వెళ్ళి విషయం చెప్పాను. రామకృష్ణ అన్నయ్య వెంటనే వచ్చి హైమను భుజాన వేసుకుని అమ్మ ఇంటి ప్రక్కన వున్న మందిరంలో మంచం వేసి పడుకోబెట్టారు. అమ్మ వచ్చి హైమను ఒళ్ళో పడుకో పెట్టుకుంది. మూడు వేళ్ళు బాగా కమిలిపోయి వున్నాయి. అమ్మ చాలా సార్లు చెప్పింది. "ఏడువమ్మా ! బాగా ఏడ్చేయ్ బాధ తగ్గుతుంది" అని హైమ నిశబ్దంగా వుంది. ఆ రాత్రంతా జాగారం. ఆధరాపురపు శేషగిరిరావు గారు హోమియోమందు లిచ్చారు. రెండు రోజులకి నెమ్మదిగా తగ్గింది. తేలుకుట్టినప్పుడు నేను చంపడానికి ప్రయత్నిస్తుంటే "అన్నయ్యా వాటి దారికి నా వేళ్ళు అడ్డం వచ్చాయేమో! వాటిని ఏమీ చెయ్యద్దు" అంది హైమ. ఆ తల్లి కూతురేగా !

తర్వాత నేను జిల్లెళ్ళమూడి నివాసం పూర్తి చేసుకుని హైదరాబాదు వచ్చేశాను (1967). తర్వాత హైమ ఔరంగబాద్, షిర్డీ ప్రయాణంలో హైదరాబాదులో మా యింటికి వచ్చింది. రాత్రి యింటికి వచ్చి భోజనం చేసి ఆరుబయట మంచంమీద పడుకుని దుప్పటి కప్పుకున్నాను. బయట హైమ మాట వినిపించింది. "కృష్ణ వేణమ్మక్కయ్యా ! యీ పడకకుర్చీ రాధన్నయ్య మంచం ప్రక్కగా వెయ్యి". దుప్పటి ముసుగులోంచి, పక్కనే పడకుర్చీలో కూర్చున్న హైమను చూశాను (చాలా కాలం తర్వాత). ఆ తర్వాత రెండు మూడు రోజుల్లో హైమ, రవి, వాళ్ళంతా షిర్డీ ప్రయాణంలో వెళ్ళిపోయారు. నాకు (బాధతో) అమ్మను చూడాలనిపించి అమ్మ దగ్గరకు వెళ్ళి రెండు రోజులున్నాను. మూడో రోజు పొద్దున్న 11 గంటలకు అమ్మ దగ్గర బొట్టు పెట్టించుకుని బయల్దేరుతూంటే అమ్మ వసుంధరతో "రాధకు అన్నం పెట్టి పంపించమ్మా" అంది. అందరింట్లో చివరి పోర్షన్‌లో నాన్నగారికి వంట చేసి పెట్టేది. నాకు పీట వేసి అన్నం వడ్డించింది. పీట మీద కూర్చున్నాను. అంతవరకూ ప్రశాంతంగా వున్న మనస్సులో

అలజడి ప్రారంభమై లోపలనుంచి దుఃఖం పొంగింది. అన్నం అంతా కళ్ళనీళ్ళలో తడిసిపోయింది. ఏడుపు పైకి వచ్చేసింది గట్టిగా పైకి ఏడుస్తూ అన్నం తినే చేత్తోనే వెనకాలే వున్న గొడ్ల కాష్ఠంలోనే విల విల యేడుస్తూ గడ్డిలోనే నిద్రలోకి వెళ్ళాను. మధ్యాహ్నం 2 గంటలకి మెళుకువ వచ్చి, లోపలికి వచ్చి ప్రయాణం మానుకుని వసుంధర దగ్గరే కూర్చుని, సాయంత్రం నెమ్మదిగా అమ్మ దగ్గరకు వెళ్ళాను. అమ్మ దగ్గర కాఫీ తాగాను. నా ప్రయాణం గురించి అమ్మ నన్నేమీ అడగలేదు. మర్నాడు 10 గంటలకు మళ్ళీ అమ్మ దగ్గరకు వెళ్ళాను. రెండోరోజు కూడా అదే విధంగా జరిగి ప్రయాణం మానుకున్నాను. నాలో యింత దుఃఖం రావడం సాధ్యమా అనిపించింది). మూడవ రోజున "వసుంధరా ! రాధకు నేను అన్నం పెడతానమ్మా ? యివాళ అంది. వసుంధర తెస్తే, అమ్మ పాకయింటి వెనుకభాగంలో. అన్నం కలిపి యెంతో ఆప్యాయంగా తినిపించింది. చేతులు, మూతికడిగి చీర కొంగుతో తుడిచింది. పాదాల దగ్గర అలాగే కూర్చున్నాను. నిశ్శబ్దంగా వుంది. ఎవ్వరూ లేరు.

అమ్మ : (ప్రశాంతంగా, నన్ను వొళ్ళోకి తీసుకుని, వీపు నిమురుతూ, నా తలయెత్తి, "నెలవంక బొట్టు పెడుతూ), వెళ్ళిరా నాన్నా! (అమ్మ చాలా బాధగా కనిపించింది).

అమ్మ పాదాలు చూస్తూ పది నిమిషాలు తర్వాత లేచి బయటకు వచ్చి, వసుంధరకు చెప్పి బాధతో ఏడవ మైలు వైపు నడిచాను. హైమను తర్వాత యెప్పుడూ చూడలేదు. అమ్మలో జేరిన హైమను జూడటానికి వచ్చిన రోజు తప్ప (ఆరోజు విశేషమే) తర్వాత యేం జరిగిందో నాకు తెలియదు, నేను నా నోటితో ఎవ్వరినీ ఏం జరిగింది అని అడుగలేను కనుక. అమ్మ నన్ను ఆ వాతావరణానికి విచిత్రంగా చాలా దూరంగా వుంచింది (మానసికంగా).

హైమ, దేవతగా ఆలయంలో వుంది. అందరితో బాటూ, నేనూ ప్రదక్షిణాలు చేస్తున్నాను. హైమకు నేనంటే యెంతో ప్రేమ, వాత్సల్యం అని నాకు తెలుసు. ఇదంతా నాకు కోటి జన్మల సుకృతం. కరుణించి, హైమ, అకస్మాతుగా ప్రత్యక్షమయితే, అంత అదృష్టమా ? ఏమో !

(ఏనాడో కలలో వినిన ధ్వని నా మనస్సులో సంచరిస్తూనే వుంటుంది".)

ఇదేంటమ్మా! యిట్లా చేశావు ?

ఇదేంటమ్మా ! యిట్లా చేశావు ? నా వల్ల ఏ అపరాధం జరిగింది ? అభిషేకాల మధ్యలో ఆపి, వెనక్కి పంపిస్తున్నావు. అప్పటికీ రెండు రోజుల క్రితం (23 డిసెంబరు) మధ్యాహ్నం నీ దగ్గరకు వచ్చి విన్నవించుకున్నాను. "అమ్మా ! అభిషేకాలు ఆగిపోతున్నాయిని భయంగా వుంది. కారణం తెలియటం లేదు. నా వల్ల యేమయినా పొరపాటు వుంటే క్షమించు అని అయినా మేమంతా మనుష్యులం. పొరపాట్లు, పాపాలు చెయ్యకుండా యెట్లా వుంటాం ? నేను కూడ మనిషినేగా. అభిషేకాలు ప్రారంభించక ముందే నా ఆరోగ్యం బాగాలేక పోవడం, పూజారి రామకుమార్‌శర్మ వివాహం కూడా అంతే ముఖ్యం కనుక ప్రస్తుతం వీలు కుదరదనుకొని రమేష్‌తో బాపట్ల నుంచి రిటర్న్ టిక్కెట్ తెప్పించుకుని నీకు చూపించాను. 24 గంటల్లో అన్నీ వీలుగా వుంటేనే అభిషేకాలు ప్రారంభిస్తాను అని చెప్పేను. నీవు నా ప్రతి ఒక్క మాట వింటావని నా విశ్వాసం. మర్నాటి రోజునే నా ఆరోగ్యం చాలా హాయిగా వుంది. రామకుమార్ నా దగ్గరకు వచ్చి, తన వివాహానికి కొంచెం టైం పడుతుంది అని చెప్పడంతో టిక్కెట్ క్యాన్సిల్ చేయించి, నీకు జరిగిదంతా చెప్పుకొని అభిషేకాలు ప్రారంభించాను. ఆరోజు యెంతో సంతోషంగా అభిషేకాలు చేశాను. మొత్తం 42 రోజులు. ఈ మధ్యలో ఆవరణలో కాలేజీ పిల్లల వసతుల విషయంలో చిన్న సమస్యలు వస్తే వీలైనంత వరకు తీర్చటానికి ప్రయత్నం చేశాను. అది తప్పు కాదుగా. అయినా నేను వచ్చిన పని చూసుకోకుండా యివన్నీ నాకెందుకు ? ఈ ఆలోచన వచ్చినప్పుడు, ఏం, యెందుకు చెయ్యకూడదు. వాళ్ళు కూడా అవరణలో వాళ్లేగా అనిపించింది. అందరూ అనేవాళ్ళే "పోయిన సంవత్సరం హైమ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంలో అమ్మ నీ చేత అభిషేకాలు చేయించింది." ఈ సారి అమ్మవారి పూలతోట వేసే సందర్భంలో నీచే అభిషేకాలు చేయిస్తోంది అని. కనీసం యిందుకయినా పనికొచ్చాను కదా అని సంతోషించాను. అమ్మా ! అభిషేకాలు ఆగితే నేను తట్టుకోలేను. ప్రాణాలతో ఉండలేను అని సాష్టాంగపడ్డాను. అయినా నా పిచ్చిగాని ప్రాణం రాకడ, పోకడ నీ చేతిలోనే వుంది అని తెలిసి కూడా, యెట్లా అనుంటాను. హైమతో కూడా రోజు చెప్పుకునేవాణ్ణి– యివాళ జరిపించినట్లే, 42 రోజుల వరకు నాచే అభిషేకాలు చేయించు హైమా అని. నా ఆరోగ్యాన్ని గురించి అందరూ శ్రద్ధ తీసుకున్నారు. నాకు శ్రద్ధగా వంట

చేస్తున్నదీ లేనిదీ నేను టైముకు అన్నం తింటోందీ లేందీ, లక్ష్మణరావుగారు హైమాలయ వంట శాలలో కనుక్కునే వారు. అందరూ అనేవారు ఇక్కడ యేం తప్పులేదు. పొద్దున్నే టిఫిన్ తిని వెళ్ళు అని. ఎందుకో నాకు టిఫిన్ తిని అభిషేకాలు చెయ్యడం నచ్చలేదు. నీవు ఉన్నావు కదమ్మా ! నాకు ఎప్పుడూ హాయిగా ఉండేది. ఎప్పుడూ నీరసంగా ఉండేది కాదు. ఎప్పుడూ ఆనందంగా ఉండేది. 1961 లో నీ దగ్గరకు వచ్చినప్పటి నుండి నేటి వరకు నా బాధ్యత నువ్వు తీసుకున్నావని నాకు తెలుసు. "నాన్నా ! నువ్వు యెక్కడ వున్నా, నీ దగ్గర నేను వున్నాను అనుకొని హాయిగా వుండు" అని 1967లో నేను జిల్లెళ్ళమూడి వదిలి వస్తున్నప్పుడు అన్నావు. అలాగే చేస్తున్నావు కూడా. నా బంగారు తల్లివి కదా ! అమ్మా, నా చేత, హైమమ్మ జన్మదిన సందర్భంలో (26-11-2002) జరిగిన కోటినామార్చనలో యెంత చక్కగా సహస్రనామ పారాయణ చేయించావు. అప్పుడు కూడా ముందు రోజు నీ దగ్గరకు వచ్చి నా బాధ గురించి చెప్పాను. హైదరాబాద్‌లో ప్రతి మూడవ శనివారం రవి ఇంట్లో పూజ జరుగుతుంది. నీకు తెలుసు కదా, నేను యేదైనా పైకి చదివతే నాకు నోట్లో పళ్ళ మధ్య కరెంట్ షాక్ కొట్టినట్లుంటుంది. అందుకని పైకి చదవటం మానేసాను. ఎట్లాగో అట్లా నా చేత సహస్ర నామ పారాయణ చేయించు తల్లీ అని ప్రార్థించాను. అందరితో బాటు నేను కూర్చున్నాను. పైకి చదవాలంటే భయం. అందరూ చక్కగా చదువుతున్నారు. అదృష్టవంతులు. నేను ఏం చెయ్యను. ఇంతలో పి.యస్.ఆర్. ఆంజనేయులు గారి అన్నయ్య గారు, కుర్తాళం పీఠానికి ప్రస్తుతం అధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి వారు, లలితాకోటినామార్చన, శ్రీసూక్తహోమ ఉత్సవాలను తిలకించడానికి వచ్చారు. వారి ఉపన్యాసంలో అమ్మను గూర్చి మాట్లాడుతూ, దేవిని నిరంతరం ధ్యానం చెయ్యండి. మనసారా ఆ తల్లిని పిలవండి తప్పకుండా పలుకుతుంది అని ఎంతో ఆర్తితో చెప్పారు. అక్కడ అమ్మ ఫోటో (పెద్దది - చిరునవ్వుతో వుంచారు). అప్పటికీ నేను భయపడుతూనే, చాలా సార్లు పారాయణ చేశాను. కొంచెం సేపు కూర్చుని, కాస్సేపు నుంచుని చాలా కష్టంగా వుంది. అప్పుడు మైక్ దగ్గర కాలేజి ఆడపిల్లల బ్యాచ్ నలుగురు పారాయణ చేస్తున్నారు. అందులోంచి ఒక అమ్మాయి నా దగ్గరకు వచ్చి "అన్నయ్యా గారు టీ తాగుతారా!" అంది. "ఒద్దు" అన్నాను. తను వెళ్ళి మంచినీళ్ళు తెచ్చింది. ఈ అమ్మాయి నామాలు చక్కగా చదువుతోంది. (నాకు తర్వాత తెలిసింది, ఈ అమ్మాయి సింగుపాలెం

జానకి మేనకోడలని) అప్పటికి టైమ్ 4 గం॥ అయింది. ఎట్లాగయినా పూర్తి అయ్యే వరకు పారాయణ చెయ్యాలనిపించింది. అమ్మని అర్థిస్తూ రెండు చేతులూ జాపేను. (1967 రోజుల్లో నేను అమ్మ దగ్గర కూర్చుని రెండు అరచేతులు పాదాల దగ్గర ఉంచితే, తన రెండు పాదాలు నా అరిచేతుల్లో ఉంచేది). ఇప్పుడు ఫొటోలో నుండి అమ్మ చిరునవ్వుతో చూస్తోంది. ఇలా రెండు మూడు సార్లు చేసి చేతులు నొప్పిగా ఉండి రెండు అరచేతులూ అమ్మ ఫొటో వుంచిన బల్ల మీద వుంచాను. వెంటనే అనిపించింది చేతుల్లోకి యేదో కరెంట్ ప్రవేసిస్తున్నట్లు, వెంటనే ఆ చేతులు గుండెల దగ్గర పెట్టుకున్నాను. శరీరమంతా శక్తివంతమయింది. చాలా ధైర్యం వచ్చింది. ఇంక నేను యే భయం లేకుండా పారాయణ చెయ్యడం ప్రారంభించాను. శక్తి కొద్దీ చదువుతున్నాను. నామాలు గుండెల్లోంచి వస్తున్నాయి అనిపించింది. నాకు యింత శక్తి యిచ్చి, నాచేత లలితాసహస్ర నామ పారాయణ చేయిస్తున్నావన్న సంతోషంతో కళ్ళ నీళ్ళు వస్తున్నాయి. కొన్ని క్షణాల్లో యీ కన్నీళ్ళే నామపారాయణ చేయటానికి సమస్య అయ్యేట్లున్నాయి. మళ్ళీ నీ వైపు చూసి రక్షించమన్నాను. మనసంతా శాంతించింది నువ్వు నా ప్రార్ధన ఆలకించావు. లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణ నా చేత కూడా చేయించావు".

మరి యిప్పుడేమయిందమ్మా ! డిసెంబరు 25వ తారీకున మామూలుగా అభిషేకాలు పూర్తి చేసుకొని భోజనం చేసి పాండురంగారావుగారి ఇంట్లో, హాల్లో చాప వేసుకొని నిద్రపోయాను. ఆ నిద్రలో హార్ట్ ప్రాబ్లమ్ రావడం, సరోజిని అక్కయ్య, రాముడు అక్కయ్య, బ్రహ్మాండం శేషు, లక్ష్మణరావు గారు అదే రోజు నన్ను బాపట్ల పాప అక్కయ్య హాస్పటల్‌కు చేర్చటం, మర్నాడు లక్ష్మి, మా పిల్లలు సతీష్, కిరణ్, బాపట్ల నుంచి నీ దగ్గరకు తీసుకురావటం, నువ్వు నాకు, లక్ష్మికి బట్టలు పెట్టించి నా కన్నీళ్ళతో అక్కడి నుండి అందరి చేత వీడ్కోలు యిప్పించి, హైదారాబాద్‌లో నా యింటికి చేర్చటం, ఇవన్నీ నీకు తెలియవని కాదు యీ విన్నపం. అభిషేకాలు ఆగిపోవటం మానసికంగా నన్ను కుంగదీసింది. అందుకే యీ ఆవేదన. నా ఆరోగ్యం సక్రమంగా ఉండి మళ్ళీ నీ పాదాలకు అభిషేకాలు యెప్పుడు చేసుకుంటానా అని నిరంతరం యెదురు చూస్తున్నాను. ఇంతకంటే యెలా విన్నవించుకోను ?

❖❖❖

తంగిరాల రాధ

(విశ్వజనని, Mother & All మాసపత్రికల నుండి)

సోదరుడు తంగిరాల రాధాకృష్ణమూర్తి 1960 దశకం మొదట్లో జిల్లెళ్ళమూడి వచ్చి సేవాకార్యక్రమాలలో పాల్గొన్న అదృష్టవంతుడు. గోదావరి జిల్లా తణుకు నుండి వచ్చిన తంగిరాల సత్యనారాయణ గారు గుంటూరు జిల్లాలో జిల్లాపరిషత్ వైద్యునిగా చాలా గ్రామాలలో చేశారు. పర్చూరు డాక్టరుగా జిల్లెళ్ళమూడిలో ప్రసిద్ధులు. అంతకుముందు అప్పికట్లలో బ్రహ్మాండం సుబ్బారావు చదువుకొనే రోజులలో అమ్మ అప్పికట్ల వెళ్ళితే అక్కడ సత్యనారాయణ గారి పిల్లలు అమ్మను చూచినా సుబ్బారావు తల్లిగానే చూచారు తప్ప ఒక దైవీమూర్తిగా గుర్తించలేదు.

సత్యనారాయణ గారి కుటుంబం 1960 లో జిల్లెళ్ళమూడి రావటం మొదలైంది. రాధమాత్రం 1961లో జిల్లెళ్ళమూడి వచ్చాడు. వచ్చినరోజు హైమతో పరిచయం అయింది సుబ్బారావు చెల్లెలిగా. ఆ తర్వాత హైమ అనారోగ్యంతో ఉన్నందున పర్చూరు లోని వాళ్ళింటికి వైద్యం కొరకు తీసుకొని వెళ్ళారు. దాంతో అమ్మా, హైమలతో నాన్నగారి కుటుంబముతో వారి కుటుంబానికి సాన్నిహిత్యం పెరిగింది.

రాధ కాలేజీ విద్యాభ్యాసం గుంటూరులో జరిగింది. రాధ తల్లిగారు దమయంతి గారు నిండైన విగ్రహం. పవిత్రత రాఁసము వాత్సల్యము మూర్తీభవించిన శక్తి స్వరూపంగా ఉండేది. ఆమె కాన్సరు బాధకు చికిత్స నిమిత్తం గుంటూరులో ఉండగా నేను చూడడానికి వెళ్ళితే ఆమె నాకు రాధను అప్పగిస్తూ – " మా పిల్లల్లో వీడు చాల అమాయకుడు వీడ్ని కనిపెట్టి ఉండు నాయనా !" అన్నది. రాధ చాల అందగాడు కావటంతో చాల మంది ఆడపిల్లలు అతని మీద మోహపడేవాళ్ళు. సినిమా యాక్టరులా ఉన్నాడు అనుకొనేవాళ్ళంతా. అలా తమ ఆడపిల్లలు వెంటబడటంలో రాధ ప్రమేయం కూడా ఉంటుందని అపోహ పడ్డ కొందరు రాధ మీదకు రాగా, నివారించటానికి కావలసిన రక్షణలో నేను కూడా పాల్గొనవలసి వచ్చింది.

రాధ జీవితంలో అత్యంత ప్రధానమైన కాలం 1965-67 రెండు సంవత్సరాల కాలం. అమ్మను చూడటానికి 1965 జనవరిలో జిల్లెళ్ళమూడి వచ్చాడు. అధరాపురపు శేషగిరిరావు గారు ఆ రోజుల్లో అందరింటి నిర్వహణలో ఉన్నారు. అమ్మ మాటల సందర్భంలో ఆవరణ నిర్వహణకు మనిషి ఉంటే బాగుండు అనుకొన్నది. రాధను

వచ్చి ఉండమని బహిరంగంగా అడగలేదు – కాని రాధ హైదరాబాద్ వెళ్ళి వారం రోజులలో వచ్చి నేను ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చానమ్మా ! ఇక్కడ ఉండటానికి, నీవు ఏ పని చెప్తే ఆ పని చేస్తాను" అన్నాడు. అదేమిటిరా ! ఉద్యోగం వదిలిపెట్టితే మళ్ళీ ఉద్యోగం రావద్దా" అన్నది. దాన్ని గూర్చి ఆలోచన లేదమ్మా ! ఇక్కడ నీ వేపనిచెప్తే ఆ పని చేయటమే అన్నాడు రాధ. నీకు ఇష్టమైన పని చేయి నాన్నా ! అన్నది అమ్మ.

గారాబంగా సుకుమారంగా పెరిగినా జిల్లెళ్ళమూడిలో కుప్ప నూర్పిళ్ళల్లో, ఇటుకబట్టీ పనిలో, బొగ్గు లారీల నుండి దించటంలో, చెరువు నుండి నీళ్ళు తేవటం, జమ్ములపాలెం నుండి లారీలో ఊక నింపుకొని రావటం, లారీలో వెళ్ళి ఇసుక నింపుకొని రావటం, అందరింటి పనికి గానుగ త్రిప్పి సున్నం తయారుచేయటం వంటి కార్యక్రమాలలో చరుకుగా పాల్గొన్నాడు రాధ. భాస్కరరావన్నయ్య గడ్డితో తాడు పేనటం నేర్పితే నేర్చుకున్నాడు. మన్నవ దత్తుతో కలిసి సున్నం గానుగ త్రిప్పాడు. సింగుపాలెం తాతయ్యతో కలసి తాటాకు పందిళ్ళు వేశాడు. సాగరు గారి పిల్లలు రమణ, సావిత్రి వంటి వాళ్ళతో కలసి వరి కోతలు కోశాడు.

ఒకసారి విపరీతంగా ఎండలు కాస్తున్నాయి. కోత పనికి వెళ్ళాలి. పిల్లలు వెళ్ళకుండా అమ్మ వద్ద కూర్చుంటే అమ్మ ఏరా ? కోతకు వెళ్ళలేదేం ? అన్నది. నీవు గొడుగు ఏర్పాటు చేయమ్మా ! అలాగే వెళ్ళుతాం అన్నాడు రాధ – సరే అలాగే అన్నది అమ్మ . అంతే విపరీతమైన ఎండన్నయ్యా ! వడగాలి అని పిల్లలు వారిస్తున్నా అమ్మ చెప్పింది కదా అని బయలుదేరదీశాడు పిల్లల్ని. అంతే పదినిముషాలో మేఘాలు కమ్మి ఎండకు గొడుగు పట్టింది. చక్కగా పొలం పని చేసుకున్నారు పిల్లలు. అది అమ్మ పట్టిన గొడుగు. అమ్మ పనిచేసే పిల్లల పట్ల ఎంతో శ్రద్ధ కనబరిచేది. అమ్మ చెప్పితే డాక్టరు జ్యోత్స్న అన్నపు తట్టలు మోసుకొని పొలాలకు వెళ్ళి ముద్దలు కలిపి పెట్టిన రోజులున్నవి. పండ్లు, మిఠాయిలు ఎన్నో పంపేది అమ్మ పనిచేసే పిల్లల కోసం. క్రొత్త గడ్డితో పనిచేస్తే దురదలు వస్తవిరా అని రాధకు వేడినీళ్ళు పెట్టించి ఇప్పించేది.

ఒక రోజు బొగ్గు పనిచేసిన రాధకు జ్వరం వచ్చి వళ్ళు తెలియకుండా గడ్డి వాముల మధ్య పడి నిద్రపోతుంటే అమ్మ వచ్చి స్వయంగా పరిచర్యలు చేసిన రోజులున్నాయి. దున్నలు కట్టిన బండి తోలుకొని వస్తుంటే కాలువలో పడిపోతే రాధను,

ఎద్దులను కాపాడిన రోజులున్నాయి. రాధకు అమ్మ వద్ద ఎంతో గారాబం, ఒక రోజు మధ్యాహ్నం అలసి పడుకొని నిద్రలేస్తూ ఏదన్నా తినాలని ఉందమ్మా ! అంటే ఏం కావాలో చెప్పరా ! అంటే నీ యిష్టం ఏదైనా సరేనంటే అప్పటికప్పుడు జీడిపప్పు వేయించి పెట్టిన రోజుల్నునవి. ఈ విధంగా అమ్మ చేత స్వయంగా సేవ చేయించుకన్న భాగ్యశాలి రాధ.

పూరిపాకలోని స్నానాల గదిలో ఉన్న అమ్మ ఒకరోజు అకస్మాత్తుగా పొలంలో పనిచేస్తున్న రాధను పిలిపించి వడుగు చేసుకుంటావురా ? అంది. అదేంటమ్మా పొలం పనిలో ఉంటే పిలిపించి ఇదా అడగటం ఇప్పుడెందుకమ్మా ! అన్నాడు. మళ్ళీ అమ్మ ఇప్పుడు చేస్తే చేసుకుంటావా ? అన్నది. నీ ఇష్టం నీవు ఏంచేసినా ఎప్పుడు చేసినా సరే నన్నాడు రాధ. వెంటనే అమ్మ చిలుకకొయ్యకు తగిలించిన జందెం తీసి రాధకు వేసి వడుగైపోయింది పో అన్నది. వెంటనే కృష్ణవేణమ్మ, గజేంద్రమ్మలతో చెప్పి తలంటి పోయించి పాదాలకు పారాణి పెట్టించి పసుపు బట్టలు కట్టించి ఆ రోజు శివరాత్రి కావటంతో పూజలూ ఉన్నపుడు నన్ను భిక్ష అడగరా ! అని చెప్పింది. కిరీటంతో దేదీప్యమానంగా పరమ శివుడై వెలిగిపోతున్న అమ్మను "భవతీ భిక్షాం దేహి" అని అడిగాడు రాధ. అమ్మ అక్కడ ఉన్న పూలను రాధ జోలెలో వేసింది. జీవితం పూలబాటలా నడిపించటానికేమో ! తరువాత ఎన్ని ఉద్యోగాలు చేసినా మానినా కుటుంబ భారం మొత్తం అతడి భార్య లక్ష్మి మోసింది కాని రాధకు పట్టలేదు. నిర్లిప్తుడు గానే ఆనందంగా కాలం గడిపాడు. భద్రాద్రిరామ శాస్త్రి గారి చేత 16 రోజులు సంధ్యా వందనం నేర్పించింది. బుగ్గలు పట్టుకొని భృకుటి మధ్య కుంకుమ బొట్టు పెట్టుతూ "నాన్నా! ఇది నారక్ష" అన్నది అమ్మ. రాధకే గాదు అమ్మ వద్దకు వచ్చే వారందరికీ కుంకుమ భిక్ష రక్షణే. - ఎవరికి వారు అమ్మ తననే ప్రత్యేకించి చూస్తుంది అనుకుంటున్నా బ్రహ్మాండ నాయకి అయిన అమ్మ దృష్టి ఏ అర్హత లేని ఈ అల్పజీవిపైన కూడా పడ్డది కదా ! అని పొంగిపోయేవాడు రాధ. అమ్మ తనను ప్రత్యేకంగా చూస్తున్నది అనే ప్రగాఢ విశ్వాసం అతని నరనరాలలో పాతుకు పోయింది. జిల్లెళ్ళమూడి వదిలి హైదరాబాదుకు వచ్చేటప్పుడు అమ్మ అతని కిచ్చిన హామీ కూడా అది. "నీవు ఎక్కడున్నా నేనెప్పుడూ నీతోనే ఉంటాను నాన్నా!" అన్నది అలా ఉన్నది కూడా.

ఒకసారి రామకృష్ణ ఊరికి వెళ్ళటంతో అమ్మ వద్ద దర్శనాలిప్పించటానికి, పూజ చేయించటానికి అమ్మ కోరికపై రాధ పూజారిగా ఉన్న రోజులున్నవి. ఆ సమయంలో అమ్మ రాధతో అందిరిచేత పూజలు చేయిస్తున్నావు నీవెప్పుడూ, పూజ చేసుకోవేరా ? అంటే నిన్ను చూస్తూ , నీ మాటలు వింటూ, నీతో మాట్లాడుతూ ఆనందించటం తప్ప నాకు వేరే పూజ అలవాటు, ఆలోచనా లేదమ్మా! అంతా అసంకల్పితం గానే జరుగుతున్నది అన్నాడు రాధ. అమ్మ తన రెండు పాదాలు రాధ రెండు అరచేతుల్లో పెట్టింది. బ్రహ్మ కడిగిన పాదాలవి. అమ్మ పాదార విందాలు రాధ కరాంజలిలో వాలాయి. అకారుణ కరుణ అంటే అదే –

పోతుకూచి విద్యాసాగర్ గారి కుమారుడు రవి అనారోగ్యంతో బాధపడుతుంటే అమ్మ రాధను అతనితో కాలక్షేపానికి నియోగించింది. అతని సేవలోనే రాధకు కాలం గడచిపోయేది. ఆ రోజుల్లోనే ఆ ఊరి వ్యక్తి ఒకడు అమ్మ దగ్గరకు పూజకు పండ్లు పూలు ఒక పళ్ళెంలో పెట్టుకొని వచ్చాడు రవి అదిగమించి, వాడు ఆ పళ్ళెంలో పూల క్రింద కత్తి పెట్టుకొని వచ్చాడు అమ్మను చంపటానికి, నీవు వెళ్ళి తగు జాగ్రత్తలో ఉండు అని రాధను పంపించాడు. రాధ లోపలికి వెళ్ళి అమ్మతో మాట్లాడి వచ్చి ఇప్పుడే దర్శనాలు లేవని చెప్పాడు. వాడు పూలు అక్కడ పెట్టి అవతలకు వెళ్లాడు. రాధ పూలక్రింద వెతికి కత్తి ఉండటం గమనించాడు. మళ్ళీ లోపలకు వెళ్ళితే అమ్మ కనిపించలేదు. అక్కడ వాళ్ళని అడిగితే అమ్మ శేషగిరి రావన్నయ్య గదిలో మాట్లాడుతున్నదని చెప్పారు. ఒక నిమిషం క్రిందనే తను ఇక్కడ అమ్మతో మాట్లడాడు. ఆశ్చర్యం వేసింది రాధకు. అవసరమనుకుంటే అమ్మ ఒకేసారి అక్కడా ఇక్కడా కూడా ఉండగలదు, రవికి పూల క్రింద కత్తి ఉన్నట్లు కనిపించేటట్లు చేయగలదు. రాధ మాత్రం అమ్మ లీలలకు ఆనందించాడు. చివరకు పోతుకూచి రవి అంత్యక్రియలు రాధచేత చేయించడం విశేషం. విశ్వాసానికి రవి మారు పేరైతే, అతనికి (భక్తునికి) సేవ చేసే భాగ్యం, అంత్యక్రియలు చేసే అదృష్టం రాధకు అమ్మ ప్రసాదించటం అంతర్గతంగా ఏదో అర్థం కాని చారిత్రాత్మక విషయం.

రాధ జిల్లెళ్ళమూడిలో ఉన్న రోజులలోనే వసుంధర వివాహం జరిగింది. ఆ వివాహ క్రతువులో అమ్మను పురుషోత్తమునిగా దర్శించి ఆ కళ్యాణ వైభవాన్ని ఛాయా చిత్రాలలో బంధించే మహద్భాగ్యం రాధకు కలిగింది.

హైమకు రాధన్నయ్యంటే చాల ఇష్టం. రాధకు హైమ బంగారుతల్లే - వాళ్ళింట్లో ఆడబడుచుగా అన్ని మర్యాదలూ (సుబ్బారావు పెళ్ళిలో) పొందింది. రాధ వాళ్ళ అమ్మానాన్నలను అమ్మా నాన్నా అని పిలిచేది. అంతటి బంధం - హైమ చివరి రోజులలో కారణాలేవైనా - రాధ తనతో మాట్లాడక పోతే చాలా బాధపడేది. అది తలచుకొని హైమ ఎన్నిసార్లు పలుకరించినా తను మాట్లాడలేకపోయానే అని తన చివరి రోజులలో ఎంతో కుమిలి కుమిలి అనారోగ్యాన్ని కొనితెచ్చుకొన్నాడు. మరీ చివరి మూడు నాలగు సంవత్సరాలు అమ్మ స్మరణ హైమ చింతనే. తాను ఏమీ చేయలేక పోయానే అమ్మకు, హైమకు అని. చివరకు జిల్లెళ్ళమూడిలో ఉండాలన్న ఉండలేకపోతున్నానని బాధపడేవాడు. తెగించి మండల దీక్షలో ఉండాలని జిల్లెళ్ళమూడికి పోతే గుండెజబ్బుతో వెనుదిరిగి రావలసి వచ్చింది. దీక్ష పూర్తికాకుండానే.

ఏదైనా అమ్మ నిర్ణయించిన నిర్ణయాలలో పావులే ఎవరైనా. రాధ ముందు ముందు ఉండే అవకాశం ఉండదని తెలుసు కనుక కాబోలు, రాధను రెండేళ్ళు తన వద్దనే ఉంచుకొన్నది 1965లో అమ్మ. 1967 లో రాధ హైదరాబాద్ బయలుదేరు తుంటే తాను స్వయంగా అన్నం కలిపి కొసరి కొసరి గారాబంగా తినిపిస్తుంటే కృష్ణవేణమ్మక్కయ్య - మరీ ఇంత గారాబం చేస్తున్నావేంటమ్మా అంటే" వీడు నా అద్దాలలో బిడ్డడమ్మా ! అంది అమ్మ. మరి అప్పుడు ఇప్పుడు రాధలో అమ్మ ఉన్నదా, అమ్మలో రాధ ఉన్నాడా అంటే - రెండూ నిజమే అనిపిస్తుంది నాకు.

రాధను తలుచుకుంటుంటే వాడి అమాయకత్వము, ఆదరణగా ఆప్యాయంగా ఆంజనేయులుగారూ ! రండి రండి అంటూ పిలిచే ఆ ఆత్మీయతా అనుబంధం, స్వచ్ఛ హృదయం, ఇహ పరభోగాల పట్ల నిర్లిప్తత, ఆ చిరునవ్వు, ఆ ముఖంలో ఆనందము నాకు కన్నీళ్ళు తెప్పిస్తుంటాయి. జిల్లెళ్ళమూడికి సంబంధించినంత వరకు రాధ ఒక చారిత్రాత్మక పురుషుడు - ధన్యజీవి.

(29.3.2004 న అమ్మలో లీనమైన సందర్భంగా రాధ స్మరణిక ఈ రచన).

- పి.యస్. ఆర్.

***



తంగిరాల రాధాకృష్ణమూర్తి